# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక ఫిబ్రవరి 2011 ₹ 20



అన్నం వండాలి (రాజన్‌బాబు)

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

*- Dammapada.*

**సంపుటి 22 ఫిబ్రవరి 2011 సంచిక 2**



*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (బుద్ధఘోషుడు)

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి

డాక్టర్ అబ్బూరి గోపాలకృష్ణ

డాక్టర్ జయధీర్ తిరుమల రావు

డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి

కుర్రా జితేంద్రబాబు

*సహాయ సంపాదకులు*

కాంద్రేగుల నాగేశ్వర రావు

ముంగర జాషువ

*రెసిడెంట్ ఎడిటర్*

వల్లభనేని అశ్వినీకుమార్

*సంస్థాపక సంపాదకులు*

రవీంద్రనాథ్ ఆలపాటి



*Printed & Published by*

Bapanna Alapati

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in

Visit us at : www.misimi-monthly.com

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹200

విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

*మీ చందా **మిసిమి** పేర పై చిరునామాకు పంపండి.*


మరిన్ని వివరాలకు 64వ పుట చూడండి.

# ఈ నెల...


కమ్మతెమ్మెరలు ........ 3

కళ, సత్యం, రాజకీయాలు ........ 4
– *హెరాల్డ్ పింటర్*

మరుగుజ్జులుగా మిగిలిపోదామా? ........ 11
– *రవీంద్ర కేలేకర్*

తానొకటి తలచిన – దైవమొకటి తలచును! ........ 16
– *బిరుదురాజు రామరాజు*

నాట్యశాస్త్రంలో స్త్రీలు ........ 21
– *యస్.ఏ.టి. రాజ్యలక్ష్మి*

రాధికాసాంత్వనము –ముద్దుపళని ........ 23
– *ఎన్నార్కె*

ప్రపంచీకరణ – పదజాల పరిరక్షణ ........ 27
– *డా. మూలె విజయలక్ష్మి*

స్వాప్నిక చేతన ........ 31
– *సి నా రె*

ఛాయాగ్రహ నవాబు – రాజన్ బాబు ........ 32
– *కాంద్రేగుల నాగేశ్వర రావు*

ఒక రాత్రి ........ 34
– *డా. ఎన్.గోపి*

ఆరోహణ ........ 35
– *ముక్తవరం పార్థసారథి*

తెలుగునాట దేవతలు ........ 40
– *డా. మలయశ్రీ*

చరిత్ర, ఆగమ శాస్త్రం – తిరుమల ఆలయం ........ 43
– *డా. దేవిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి*

తెలుగు ముక్కల్లో కలుపు మొక్కలు ........ 49
– *అవసరాల రామకృష్ణా రావు*

కృషీవలుడు – గ్రామీణ జీవితం ........ 50
– *డా. మండి అన్వర్ హుస్సేన్*

భావచిత్ర చయనిక – ఏకాంతసేవ ........ 53
– *డా. వోలేటి పార్వతీశం*

జీవిత తత్వం ........ 57
– *సంజీవదేవ్*

తెలుగు రుబాయీలు ........ 59
– *డా. ఎండ్లూరి సుధాకర్*

చదవండి (పుస్తక పరిచయం) ........ 60

నవ్వులు ........ 62


| | | | |
|---|---|---|---|
| *ముఖచిత్రం* | : | లేడీ ఆఫ్ షలాట్ | (జాన్ విలియమ్ వాటర్‌హౌస్) |
| *రెండవ అట్ట* | : | అన్నం వండాలి | (రాజన్‌బాబు) |
| *మూడవ అట్ట* | : | కలయిక | (రాజన్‌బాబు) |
| *చివరి అట్ట* | : | దేవదూత | (జాన్ విలియమ్ వాటర్‌హౌస్) |

**ఉ**రుకుల పరుగుల కాలంలో ఎన్నో మార్పులు. కొత్త సాధనాలన్నీ అరచేతిలో వైకుంఠం చూపుతున్నాయి. ఈ జీవన విధానంలో వాడుక భాషలో కూడా ఎన్నో మార్పులు, చేర్పులు జరుగుతున్నాయి. ఈ ప్రక్రియలో ఎన్నో పదాలు వినమరుగవుతున్నాయి. ఇది ఈనాటి సమస్యకాదు – అన్నమయ్య పదాలు, పదబంధాలు అర్థంకాని కాలంలోకి వచ్చేశాం. తిక్కన వాడిన సమకాలీన, ప్రాంతీయ ప్రయోగాలు తెలియజెప్పే నిఘంటువుల కోసం వెతుక్కుంటున్నాము. ఇది ఇలా జరగవలసిందేనా? వృత్తిపరమైన పదాలను, ప్రాంతీయ పరిభాషను, వ్యవసాయ సంకేత పదాలను పరిరక్షించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ దిశగా అందరూ కృషి చేయవలసిందే.

అయిదుకోట్ల సంవత్సరాల నాటి ప్రాగ్రూప మానవుని మెదడు బరువు ఒక పౌను. ఇప్పటి మనిషి మెదడు  దానికి మూడురెట్లు ఎక్కువ. ఈ సుదీర్ఘ కాలంలో మానవేతిహాసంలో – ప్రకృతిని తనకు అనుకూలంగా మార్చుకునే దిశలో మానవుడు అధిరోహించిన సోపానాలు అనేకం. ఆ వివరాలు పరిశోధించి ప్రపంచానికి అందించిన బ్రోనొస్కి 'ఎసెంట్ ఆఫ్ మాన్' గ్రంథంలోని ముఖ్యభాగాలను **మిసిమి** పాఠకులకోసం ముక్తవరం పార్థసారథి అందిస్తున్నారు.

జానపద సాహిత్యాన్ని వెతికి వెలికితెచ్చి పల్లకీ ఎక్కించినవారు బిరుదురాజు రామరాజు. వారి 'పరిణతవాణి'ని విని తీరవలసిందే.

కొంకణి భాషలో జ్ఞానపీఠ పురస్కారం పొందిన మొదటి వ్యక్తి రవీంద్ర కేలేకర్. ప్రపంచ సాహిత్యంలో మనం మరుగుజ్జులుగా మిగిలిపోరాదని ప్రబోధించే వీరి ప్రసంగం ఎంతో స్ఫూర్తిదాయకం.

అగ్రరాజ్యాల అహంకారాన్ని, అబద్ధాలను – అనవసరపు యుద్ధాలను ఎండగట్టిన 'హెరాల్డ్ పింటర్' నోబెల్ ప్రసంగం అందరినీ ఆలోచింపజేస్తుంది.

ఈ నెల 11వ తేదీ ఆలపాటి రవీంద్రనాథ్ 15వ వర్ధంతి. ఆయన స్మృతికి నీరాజనం.

**– సంపాదకులు**




# కమ్మతెమ్మెరలు

*పత్రిక రూపురేఖల మార్పు జరిగినప్పటినుంచీ మాకు ఎన్నో ఉత్తరాలు వస్తున్నాయి. అభినందించినవారు, అభిశంసించిన వారూ పత్రికమీద అభిమానంతోనే అని మాకు తెలుసు. ఈ అభిప్రాయాలను పాఠకులందరితో పంచుకోవాలనే ఈ పలుకరింపు. చేవగలిగిన ఉత్తరానికి **'జాతక కథలు'** పుస్తకం బహుమతి.*

✶ "...మీ పత్రికలో అంబేద్కరిజమ్, బుద్ధిజమ్ గురించి, దళిత బహుజనుల చరిత్రగురించి వ్యాసాల ద్వారా తెలియ పరచగలరని ఆశిస్తున్నాను..."
**– సి. కపిల్,** ఆదిలాబాద్ జిల్లా.

✶ "...మిసిమి ప్రతి నెలా అందుతోంది. చదివి చాలా ఆనందిస్తున్నాను. తెలుగు భాషకు, సాహిత్యానికి మీ సేవను అభినందిస్తున్నాను..."
**– అనంత్ మల్లవరపు,** USA. (ఈ–మెయిల్)

✶ "...పత్రిక పూర్తిగా చదివాను. కొంత నిరాశ పరిచింది. కొన్ని పాత రచనలు వేశారు. 'మేల్కొలుపు' అనే కథానిక, పలాయన వాదాన్ని సూచిస్తున్నది. మీరు 'భారతి'లాగ పత్రిక నడపండి. ఈమని శివనాగిరెడ్డి గారు 'ఈ భూమి'లో చరిత్రపై వ్యాసాలు రాస్తున్నారు. 'మిసిమి'లో రాసినట్లయితే బాగుంటుంది. జయధీర్ తిరుమలరావు గారు 'నడుస్తున్న చరిత్ర' పత్రికలో భాషపై వ్యాసాలు వ్రాస్తున్నారు. మీ సమాలోచక మండలిలో వున్నవారు మీ పత్రికకు వ్రాస్తే బాగుంటుంది. జితేంద్రబాబుగారు తెలంగాణా చరిత్రపై ప్రసిద్ధులు. వీరి వ్యాసాలు తెలంగాణా విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయి. చారిత్రక, పరిశోధక, భాష, సాహిత్య విలువలు గలిగిన కొత్త వ్యాసాలు ప్రచురిస్తే, 'మిసిమి' నిజంగా మిసిమి కాగలదు..."
**– నాదెండ్ల మనోహర్, ఎమ్. శివాజి, రాఘవేందర్, ఆర్. కృష్ణ,** హైదరాబాద్.

✶ "...1995 నుంచి 'మిసిమి' పాఠకుడినే – ఇప్పటి మార్పు సంతోషకరం. చింతనాత్మక సాహిత్యం వెలుగులు చిమ్మాలని, మీ శ్రమ తప్పక ఫలిస్తుంది..."
**– ఎల్. నర్సింహారావు,** పెదపాడు.

✶ "...తెలుగు సాహిత్యానికి మంచి రోజులు వచ్చాయి. సినిమా కబుర్లు, కుళ్ళు రాజకీయాలు తప్ప మరొకటి కనిపించని ఈ రోజుల్లో మీ పత్రిక ఆశాకిరణం..."
**– సాయి బ్రహ్మానందం గొర్తి,** USA (ఈ–మెయిల్)

✶ "... మీరు పంపిన 'మిసిమి' సప్త సముద్రాలు దాటి నన్ను చేరింది. ప్రతి పేజీ ఆస్వాదించాను..."
**– డా. విజయ భక్ష్,** USA (ఈ–మెయిల్)

✶ "... మీ సూచిక చూసి ఇది అచ్చంగా తెలుగు పత్రిక అనుకున్నాను. ముఖపత్రాలు చూసి విలువగల పత్రిక అనుకున్నాను. నవంబర్ మిసిమి అందినది. మీరు చాలా ప్రాంప్ట్. ఆలపాటి రవీంద్రనాథ్ చిత్రం చూసి చాలా ఆనందించాను..."
**– మంగళ కందూర్** USA (ఈ–మెయిల్)

✶ "...'సొంతకత' అచ్చంగా సొంతంగా ఉంది. 'మాటల కందని పయనం' మాటలకందని అనుభూతే. 'ఆధునిక అరబ్ కవిత్వం' – మరో భాషలోని కవుల వ్యక్తిత్వాన్ని, కవిత్వాన్ని పరిచయం చేయడం బాగుంది. 'తెలుగు రుబాయీలు' మరో పత్రికలో చూసినట్లు గుర్తు..."
**– మాదిరాజు రంగారావు.**

✶ "...కొత్త గెటప్‌తో వెలువడుతున్న 'మిసిమి' బాగుంది. నేను 'మిసిమి' కి రచనలు పంపిస్తుంటాను..."
**– డా. అంపశయ్య నవీన్,** వరంగల్.

✶ "...మైఖెలేంజెలో 'పియట'ను పిచ్చి ప్రేమతో మరోసారి చూసుకునేలా చేసినందుకు కేవలం అభినందనలు సరిపోవనుకుంటాను. పానుగంటి, మునిమాణిక్యం రచనల్లో వ్యంగ్య వైభవం రుచి చూపటం ఎంతో బాగుంది. రచయితల పూర్తి చిరునామా ఇస్తే బాగుంటుందేమో..."
**– డా. మానేపల్లి,** యలమంచిలి.

✶ "...మైఖెలేంజెలో మహనీయ సృష్టి 'పియట' ముద్రించినందుకు మిమ్మల్ని ఏవిధంగా అభినందించాలి?..."
**– డా. భార్గవి** (వాయిస్ మెయిల్)

# కళ - సత్యం - రాజకీయాలు

**- హెరాల్డ్ పింటర్**

అక్షరానికి అదును, పదును అద్దిన హెరాల్ట్ పింటర్ ఇరాక్ మీద యుద్ధం ప్రకటించిన తర్వాత చేసిన తొలి వ్యాఖ్యలివి. 2005 సంవత్సరపు నోబెల్ పురస్కారం లభించిన పింటర్ కేవలం వినోదం కోసం కాక, సమకాలీన సమస్యల్ని, అధికార పీఠాలనధిష్టించి ప్రపంచాన్ని శాసిస్తున్న దుష్టపాలకుల బండారాన్ని బట్టబయలు చేసిన ప్రముఖ బ్రిటిష్ రచయిత. అక్టోబర్ 10, 1930 ఈస్ట్ లండన్‌లో జననం. ముప్పైకి పైగా నాటకాలు, ఇరవైతొమ్మిది స్క్రీన్‌ప్లేలు ("ది ఫ్రెంచ్ లెఫ్టినెంట్స్ ఉమన్" సినిమా స్క్రిప్టును ఆస్కార్ అవార్డుకు నామినేట్ చేశారు.) పదమూడు సంపుటాల వచన రచనలు (స్కెచెస్) ఎనిమిది కవితా సంకలనాలు, ఒక రేడియో నాటకం వగైరా ఇతని విస్తృత సృజనాపటిమకు నిదర్శనం. 27 నాటకాలకు దర్శకత్వం వహించారు. వాటిలో ఆయన సొంత నాటకాలు కూడా ఉన్నాయి. షేక్స్‌పియర్ ప్రైజ్, ఐరోపా సాహితీ బహుమతి, పిరాండెల్లో ప్రైజ్, డేవిడ్ కోహెన్ బ్రిటిష్ లిటరేచర్ ప్రైజ్, లారెన్స్ అలివర్ అవార్డులు అందుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడ రాజ్యాధికారం ప్రజలను అణగద్రొక్కినా నిష్కర్షగా విమర్శించే వ్యక్తి,హెరాల్డ్ పింటర్.

ఆయనకు తొలి రోజుల నుండీ రాజకీయాలంటే ఆసక్తి. నియంతృత్వ ధోరణులకు వ్యతిరేకంగా పోరాడాడు. "నియంతృత్వ ధోరణి" - ప్రభుత్వాలకు, అధికారులకు మాత్రమే పరిమితం కాదు; ఏ యిద్దరు వ్యక్తులు కలిసినా ఒకరు మరొకరి మీద పెత్తనం చలాయించటానికి ప్రయత్నిస్తారు. భార్యాభర్తల మధ్య, తల్లి-తండ్రి, కొడుకులు కూతుళ్ళ మధ్య ఇది నిత్యానుభవంగా అందరికీ తెలుసు అంటాడు.

**1958**లో నేనిలా వ్రాశాను: "నిజం-అబద్ధం, సత్యం-అసత్యం వీటిమధ్య తేడాల్లేవు. నిజానికి ఏదైనా సత్యమో, అసత్యమో కాదు; అది రెండూ కావొచ్చు."

ఈ స్టేట్‌మెంట్స్ కళ ద్వారా నిజాన్ని బయలుపరిచేందుకు ఇప్పటికీ ఉపయోగపడుతాయని నేను నమ్ముతున్నాను. ఒక రచయితగా నేను వాటిని సమర్థిస్తాను. ఒక పౌరుడిగా మాత్రం సమర్థించలేను. ఒక పౌరుడిగా నేను ప్రశ్నించాలి - ఏది నిజం? ఏది అబద్ధం? అని. నాటకంలో నిజం ఎల్లప్పుడూ అయోమయాన్ని మిగులుస్తుంది. దాన్ని నీవు కనుక్కోలేవు. ఎందుకంటే అది ఎప్పుడూ తప్పనిసరిగా పరిశోధించవలసిందే. శోధనే ప్రయత్నాన్ని కొనసాగిస్తుంది. శోధన నీవిధి. చీకట్లో దానికొట్టుకుని పడిపోవడమో లేదా దాని లాంటి ఓ అరూపాన్ని చూడ్డమో జరుగుతుంది. నిజమైన ఒకే సత్యం అంటూ ఏదీ నాటక కళలో లేదు. అందులో చాలా సత్యాలున్నాయి. అవి వొకదాన్నొకటి ఛాలెంజ్ చేసుకుంటాయి, విభేదిస్తాయి, ప్రతిబింబిస్తాయి, పట్టించుకోకుండా తప్పుకుంటాయి, హేళన చేసుకుంటాయి, కనీసం చూసుకోవు. సత్యం నీచేతికందినట్టు ఓ క్షణం భావిస్తావు. జారిపోతుంది, మాయమౌతుంది.

నా నాటకాల్ని ఎలా రూపొందించాలని నన్నడుగు తుంటారు. నేనేమీ చెప్పలేను. వాటిని సమర్థించనూ లేను. అదంతే. అలా జరిగిందంతే అంటాను. చాలా నాటకాలు ఒకవాక్యం, ఒక పదం, ఒక భావచిత్రంతో ప్రారంభమౌతాయి. పదంతో బాటు భావ చిత్రం వస్తుంది. నేనిందుకు రెండుదాహరణలిస్తాను. వాటిలోని భావచిత్రాలు హఠాత్తుగా ఆకాశాన్నించి ఊడిపడ్డాయి.

ఆ నాటకాలు 'ది హోమ్ కమింగ్', 'ఓల్డ్ టైమ్స్.' 'హోమ్ కమింగ్' కి మొదటి వాక్యం - 'ఆ కత్తెరతో ఏం చేశావు?' 'ది ఓల్ట్ టైమ్స్'కి మొదటి వాక్యం - 'చీకటి.'

డా. బి.వి. రామిరెడ్డి, ఫోన్ : 9908856530

ఈ రెండు సందర్భాలలోను నాకు తరువాతి విషయం తెలియదు.

మొదటి సందర్భంలో ఎవరో కత్తెరకోసం, అదెక్కడుందో అడుగుతున్నాడు. దాన్నెవరో దొంగిలించారనే అనుమానంతో అడుగుతున్నాడు. ఆ కత్తెరనెవరూ యివ్వలేదు. ప్రశ్నకు సమాధానమూ రాలేదు.

'చీకటి' – ఒక స్త్రీ శిరోజాల వర్ణన. ఒక ప్రశ్నకు సమాధానం. రెండు సందర్భాల్లోను తరువాతి విషయాన్ని తెలుసుకునేందుకు నేను తప్పనిసరిగా ప్రయత్నించాల్సిన పరిస్థితి.

చీకటి–పెద్ద కిటికీ. సాయంత్రపుటాకాశం పురుషుడు (డీలీ), స్త్రీ (కేట్) పానీయాలతో కూచుని వుంటారు. మగాయన అడుగుతాడు – బలిసిందా లేక బక్కదా? వాళ్ళు మాట్లాడేదెవర్ని గురించి? అప్పుడు చూశాను కిటికీ ప్రక్కన ఒక స్త్రీ నించుని వుంది (అన్నా). ఆమె వీపు వీళ్ళకి తిప్పి వుంది. ఆమె శిరోజాలు నల్లగా వున్నాయి. చీకటి.

మన ప్రారంభాలకి అంతం తెలీదు.

అది పాత్రల్ని సృజించే చిత్రమైన సందర్భం. అప్పటిదాకా వాటికి ఉనికి లేదు. తరువాత జరిగేదంతా అనిశ్చితి. అప్పటికప్పుడు, భ్రమాత్మకం. ఒక్కోసారి దాన్ని ఆపలేం. రచయిత పరిస్థితి విచిత్రమైంది. అతని పాత్రలతన్ని ఆహ్వానించవు. పైగా అతనికి ఎదురు తిరుగుతాయి. వాటితో కలిసి బ్రతకడం అంత తేలిక కాదు. వాటిని నిర్వచించడం అసాధ్యం. వాటిని నీవు శాసించలేవు. వాటితో అనంతమైన ఆటాడతావు. అదొక పిల్లి–ఎలుక ఆట. దాగుడుమూతలాట. చివరికి వాళ్ళు రక్త మాంసాలతో, వ్యక్తిగతమైన సున్నితత్వాలతో నీ చేతుల్లోకి వొస్తారు.

అందుచేతనే కళలో భాష గొప్ప గందరగోళపు గొడవ, ఊబి, గడ్డకట్టిన నీటి గుంట. రచయిత ఎప్పుడో అప్పుడు వాటిల్లో కూరుకుపోవచ్చు.



హెరాల్డ్ పింటర్

కాని నేను చెప్పినట్టు సత్యాన్వేషణ ఆగదు. వాయిదా వెయ్యడం కుదరదు. దాన్ని అక్కడికక్కడే ఎదుర్కోవాలి. రాజకీయ నాటకరంగం వేరే రకమైన సమస్యల్ని మన ముందుంచుతుంది.నీతులు చెప్పడం పూర్తిగా మానెయ్యాలి. ఆబ్జెక్టివిటీ తప్పనిసరి. పాత్రల్ని వాటి ఊపిరి వాటిని పీల్చుకోనివ్వాలి. రచయిత తన యిష్ట ప్రకారమో, సంతృప్తి కోసమో వాటిని నియంత్రించకూడదు. అతడు ఎన్నో కోణాలనుంచి వాటిని చూసేందుకు సిద్ధమవ్వాలి. వాటిని సంపూర్ణంగా, ఆశ్చర్యకరంగా వుంచాలి. అప్పుడప్పుడూ వాటికి స్వేచ్ఛ నివ్వాలి. ఇదే సూత్రం ఎల్లప్పుడూ పని చెయ్యదు. రాజకీయ వ్యంగ్యం ఈ సూత్రాలకు లొంగదు.

నా నాటకం "బర్త్‌డే పార్టీ"లో నేను ఎన్నో ప్రత్యామ్నాయాలకు అవకాశం కల్పించి చివరికి వాటిని నియంత్రణలోకి తెచ్చాను.

"మౌంటెన్ లాంగ్వేజ్"లో అలాంటి అవకాశం లేదు. అది క్రూరంగా, చిన్నగా, వికృతంగా మిగుల్తుంది. అయితే అందులోని సిపాయిలు దాంట్లోంచి కొంత హాస్యానందాన్ని పొందుతారు. హింసలు బోరు కొడతాయని కొందరు మర్చిపోతారు. వారికి కొంత నవ్వూ అవసరమే. బాగ్దాదులోని అబూ ఘ్రాయిబ్‌లో జరిగిన సంఘటనలు దీన్ని బలపరుస్తాయి. "మౌంటెన్ లాంగ్వేజ్" కేవలం ఇరవై నిమిషాల నాటిక. కాని, గంట తరువాత గంట, అనంతంగా, అదేపద్ధతిలో నడువగలదు.

"ఏషెస్ టు ఏషెస్" నీటి అడుగున జరుగుతుంది. మునిగిపోతున్న ఒక స్త్రీ...ఆమె చేయి అలలపైకి వొస్తుంటుంది. మళ్ళీ కనబడకుండా మునిగిపోతుంది. అక్కడ పైనా, లోపలా ఎవరూ లేరు. కేవలం నీడలు, ప్రతిబింబాలు ... తేలడాలు... ఆమె కనిపించదు. ఆమె ప్రమాదంనించి తప్పించుకోలేదు. మరి, వాళ్ళంతా చనిపోయారు కాబట్టి ఆవిడా చనిపోవాల్సిందే.

రాజకీయవాదులు ప్రయోగించే రాజకీయ భాషకు వస్తే, అధిక సంఖ్యాక రాజకీయవాదులకి సత్యం అంటే యిష్టం వుండదు. వాళ్ళక్కావలసింది అధికారమూ, దాన్ని

నిలుపుకోవడమూను. వాళ్ళు అధికారాన్ని నిలుపుకోవాలంటే ప్రజలు అజ్ఞానంలో వుండాలి. అలా అజ్ఞానంలో ఉండడమే సత్యం. అందుకే మనచుట్టూ అబద్ధాలు. వాటితోనే జనం బతుకుతుంటారు.

సోవియట్ యూనియన్‌లో ఏం జరిగిందో ప్రతివొక్కరికీ తెలుసు. యుద్ధం తరువాత తూర్పు యూరోప్ దేశాల్లో పద్ధతి ప్రకారం జరిగిన క్రూరత్వం, అరాచక కృత్యాలు, స్వతంత్రాలోచనల్ని అణగదొక్కడం జరిగాయి. ఇవన్నీ చరిత్ర పుటలకెక్కాయి.

ఇక్కడున్న ప్రతివొక్కరికి తెలుసు. ఇరాక్‌మీద దండయాత్ర సమర్థించుకోవాలంటే సద్దాం హుస్సేన్ భయంకరమైన మారణాయుధాలను కలిగి వున్నాడనీ, వాటిని ప్రయోగిస్తే 45 నిమిషాల్లో యావత్ ప్రపంచం సర్వనాశనమౌతుందనీ, ఇదంతా నగ్నసత్యమనీ నమ్మబలుకుతారు. ఇది నిజంకాదు. ఇరాక్‌కు అల్‌ఖైదాతో సంబంధాలున్నాయనీ, సెప్టెంబరు 11, 2001 న్యూయార్క్‌పై దాడి, వారిద్దరి బాధ్యతేననీ మనకి చెబుతారు. అదే సత్యమని మనకు నమ్మకం కలిగించే ప్రయత్నం చేస్తారు. అది నిజం కాదు. ఇరాక్ ప్రపంచానికి రక్షణలేకుండా చేస్తోందని చెబుతారు. అది నిజంకాదు.

సోవియట్ యూనియన్‌లో ఏం జరిగిందో ప్రతివొక్కరికీ తెలుసు. యుద్ధం తరువాత తూర్పు యూరోప్ దేశాల్లో పద్ధతి ప్రకారం జరిగిన క్రూరత్వం, అరాచక కృత్యాలు, స్వతంత్రాలోచనల్ని అణగదొక్కడం జరిగాయి. ఇవన్నీ చరిత్ర పుటలకెక్కాయి.

అసలు సత్యం వేరే వుంది. అమెరికా ఈ ప్రపంచంలో తన పాత్రను అర్థం చేసుకోవడం, దాన్ని నిలుపుకోవడం అనేది అసలు సత్యం. వర్తమానానికొచ్చేముందు గతాన్ని చూడాలి. ముఖ్యంగా రెండో ప్రపంచ యుద్ధం తరువాత అమెరికా విదేశాంగ విధానాన్ని చూడండి. ఆ కాలంలో అమెరికా నేరాలు నిజమైన నేరాలుగా రికార్డు కాలేదు. కొన్నింటిని అసలు నేరాలుగానే గుర్తించలేదు.

ఒక స్వతంత్ర దేశంమీద డైరెక్టుగా దాడి చేయడం లాంటి పద్ధతి అమెరికాకు యిష్టంగా వుండదు. అలా కాకుండా, ఆ దేశాలు అన్ని రంగాల్లోను, ఆర్థికంగాను దెబ్బతినేట్టుచేసి, వాటిని ఆదుకునేందుకు తాము సహాయపడుతున్నట్టు, ప్రజాస్వామ్యాన్ని బ్రతికించేందుకు సర్వవిధాల సాయం చేస్తున్నట్టు బయటి ప్రపంచాన్ని నమ్మించడమే అమెరికా విదేశాంగ విధానం.

నికరాగ్వా ఇందుకు గొప్ప ఉదాహరణ. అమెరికా ఈనాటి ప్రపంచంలో తన పాత్రేమిటో తెలియజేసేందుకు ఈ ఉదాహరణ నిచ్చాను.

1980లో యు.ఎస్. ఎంబసీలో ఒక సమావేశానికి హాజరయ్యాను.

నికరాగ్వాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంట్రాలు నడుపుతున్న ఉద్యమానికి అధిక ఆర్థిక సాయం చేసే విషయాన్ని చర్చించేందుకు అమెరికన్ కాంగ్రెస్ సమావేశం కాబోతోంది. నికరాగ్వా తరఫున వాదించవలసిన సంఘంలో నేను సభ్యుణ్ణి. ఆ సంఘంలో ఫాదర్ జాన్ మెట్కాఫ్ చాలా ప్రాముఖ్యంగల సభ్యుడు. అమెరికన్ ప్రతినిధి వర్గానికి రేమండ్ సెయిజ్ నాయకుడు. సమావేశంలో ఫాదర్ మెట్కాఫ్ అన్నారు: "సర్, ఉత్తర నికరాగ్వాలోని చర్చికి నేను అధ్యక్షుణ్ణి. మా చర్చి సభ్యులు ఒక స్కూలు, ఆరోగ్య కేంద్రం, ఒక సాంస్కృతిక సమాఖ్యను నిర్మించుకున్నారు. మేమంతా ప్రశాంతంగా జీవిస్తున్నాం. కొన్ని నెలల క్రితం కాంట్రా సైనికులు మా చర్చి మీద దాడిచేసి స్కూలును, ఆరోగ్య కేంద్రాన్ని, సాంస్కృతిక కేంద్రాన్ని ధ్వంసం చేశారు. నర్సుల్ని, టీచర్లని రేప్ చేశారు. డాక్టర్లని చంపేశారు. వాళ్ళు అటవికుల్లా ప్రవర్తించారు. ఇలాంటి ఉగ్రవాదులకు మీ సహాయసహకారాలను ఉపసంహరించుకోవలసిందిగా అమెరికా ప్రభుత్వాన్ని మీరు వొత్తిడి చేయమని మిమ్మల్ని అర్థిస్తున్నాము."

తార్కికంగా ఆలోచించే బాధ్యతగల వ్యక్తిగా రేమండ్ సెయిజ్‌కి మంచి పేరుంది. డిప్లొమాటిక్ సర్కిల్స్‌లో ఆయనంటే అందరికీ గౌరవ భావం వుంది. ఆయన సావధానంగా విని, కాస్సేపాగి మాట్లాడారు: "ఫాదర్, మీకోవిషయం చెప్పాలి. యుద్ధంలో ఎప్పుడూ కష్టాలను భరించేది అమాయిక ప్రజలే!" నిశ్శబ్దం ఘనీభవించింది. మేం ఆయనవేపు విప్పారిన కళ్ళతో చూశాం. ఆయనేమీ చలించలేదు.

నిజంగా అమాయకపు ప్రజలు ఎప్పుడూ కష్టాలనుభవిస్తూనే వుంటారు.

చివరికి ఎవరో అన్నారు: "అయితే ఈ విషయంలో మాత్రం 'అమాయిక ప్రజలు' యీ ప్రభుత్వం నించి సహాయాన్ని

పొందినవారివల్ల కష్టాల పాలయ్యారు. మీ కాంగ్రెస్ కాంట్రాలకు ఎక్కువ ఆర్థికసాయాన్ని అంగీకరిస్తే ఇంకా ఎన్నో అరాచకాలు జరిగే అవకాశం వుంది. ఇది అంత పట్టించుకోవలసిన విషయంగా మీ కనిపించడంలేదా? ఈ హత్యలు, అత్యాచారాలు, విధ్వంసాలకు మీ ప్రభుత్వం సిగ్గుపడడం లేదా?" సెయిజ్ ఏ మాత్రం చలించలేదు– "మీ అభిప్రాయాలతో నేను ఏకీభవించను."

మేము ఎంబసీనుండి బయటకు వస్తుండగా విదేశాంగ కార్యాలయ ఉద్యోగి వొకరు నాతో చెప్పారు: సెయిజ్‌కి నా నాటకాలంటే ఇష్టం అని. నేనేమీ సమాధానం చెప్పలేదు.

మీకు ప్రెసిడెంట్ రీగన్ స్టేట్‌మెంట్‌ని గుర్తు చేయాలి: "కాంట్రాలు మోరల్‌గా మనఫౌండింగ్ ఫాదర్స్‌తో సమానం."

అమెరికా నికరాగ్వాలో 'సామోజా' రాక్షస నియంతృత్వాన్ని నలభైయేళ్ళుగా సమర్థిస్తోంది. సాండినిస్టాల నాయకత్వంలో నికరాగ్వా ప్రజలు 1979లో విప్లవం ద్వారా ఆ నియంతృత్వాన్ని అంతంచేశారు. అలాగని సాండినిస్టాలూ పవిత్రులుకారు. వాళ్ళకీ తలబిరుసు తనం వుంది. వారి రాజకీయతత్వంలో ఎన్నో వైరుధ్యాలున్నాయి. అయితే వాళ్ళు తెలివైనవాళ్ళు, సంస్కారవంతులు. వారు స్థిరమైన బహుళ జాతి సమాజాన్ని నిర్మించే ప్రయత్నం చేస్తున్నారు. మరణ శిక్షను నిషేధించారు. వేలాది మంది పేదల్ని, రైతుల్ని ఆదుకున్నారు. లక్షమందికి భూవసతి కల్పించారు. రెండువేల పాఠశాలలు నిర్మించారు. 1/7వ వంతు నిరక్షరాస్యతని తగ్గించారు. ఉచితవిద్య, ఉచిత ఆరోగ్యాన్ని అందించారు. మూడోవంతు శిశు మరణాల్ని తగ్గించారు. పోలియో రహిత సమాజాన్ని సాధించారు.



అమెరికా దీన్నంతటిని మార్క్సిస్టు లెనినిస్టు బలహీనతగా అభివర్ణించింది. అమెరికాదృష్టిలో అదొక ప్రమాదకరమైన వ్యవస్థ. ఈ రకమైన సాంఘిక, ఆర్థిక న్యాయం, ఆరోగ్యం, విద్య, సాంఘిక ఐక్యత, జాతీయగౌరవం లాంటి వాటిని చూసి చుట్టూ వున్న దేశాలు మాకూ అలాంటివే కావాలని అడిగితే? ఎల్ సాల్వడార్‌లో ఆ సమయంలో తీవ్ర ప్రతిఘటన వుంది.

ఇంతకుముందు మనచుట్టూ ఆవరించుకుని ఉన్న అబద్ధాల నిర్మాణం గురించి మాట్లాడాను. ప్రెసిడెంట్ రీగన్ నికరాగ్వాను టోటలిటేరియన్ చీకటి గుహగా వర్ణించారు. మీడియా, బ్రిటీషు ప్రభుత్వం దీన్ని సరైన అంచనాగా తీసుకున్నాయి. సాండినిస్టా ప్రభుత్వంలో చావులులేవు. హింస లేదు. అధికారిక మిలిటరీ రాక్షసత్వంలేదు. పాస్టర్లు హత్య చేయబడలేదు. నిజానికి ఆ ప్రభుత్వంలో ముగ్గురు ప్రీస్టులున్నారు. వారు ఒక మేరీనాత్ మిషనరీ, ఇద్దరు జెసూట్‌లు, నిజానికి టోటలిటేరియన్ చీకటి గుహలు పొరుగున వున్న ఎల్ సాల్వడార్, గ్వాటిమాలాలు. 1954లో గ్వాటిమాలాలో ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని అమెరికా దించివేసింది. రెండు లక్షల మంది, సైనిక నియంతృత్వాన్ని చవిచూశారు.

ప్రపంచంలో అతి ప్రసిద్ధులైన ఆరుగురు జెసూట్స్‌ని 1989లో సాన్ సాల్వడార్‌లోని సెంట్రల్ అమెరికన్ యూనివర్సిటీలో హత్యచేశారు. హత్యచేసిన అల్‌కెటల్ రెజిమెంట్ అమెరికాలోని జార్జియాలోని ఫోర్ట్ బెన్నింగ్‌లో శిక్షణ తీసుకున్నవాళ్ళే. అత్యంత ధైర్యశాలి ఆర్చిబిషప్ రోమిరో చర్చిలో బోధిస్తుండగా హత్య చేయబడ్డాడు. వాళ్ళెందుకు చంపబడ్డారు. మంచి జీవితాన్ని సాధించవచ్చునని నమ్మారు కాబట్టే. ఆ నమ్మకం వాళ్ళమీద కమ్యూనిస్టు ముద్రవేసింది. అందుకు కారణం వాళ్ళు ప్రభుత్వ స్టేటస్కోని ధైర్యంగా ప్రశ్నించారు. పేదరిక నిర్మూలన, రోగం, పతనం, నియంతృత్వం లాంటి వాటిని ప్రశ్నించారు.

అమెరికా చివరికి సాండినిస్టా ప్రభుత్వాన్ని కూలదోసింది. ముప్పైవేలమంది చనిపోయారు. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. మళ్ళీ వాళ్లు పేదరికంలోకి నెట్టబడ్డారు. కాసినోటే మళ్ళీ దేశంలోకి తిరిగొచ్చారు. ఉచితవిద్య, ఆరోగ్యం అంతమయ్యాయి. పెద్దవ్యాపారం మొదలైంది. ప్రజాస్వామ్యం వర్ధిల్లింది.

ఇదే విధానాన్ని అమెరికా ప్రపంచమంతటా అమలు చేసింది. దానికి అంతమంటూ లేదు. ఏమీ జరగనట్టుగా అది ప్రవర్తిస్తోంది.

రెండో ప్రపంచయుద్ధం తరువాత అమెరికా రైటిస్ట్ మిలిటరీ నియంతృత్వాన్ని ప్రపంచమంతటా సమర్థించింది. ఇండోనేసియా, గ్రీస్, ఉరుగ్వే, బ్రెజిల్, పరాగ్వే, హైతి, టర్కీ

ఫిలిప్పీన్స్, గ్వాటిమాలా, ఎల్‌సాల్వడార్, చిలీ ఇందుకు ఉదాహరణలు. 1973లో చిలీ మీద అమెరికా ప్రయోగించిన భయానకాలను ఎన్నటికీ క్షమించలేం.

ఈ దేశాల్లో వేలాదిమంది చనిపోయారు. ఈ చావులన్నీ అమెరికా విదేశాంగ విధానానికి సంబంధించినది కావా? ఎవరికీ ఇవి తెలియవు.

అవి ఎప్పుడూ జరిగినట్టు లేవు. అవి జరుగుతున్నప్పుడూ అలా అనిపించలేదు. అవి ఎవరికీ పట్టలేదు. అమెరికా నేరాలు ఒక పద్ధతి ప్రకారం వరుసగా, భయంకరంగా జరిగాయి. ఎవరికీ వాటి గురించి తెలీదు. ప్రపంచం మేలుకోరి, ప్రపంచ మంతటికీ వైద్య విధానంలాగ అమెరికా వీటిని అమలు పరిచింది. ఆ పని చాలా తెలివిగా చేసింది.

అమెరికాది గొప్ప రోడ్‌షో. రాక్షసమైన, పట్టించుకోని, నీచమైన, నీతిమాలిన ఆ పనుల్ని చాలా తెలివిగా చేసింది. అది తన వ్యాపారంలో ప్రపంచాని కమ్మిన వస్తువు – స్వీయ ప్రేమ. గెలుపుదానిదే. అందరు అమెరికా అధ్యక్షుల ఉపన్యాసాలు వినండి – ''ఇది అమెరికన్ల హక్కుల్ని సమర్థించుకోవలసిన సమయం. అందుచేత ప్రజలంతా తమ అధ్యక్షుల్ని నమ్మాలి ప్రజలతరఫున వాళ్ళు చేసే వాటిని సమర్థించాలి.''

అమెరికా నిర్భయంగా ప్రవర్తిస్తుంది. ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ న్యాయం, విమర్శ ఇవన్నీ అర్థంలేనివిగా అది కొట్టి పారేస్తుంది. వీనికి దన్ను దీనివెనుక తలొంచుకు నడిచే గొర్రె పిల్ల – బ్రిటన్.

''అమెరికన్లు'' అనే మాటతో ఇంక ఎవ్వరూ ఆలోచించకూడదు. విమర్శనాత్మకంగా చూడకూడదు.వారు నమ్మాలి. అంతే. అదొక తెలివైన పద్ధతి. ఇదంతా 40 మిలియన్ల ప్రజలకీ, జైళ్ళలో పడివున్న రెండు మిలియన్ల మనుషులకీ వర్తించదు.

అమెరికా నిర్భయంగా ప్రవర్తిస్తుంది. ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ న్యాయం, విమర్శ ఇవన్నీ అర్థంలేనివిగా అది కొట్టి పారేస్తుంది. వీనికి దన్ను దీనివెనుక తలొంచుకు నడిచే గొర్రె పిల్ల – బ్రిటన్.

మన జాతీయ భావనకు ఏమయింది? అసలు మనకు జాతీయభావన వుందా? మనకు అంతరాత్మ అనేది వుందా? చచ్చిపోయిందా? మనసాటి మనుషులతో బాధ్యతల్ని పంచుకునే కనీస బాధ్యతని విస్మరించామా? 'గ్వాంటినామో బే' ని చూడండి. ఏ నేరారోపణా లేకుండా వందలాదిమందిని మూడు సంవత్సరాలు నిర్బంధించారు. వారి తరఫున న్యాయ పోరాటం చేసేవారు లేరు. జెనీవా కన్వెన్షన్ పట్టించుకోలేదు. ఐక్యరాజ్యసమితి కూడా దీన్ని గురించి ఆలోచించలేదు. ప్రపంచ నాయకత్వం తమదేనని చెప్పుకునే దేశం ఈ నేరాలకు పాల్పడింది. మనం గ్వాంటనామోబే ప్రజల గురించి ఆలోచిస్తున్నామా? మీడియా వారి గురించి ఏం చెబుతోంది? ఆరోపేజీలో ఓ మూల ఎప్పుడన్నా ఏవో వ్రాస్తాయి. అదొక మనుషుల్లేని భూఖండమై పోయింది. ప్రస్తుతం అక్కడ చాలామంది నిరసన దీక్ష చేస్తున్నారు. వారిలో బ్రిటీష్ పేరుతో వున్నారు.అక్కడంతా హింసే. బ్రిటీషు విదేశాంగ కార్యదర్శి ఏం చెప్పారు? ఏమీ చెప్పలేదు. బ్రిటీషు ప్రధాని ఏం చెప్పాడు? ఏమీ చెప్పలేదు. ఎందుకని? ఎందుకంటే గ్వాటినామోబేలో మన విధానాన్ని విమర్శించడం మైత్రీ రాహిత్యం అవుతుంది అని అమెరికా అన్నది కాబట్టి. బ్లెయిరు నోరుమూసుకున్నాడు.

ఇరాక్‌పై దురాక్రమణ ఒక బందిపోటు చర్య. అంతర్జాతీయ న్యాయసూత్రాలకు విరుద్ధం. అబద్ధాలను ఆధారంగా చేసుకుని, మీడియాను గుప్పిట్లో పెట్టుకుని చేసిన సైనిక చర్య. మధ్య ప్రాచ్యంమీద ఆర్థిక పెత్తనాన్ని చెలాయించేందుకు ఉపయోగించుకున్న చివరి అస్త్రం. వేలాదిమంది అమాయకుల ప్రాణాల్ని బలిగొన్న సైనికశక్తి.

ఈ హింస, క్లస్టర్ బాంబులు, యురేనియం, హత్యలు, దయనీయస్థితి, పతనం, చావు–వీటన్నింటినీ మధ్య ప్రాచ్యానికి స్వేచ్ఛను ప్రసాదించడం, ప్రజాస్వామ్యం అని పిలిచారు.

ప్రజాహంతకుడు, యుద్ధనేరస్తుడు అనేవాటికి నీవు అర్హుడవి కావాలంటే ఇంకెంతమందిని అంతం చేయాలి? ఇక చాలు. అంతర్జాతీయ నేరాల న్యాయస్థానం ముందు బుష్‌నీ, బ్లెయిర్‌నీ దోషులుగా నిలబెట్టి శిక్షించాలి. బుష్ తెలివైనవాడు. అంతర్జాతీయ నేరాల న్యాయస్థానాన్ని స్థిరీకరించలేదు. అమెరికన్ సైనికుడుగాని, రాజకీయవేత్తగాని ఓడరేవులోవుంటే వెంటనే మెరైన్లని పంపుతాడు. టోనీ బ్లెయిర్ కోర్టుని స్థిరీకరించాడు. అందుచేత శిక్షకు దొరుకుతాడు. కోర్టు చిరునామా: నం.10, డౌనింగ్ స్ట్రీట్, లండన్.

ప్రస్తుతం చావు సంగతి అసందర్భం. కనీసం లక్షమంది ఇరాకీలు, అమెరికన్ బాంబులు మిస్సైళ్ళవల్ల చనిపోయారు. వాళ్ళ చావులు రికార్డు కాలేదు. "మేము శరీరాలను లెక్కించం" – అన్నాడు అమెరికన్ జనరల్ టామీ ఫ్రాంక్స్.

దురాక్రమణకు ముందు ఒక బ్రిటిషు వార్తాపత్రిక మొదటి పేజీమీద ఒక చిన్న ఇరాకీ పిల్లాణ్ణి ముద్దెట్టుకుంటున్న ఫోటో ముద్రించబడింది. దాని క్రింద – "కృతజ్ఞుడైన పిల్లాడు" అని వ్రాయబడింది. కొన్ని రోజుల తరువాత, లోపలి పేజీలో మరొక నాలుగేళ్ళపిల్లాడి కథ, చేతుల్లేని ఫోటో ముద్రింప బడింది. అతని కుటుంబం మిస్సైల్ అటాక్‌లో ధ్వంసమైంది. అతనొక్కడే బ్రతికాడు. "నా చేతులు నాకెప్పుడొస్తాయి?" అని ఆ పిల్లవాడడిగాడు. టోనీ బ్లెయిర్ పిల్లాణ్ణి చేతుల్లో కెత్తుకోలేదు. రక్తం మురికి కదా. అది అతని టైని, కోటుని మురికి చేస్తుంది. టి.వి.లో ఉపన్యసించేప్పుడు ఆ మురికి మనకంటపడడం బావుండదు.

రెండువేలమంది అమెరికన్లు చనిపోవడం ఇబ్బందికరం. చీకట్లో వారిని స్మశానానికి తరలించారు. కర్మకాండలు కుదరవు. క్షతగాత్రులు ప్రక్కలమీద కుళ్ళుతుంటారు. కొందరు శాశ్వతంగా అంగవికలులౌతారు. చచ్చినవాళ్ళూ, అంగవికలురూ అంతా కుళ్ళిపోతారు.

ఒక కవితలో పాబ్లో నెరూద ఇలా వ్రాశాడు : ఆ కవిత – "ఐయామ్ ఎక్స్‌ప్లెయినింగ్ ఎ ఫ్యూ థింగ్స్."

మరి ... ఒక ఉదయం అంతా మండిపోతోంది.
ఒక ఉదయం... ఆ మంటలు
భూమినించి ఎగిశాయి.
మనుషుల్ని చీలుస్తూ, కాలుస్తూ
తుపాకీమందుమీద, రక్తంమీద
దోపిడీ గాళ్ళు... విమానాలతో ఎడారి దిబ్బలతో
దోపిడీగాళ్ళు చేతి ఉంగరాలతో జమీందారిణులతో
దోపిడీ గాళ్ళు నల్లని కాథలిక్ సాధువుల దీవెనలతో
ఆకాశం నించి వొచ్చారు పిల్లల్ని చంపేందుకు
పిల్లల రక్తం వీథుల్లో ప్రవహించింది
ఏ సందడీ లేకుండా పిల్లల రక్తంలాగ
నక్కలు...ఆ నక్కలు వాళ్లని పట్టించుకోవు
ఎండిన ముళ్ళపొదలు గుచ్చుకుంటున్నాయి
విషనాగుల్ని ఉమ్ముతూ
విషనాగులు అసహ్యించుకునే విషనాగుల్ని.
ముఖా ముఖీ నీతో స్పెయిన్ శిఖరపు అలలాంటి ఆ రక్తాన్ని చూశాను.
అది నిన్ను నీ గర్వాన్ని కత్తుల్ని ముంచుతుంది.
మోసపు సైనికాధిపతులారా:
నా చచ్చిపోయిన ఇంటిని చూడండి
ముక్కలైన స్పెయిన్‌ని చూడండి
స్పెయిన్‌లోని ప్రతి గూటినించీ
మండుతున్న లోహ ప్రవాహాల్నించి
స్పెయిన్ వొస్తుంది.
చనిపోయిన ప్రతిబాలుడి నించీ కళ్ళున్న రైఫిల్
నేరాలనించి బుల్లెట్లు పుడతాయి
ఏదో ఓరోజు
నీ హృదయ నేత్రానికి ఎక్కు పెడతాయి
నువ్వడుగుతావు :
అతని కవిత్వం కలల గురించీ ఆకుల గురించీ
తన మాతృదేశపు గొప్ప అగ్నిపర్వతాలగురించీ
ఎందుకు మాట్లాడదు?
వొచ్చి వీథుల్లోని రక్తాన్ని చూడు
వొచ్చి వీథుల్లోని రక్తాన్ని చూడు
వొచ్చి వీథుల్లోని రక్తాన్ని చూడు.

నెరూడా కవితను ఎందుకు ఉటంకిస్తున్నానంటే రిపబ్లికన్ స్పెయిన్ని సద్దాం హుస్సేను ఇరాక్‌తో పోల్చడం లేదు. నెరూడాను ఎందుకు ఉటంకిస్తున్నానంటే సమకాలీన కవిత్వంలో ఎక్కడా అంతశక్తివంతంగా సామాన్య ప్రజలమీద బాంబులు వేయడాన్ని ఎవరూ చెప్పలేదు గనుక.

నేను చెప్పినట్టుగా అమెరికా భూమి, సముద్రం, గాలి, ఆకాశం – అన్నిటిమీదా ఆధిపత్యాన్ని కలిగి వుంది.

ప్రస్తుతం అమెరికా 132 దేశాల్లో 702 మిలిటరీ కాంపుల్తో ఆక్రమించుకుని వుంది. ప్రస్తుతం అమెరికా దగ్గర 8,000 న్యూక్లియర్ వార్‌హెడ్స్ వున్నాయి. అందులో 2,000 పదిహేను నిమిషాల వార్నింగ్‌తో ప్రయోగించడానికి సిద్ధంగా వున్నాయి. ఇంకా అవి అణుశక్తితో కొత్తరకం ఆయుధాలను నిర్మించే ప్రయత్నంలో వుంది. వాటినే బంకర్ బస్టర్లంటారు. బ్రిటన్ ఎప్పుడూ దానికి సహకరిస్తూ తన న్యూక్లియర్

మిస్సైళ్ళను ఆధునీకరించుకునే ప్రయత్నం చేస్తోంది. అవి ఎవరి మీద గురిపెట్టబడ్డాయి? ఒసామా బిన్ లాడెన్ మీదా? మీ మీదా? నా మీదా? చైనామీదా? పారిస్‌మీదా? ఎవరికి తెలుసు? ఈ పిల్ల చేష్టల పిచ్చి బెదిరింపులు అమెరికా రాజకీయతత్వంలో ప్రధాన భాగం. అమెరికా ఎల్లప్పుడూ యుద్ధ సన్నాహాల్లో మునిగి వుంటుంది. దానికి వెసులుబాటు లేదు.

అమెరికాలో వేలాదిమంది ప్రజలు వాళ్ళ ప్రభుత్వపు ఇలాంటి కార్యకలాపాలపట్ల కోపంగా విసుగ్గా వున్నారు. ఈ అనిశ్చితి, భయం రోజురోజుకూ పెరుగుతోంది.

బుష్‌కి మంచి ఉపన్యాసాలు వ్రాసి యిచ్చేవారు చాలామందే వున్నారు. నేను కూడా వారిలో చేరితే బాగుండుననిపిస్తోంది. ఆయన జాతీయ టెలివిజన్‌మీద ఈ చిన్న ఉపన్యాసం చేస్తే బావుంటుంది. అతను గుంభనగా, నున్నగా దువ్విన తలతో, సీరియస్‌గా, విజయహాసంతో, నిజాయితీగా, అప్పుడప్పుడూ పొడి నవ్వుతో, చిత్రంగా నిజమైన మనిషిలా కనిపిస్తాడు.

“దేవుడు మంచివాడు. దేవుడు ఉన్నతుడు. దేవుడు మంచివాడు. నా దేవుడు మంచివాడు. బిన్‌లాడెన్ దేవుడు చెడ్డవాడు. అతని దేవుడు మంచివాడు కాదు. సద్దాం దేవుడంటూ వుంటే మంచివాడు కాదు. అతడొక అటవికుడు. మనం అటవికులం కాము. మనం ప్రజల తలల్ని నరకం. మనం స్వేచ్ఛను నమ్ముతాం. దేవుడూ అంతే. నేను అటవికుణ్ణి కాను. నేను ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకోబడిన వాణ్ణి. ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే ప్రజాస్వామ్య దేశస్తుణ్ణి. మనది కరుణార్ద్రమైన సంఘం. మనది గొప్పదేశం. నేను నియంతనుకాను. అతడు నియంత. నేను ఆటవికుణ్ణి కాను. అతడు ఆటవికుడు. వాళ్ళంతా ఆటవికులే. నాకు నీతిమీద అధికారంవుంది. ఇది మీరు ముందుగా గమనించాలి. ఇది నా నీతి అధికారం. దాన్నిమీరు మరిచిపోవద్దు.”

రచయిత జీవితం సున్నితమైనది, పారదర్శక క్రియతో కూడినది. మనం అందుగురించి దుఃఖించ కూడదు. రచయిత తాను ఎంపిక చేసుకుంటాడు, దానికి కట్టుబడి వుంటాడు. అన్నిరకాల గాలులకీ సిద్ధపడి వుంటాడు. అబద్ధమాడితే తప్ప మీకు నీడలేదు, రక్షణ లేదు.

ఈ సాయంత్రం కొన్నిసార్లు నేను మృత్యువును ఉటంకించాను. ఇప్పుడు నా స్వీయ కవితను మీకు వినిపిస్తాను. దాని పేరు ‘మృత్యువు.’

ఆ శవం ఎక్కడ దొరికింది?

ఆ శవాన్ని ఎవరు చూశారు?

అతను చూసినపుడాశవం చనిపోయే వుందా?

ఆ శవం ఎలా కనుక్కోబడింది

ఆ శవం ఎవరు?

ఆ శవాన్ని వొదిలేసినది

తండ్రా, కూతురా, సోదరుడా,

మేనమామా, సోదరుడా, తల్లా, కొడుకా?

ఆ శవం నగ్నంగా వుందా లేక

ప్రయాణానికి సిద్ధంగా బట్టలేసుకుని వుందా?

ఆ శవం చనిపోయిందని నువ్వెందుకు చెప్పావు?

ఆ శవం చనిపోయిందని నువ్వే చెప్పావా?

ఆ శవాన్ని గురించి అంతా నీకెలా తెలుసు?

ఆ శవాన్ని స్నానం చేయించావా?

ఆ శవం రెండు కళ్ళనీ మూసేశావా?

ఆ శవాన్ని పూడ్చి పెట్టావా?

ఆ శవాన్ని నువ్వు వొదిలేశావా?

ఆ శవాన్ని నువ్వు ముద్దెట్టుకున్నావా?

మనం అద్దంలోకి చూసినప్పుడు మన ప్రతిబింబం ఖచ్చితంగానే వుందనుకుంటాం. అద్దాన్ని ఒక మిల్లీమీటరు జరుపు ప్రతిబింబం మారిపోయింది. నిజానికి మనం అనంతమైన ప్రతిబింబాలను చూస్తాం. ఒక్కోసారి రచయిత అద్దాన్ని బద్దలు కొట్టాల్సి వొస్తుంది. ఎందుకంటే సత్యం అనేది అద్దానికి ఆవతలివైపునించి మనల్ని చూస్తుంది.

ఇన్ని యిబ్బందులున్నా, వాటిని లెక్కచేయక, తిరుగులేని మేథా నిర్ణయాలతో, పౌరులుగా నిజమైన జీవన సత్యాలను మనం నిర్వచించాల్సి వుంటుంది. అది మన సాంఘిక బాధ్యత. మనవిధి.

మన రాజకీయ దృక్కోణంలో అలాంటి స్థిరనిర్ణయం లేనట్లయితే మనిషి పోగొట్టుకుంటున్న మనిషి యొక్క గౌరవాభిమానాల్ని మనం నిలబెట్టలేం. ⓜ

# మరుగుజ్జులుగా మిగిలిపోదామా?



- రవీంద్ర కేలేకర్

కొంకణీ భాషకు దేశంలోని సర్వోన్నత సాహిత్య పురస్కారమైన జ్ఞానపీఠ పురస్కారం దాని తల్లిభాష అయిన సంస్కృతంతో పాటు లభిస్తున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది (2006 సంవత్సరానికిగాను జ్ఞానపీఠ పురస్కారం రవీంద్ర కేలేకర్‌కు, సంస్కృత రచయిత ప్రొ. సత్యవ్రత శాస్త్రికి ఉమ్మడిగా ఇవ్వడం జరిగింది). సాహిత్య ప్రపంచంలో ఒక గొప్ప గౌరవంగా భావించబడే సాహిత్య అకాడెమీ యొక్క 'మహత్తర సభ్యత్వం' ( ఫెలోషిప్) కొన్ని సంవత్సరాల క్రిందట నాకు ప్రదానం చేయడం జరిగింది. ఇలా గౌరవించడానికి నన్ను యోగ్యునిగా భావించినందుకు ఈ రెండు సంస్థల సభ్యులపట్ల హృదయపూర్వకమైన కృతజ్ఞత తెలుపడం నా విధిగా భావిస్తున్నాను.

ఈ సందర్భంలో ఒక ముఖ్యమైన విషయం మీకు చెప్పాలి. అదేమిటంటే నిన్న – మొన్నటిదాకా ఎందరో పెద్ద–పెద్ద వాళ్ళు దేన్నైతే ఒక భాషగా అంగీకరించడానికి కూడా సిద్ధంగా లేరో, ఆ భాషకు చెందిన ఒక రచయితకు ఈ పురస్కారం ప్రదానం చేయడం జరుగుతూంది. దీనికి లిపిలేదు, వ్యాకరణం లేదు, ఇందులో సాహిత్యం లేదు, అని స్వయానా ఈ భాష మాట్లాడే వాళ్ళే దీన్ని అపహాస్యం చేస్తూ ఉండేవారు. ఇప్పుడు ఈ భాష సాహిత్య అకాడెమీ యొక్క 'ఫెలోషిప్', జ్ఞానపీఠ పురస్కారం లాంటి పురస్కారం పొందగలిగిందంటే దీని ఘనత అంతా కొంకిణీకి ఒక భాషగా గుర్తింపు కల్పించడానికి గత 50–60 సంవత్సరాలుగా నిరంతరం తీవ్ర పోరాటం చేస్తూ వచ్చిన వారికే దక్కుతుంది. వారిని స్మరించుకోవడం నా ఒకానొక పెద్ద కర్తవ్యం. ఎంతో నమ్రతతో అందరికీ తెలిసిన, తెలియని, పోరాట యోధులనందరికి నా అభివాదం తెలుపుతూ వారు పొందిన సఫలతకు వారిని అభినందిస్తున్నాను.

కేంద్ర సాహిత్య అకాడమీ స్థాపన జరిగినప్పుడు భారతీయ సాహిత్యాన్ని ఈ విధంగా నిర్వచించడం జరిగింది – అనేక భాషల్లో రాయబడుతూ ఉన్నా భారతీయ సాహిత్యం ఒకటే. Indian literature is one though written in several languages. దీనికి అర్థం, మనం – మన భాషల్లో రాస్తూ ఉండినా, మనం కేవలం ఆ భాష రచయితలం మాత్రమే కాదు. నిజానికి మనమందరము భారతీయ రచయితలము అని.

ఆత్మానందం కోసం ఈ టానిక్ మంచిదే. కానీ ఈ ఆత్మానందం చాలాసార్లు మనలను ఒక భ్రమలో పడేస్తూ వచ్చింది. కళ్ళు తెరిచి యథార్థం వైపు దృష్టి సారించినపుడు మనం దిగాలు పడిపోతాం. మనం ఇంత పెద్ద దేశ రచయితలమైనప్పుడు ఈ దేశంలో మన పుస్తకాలు ఎవరు చదువుతున్నారో, ఎందరు చదువుతున్నారో చెప్పండి?

గత 25–30 ఏండ్లలో కొంకణీలో నా పుస్తకాలు దాదాపు 25 వెలువడ్డాయి. దాదాపు అన్ని పుస్తకాల మొదటి ముద్రణలో 1000 కాపీలు వేశారు. ఈ వెయ్యి కాపీలు అయిపోవడానికి దాదాపు పది సంవత్సరాలు పడుతూ వచ్చింది. వెంటనే రెండవ ముద్రణకు వెళ్ళే సాహసం మాకు ఎన్నడూ కలగలేదు. అందుకు కనీసం ఇరవై సంవత్సరాలైనా వేచి ఉండవలసి వస్తుంది.

కొంకణీ చిన్న భాషల్లో చేరింది. మరి హిందీ సంగతేమిటి? అది దేశంలో అన్నిటి కంటే పెద్ద భాష కదా!

హిందీ నుంచి అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి, ఫోన్ : 09811589430

దేశ రాష్ట్ర భాష కూడా! రాష్ట్ర భాష కాకపోయినా అది పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, బీహార్ ఇన్ని రాష్ట్రాల్లోని ప్రజల భాష కదా! ఇంత పెద్ద భూభాగంలో మాట్లాడే భాషలో వెలువడే ఏ పుస్తకమైనా మొదటి ముద్రణతో కనీసం లక్ష కాపీలు అచ్చుకావాలి. మరి ఎన్ని కాపీలు అచ్చవుతున్నాయి? కొంకణీలో వచ్చిన 'ఓథంబే' అనే నా పుస్తకం హిందీలోకి అనువాదమయింది. 'ఆకురాలు కాలంలో రాలిన ఆకులు' అనే పేరుతో అది వెలువడింది. దాని అట్ట మీద 'ఇది కొంకణీ భాషలోని ఒక అద్భుత రచన' అనికూడా రాసి ఉంది. ఎన్ని కాపీలు అచ్చువేశారనుకున్నారు? వెయ్యి మాత్రమే!

ఈ పరిస్థితికి కారణం వెదకడానికి ప్రయత్నించినప్పుడు నాకు అన్ని భారతీయ భాషల తలపైన ఒక కారుమబ్బు తేలి యాడుతున్నట్లు కనిపిస్తుంది. అదే భారతదేశమనే 'సర్వసత్తాక ప్రజాస్వామ్య' దేశంలో ఇంగ్లీషుకున్న ప్రాబల్యం. ఈ స్వతంత్ర దేశంలో ప్రభుత్వం పనులన్నీ ఇంగ్లీషులోనే జరుగుతాయి. చట్టాలన్నీ ఇంగ్లీషులోనే తయారవుతాయి. న్యాయపాలన ఇంగ్లీషులోనే జరుగుతుంది. అందువల్ల పెద్ద-పెద్ద ఉద్యోగాలన్నీ ఇంగ్లీషు చదువుకున్న వాళ్ళకే లభిస్తాయి. అంతే కాదు, ఇంగ్లీషు మనకు ఒక హోదా కూడా ఇస్తూ వచ్చింది.

ఇంగ్లీషు ఎంత నేర్చుకున్నా మనం ఇంగ్లీషు వాళ్ళం, అమెరికా వాళ్ళం కాలేం. అంతర్జాతీయులమైతే ఎన్నటికీ కాలేం. కేవలం మన మూలాలను తెంచేసుకున్న వాళ్ళం మాత్రం కాగలుగుతాం. ఎందుకూ కాకుండా పోతాం

ఇలాంటి పరిస్థితుల్లో మాతృభాషలను మీరు ఎంత గొప్పగా కీర్తించినా దాని ప్రభావం ఎవరి మీదా పడే అవకాశం లేదు. ప్రజలు ఇంకా-ఇంకా ఇంగ్లీషును అభిమానించే వారే అవుతూ పోతారు. అలాంటప్పుడు దేశ సాహిత్యం పెంపొందడం జరిగేపని కాదు. విద్యావంతుడైన వాడు ఎవడూ మన పుస్తకాలు చదవడు. ఇంగ్లీషు పుస్తకాలే చదువుతూ ఉంటాడు.

ఇంగ్లీషు నేర్చుకోవలసిన అవసరం మనకు లేదని నేను అనడంలేదు. ఉంది. తప్పనిసరిగా ఉంది. అందుకున్న ఒకే ఒక కారణం, అది ప్రపంచ సాహిత్యంతో మనకు పరిచయం కలిగిస్తుందనేది. అయితే ఎంత మందికి ఈ భాష తెలిసి ఉండాలి? దేశంలోని నూటికి నూరుపాళ్ళు ప్రజలకా? అది అసంభవం. దేశోన్నతికోసమైతే అవసరమే లేదు. దేశంలోని అన్ని ప్రాంతాలు ఆయా ప్రాంతీయ భాషలకు చెందుతాయి. జర్మనీ, ఫ్రాన్స్, జపాన్, రష్యాలాంటి దేశాలు తమ-తమ భాషలో పరిపాలన జరుపుకుంటున్నాయి. అభివృద్ధి చెందుతున్నాయి. అలాంటప్పుడు ఆ విధంగా మనం కూడా ఎందుకు చేయలేము? ఇంగ్లీషు ఎంత నేర్చుకున్నా మనం ఇంగ్లీషువాళ్ళం, అమెరికావాళ్ళం కాలేం. అంతర్జాతీయులమైతే ఎన్నటికీ కాలేం. కేవలం మన మూలాలను తెంచేసుకున్న వాళ్ళం మాత్రం కాగలుగుతాం. Out of place every where, at home no where. ఎందుకూ కాకుండా పోతాం.

ఇంగ్లీషుకు ఎన్నో పరిమితులున్నాయి. అది ప్రపంచంతో మనలను కలుపుతుంది. నిజమే. అయితే మనలను మన ప్రజలనుండి వేరు చేస్తుంది కూడా. ఆధ్యాత్మిక ప్రపంచంలో ఏ చదువూ రాని రామకృష్ణ పరమహంస దేశం మూల - మూలలకు చేరుకోగలిగాడు. సాయిబాబా కూడా చేరుకోగలిగాడు. కానీ శంకరాచార్యుని తర్వాత భారతదేశ తాత్విక చింతనలో మౌలికమైన అంశాలను చేర్చగలిగిన ఇద్దరు మహాపురుషులు - అరవిందులు, జిడ్డు కృష్ణమూర్తి - కేవలం సుఖాసక్తులుగా, ఫ్యాషన్లకు మోజుపడే వారుగా, వృథాగా కాలయాపన చేసేవారుగా ఉండే ఇంగ్లీషు చదువులు చదివిన వారి మధ్యనే చిక్కుకొని ఉండి పోయారు. రాజకీయ రంగంలో ఎమ్.ఎన్.రాయ్ మామూలు మనిషి కాదు. ప్రతిభావంతుడైన వ్యక్తి. విప్లవకారుడు. మౌలిక చింతనా పరుడు కూడా. మెక్సికో విప్లవంలో అగ్రగామి. లెనిన్‌కు కుడిభుజం. అయితే ఆయనకు భారతదేశ భాష ఏదీ తెలియదు. తన మాతృభాష బెంగాలీ కూడా మరచిపోయిన వ్యక్తి. దేశంలోని స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడానికి వచ్చాడు. అయితే ప్రజలతో కలిసిమెలిసి జీవించలేక పోయాడు. ముంబయి, కోల్‌కతా విశ్వవిద్యాలయాలకు చెందిన కొందరు అధ్యాపకుల, మేధావుల పరిధిలోనే చిక్కుకొని ఉండిపోయాడు.

వ్రేళ్ళు కత్తిరించి పెద్దగా పెరగగల వృక్షాలను మరుగుజ్జులుగా తయారు చేసే కళను జపాన్ దేశస్తులు వికసింపచేశారు. ఆకాశాన్నంటుకునేట్లు ఎత్తుగా పెరిగే టెంకాయ చెట్టును ఈ కళ ద్వారా అతి తక్కువ ఎత్తుగల

మొక్కగా తయారుచేసి ఉండడం నేను చూశాను. చాలా అందంగా ఉంటుంది. అయితే అది టెంకాయలు ఇవ్వలేదు. డ్రాయింగ్ రూములో అలంకారంగా మాత్రమే పనికి వస్తుంది. అంతే. ఈ కళను 'బోన్సాయ్ కళ' అంటారు. ఇంగ్లీషు మన దేశంలో ఎందరో బోన్సాయ్ పండితులను, బోన్సాయ్ మేధావులను, బోన్సాయ్ రచయితలను, ఇప్పుడైతే బోన్సాయ్ పాఠకులను కూడా తయారు చేసింది. వీళ్ళంతా చర్చా గోష్ఠులను శోభిల్లచేసేందుకు పనికొస్తారు. గట్టి పదార్థం ఏదీ ఇవ్వలేరు. ఈ దేశాన్ని మనం బొన్సాయ్ ప్రజల దేశంగా మారనిద్దామా? భగవంతుని సృష్టికి మించిన ప్రతి సృష్టి చేసే శక్తి కలిగిన విశ్వామిత్రుని వంటి ఋషులు ఈ దేశంలో జన్మించారనే విషయం మనం మరిచి పోకూడదు. అలాంటి దేశాన్ని మనం బొన్సాయ్ ప్రజల దేశంగా మారనిస్తామా? కాదుగదా? అలాంటప్పుడు దేశంలో ఇంగ్లీషు పొందిన ప్రాబల్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడం ఇప్పుడు ఎంతో అవసరం. ఈ తిరుగుబాటు ఎవరు చేస్తారు? ఎవరైనా రాజకీయ నాయకుడా? ఈ తిరుగుబాటు ఆరంభించిన ఒక నరశార్దూలం ఉండే వాడు. డా. లోహియా. హఠాత్తుగా వెళ్ళిపోయాడు. ఇప్పుడు? నాదృష్టి దేశంలోని సాహిత్యకారులవైపుకు వెళ్తున్నది. విక్టర్ హ్యూగో అంటూ ఉండే వాడు-ఇటలీ పునరుజ్జీవ నోద్యమం చేపట్టిందని. జర్మనీ రిఫార్మేషన్ ఉద్యమం నడిపినందువల్ల యూరోపు మార్పుచెందింది. ఫ్రాన్స్ కేవలం ఒక్క వోల్తేరుకు జన్మనిచ్చింది. ఆయన పునరుజ్జీవ నోద్యమం, రిఫార్మేషన్ ఉద్యమంతో పాటు విప్లవ కార్యకలాపాలు కూడా కొనసాగించాడు. దాంతో ఫ్రాన్స్‌ను మాత్రమే కాక, మొత్తం యూరప్ రూపురేఖలే మార్చేశాడు. అలాంటి ఒక వోల్తేరు దేశంలోని ఏభాషలోనైనా జన్మించినప్పుడే నేడున్నపరిస్థితి అమూలాగ్రంగా మారుతుంది. ఈ నా నివేదనను మీ ముందుంచి ఎంతో నమ్రతతో నేనీ జ్ఞానపీఠ పురస్కారం స్వీకరిస్తున్నాను.



రవీంద్ర కేలేకర్

**జీవితం, సాహిత్యం :** 2006వ సంవత్సరానికి ప్రదానం చేయబడిన 'భారతీయ జ్ఞానపీఠ పురస్కారం' కొంకణీ భాషలో శిఖరాయమానుడైన సాహిత్య కారుడుగా భావించబడే రవీంద్ర కేలేకర్‌కు భారతీయ సాహిత్య సంపదను వృద్ధిపరిచే దిశగా ఆయన చేసిన కృషికిగాను ఇవ్వడం జరిగింది.

7 మార్చి, 1925లో జన్మించిన కేలేకర్‌కు మొదటి నుంచి సాహిత్యక, సామాజిక, సాంస్కృతిక కార్యకలాపాల్లో అభిరుచి కలిగింది. పోర్చుగీసు పాలనకు వ్యతిరేకంగా సాగిన గోవా విముక్తి పోరాటంలోని ఒక మహారథిగా, గొప్ప గాంధేయవాది, రచయిత, కాకా కాలేల్కర్ ప్రధాన శిష్యుల్లో ఒకడుగా, కొంకణీ భాషకు ఒక స్వతంత్ర భారతీయ భాషగా గుర్తింపు కలిగించి, ప్రతిష్ఠింప చేసిన కొంకణీ భాషా ప్రేమికుడిగా కేలేకర్ ఒక 'పితామహ వ్యక్తిత్వం' కలిగిన సుప్రసిద్ధుడు. 1955లో వెలువడిన 'సత్యాగ్రహం'తో ఆయన కీర్తివంతమైన సాహిత్య యాత్ర ఆరంభమైంది. కొంకణీ, హిందీ, మరాఠీలో వివిధ ప్రక్రియల్లో 32కు మించి ఆయన మౌలిక రచనలు చేశాడు. 12 రచనలను కొంకణీలోకి అనువదించాడు కూడా. బహుభాషావేత్తగా, శ్రేష్ఠుడైన సంపాదకుడుగా, తాత్విక చింతనాపరుడుగా, ఆధ్యాత్మిక వర్చస్సు కలిగిన యుగ ప్రవర్తకుడుగా పేరు పొందాడు.

పద్మభూషణ్, భారత భారతీ సమ్మాన్, సాహిత్య అకాడెమీ పురస్కారం, గోవా కళా అకాడెమీ పురస్కారం, కేంద్రీయ హిందీ నిదేశాలయ్ పురస్కారం, గోమంత శారదా పురస్కారం, కొంకణీ సాహిత్యరత్న పురస్కారం, సాహిత్య అకాడెమీ ఫెలోషిప్ మొదలైన అనేక పురస్కారాలు వీరిని వరించాయి.

భారతీయ సంవేదన పైన కేలేకర్ కున్న అభిమానం బహుశా ఆయన తాతగారి నుంచి వారసత్వంగా వచ్చిందేమో. కేలేకర్ తాతగారి మనసులో దేశ ఆచారాలపట్ల, సంప్రదాయాలపట్ల, సాహిత్యం పట్ల ప్రత్యేకమైన ప్రశంసా భావం ఉండేది. అందువల్లనే ఆయన 1925లో శాంతినికేతన్ యాత్రచేసి తన మనవనికి రవీంద్రుని పేరుపెట్టాడు. కలేకర్ తండ్రికూడా సాహిత్యాభిమానే. అందుకే వృత్తిరీత్యా వైద్యుడైనా ఆయన భగవద్గీతను పోర్చుగీసు భాషలోకి ప్రప్రథమంగా అనువదించాడు.

'రవీంద్రబాబ్' అని ప్రేమాదర పూర్వకంగా పిలువబడే రవీంద్ర కేలేకర్ గోవాలోనూ, కొంకణీ మాట్లాడే ఇతర ప్రాంతాల్లోనూ బహుళ జనాదరణ పొందిన రచయిత. జీవితాంతం కొనసాగిన ఆయన తాత్వికచింతన ఆయన రచనల్లో మనకు స్పష్టంగా కనిపిస్తుంది. క్లిష్టమైన విషయాలను కూడా సరళమైన భాషలో వ్యక్తీకరించడంలో ఆయనకున్న నేర్పు పాఠకులను ఆకర్షించింది. అనతోల్ ఫ్రాన్స్ ఇలా అన్నాడు : "శైలి సూర్యరశ్మిలా ఉండాలి. దానికి రంగు ఉండదు. అయినా అందులో ఏడు రంగులూ ఉంటాయి." కేలేకర్ రచనలు చదివేప్పుడు పాఠకులకు ఇలాంటి అనుభూతే కలుగుతుంది.

ప్రేరణాత్మకమైన ఆయన రచనల్లో చర్చించిన విప్లవాత్మక ఆలోచనలు పాఠకుల, విమర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. ప్రసిద్ధ గోవా కవి డా॥ మనోహర్‌రాయ్ సర్దేశాయి అన్నట్లు : "ఆయన పదాలు హింసాత్మకంగా ఉండవు. అయితే ఆయన ఆలోచనలు మాత్రం విప్లవాత్మకంగా ఉంటాయి."

తన సంవేదన పైన వేదాల, ఉపనిషత్తుల, బౌద్ధ-సూఫీ మతాల ప్రభావం ఉందని కేలేకర్ మాటిమాటికి చెప్తూ వచ్చారు. కిశోరావస్థలో ఇంకా పణజీలో ఉన్నరోజుల్లోనే పత్రికల్లో 'మేనేజెజ్ బ్రగాంజా' రాసే విషయాలతో ప్రేరణ పొంది, తన లాంటి ఆలోచనలున్న మరి కొందరితో కలిసి దేశ కార్యకలాపాల్లో పాలుపంచుకోవడం మొదలుపెట్టాడు. కొద్ది రోజులు 'హిందు మహాసభ' నిర్వహించే కార్యక్రమాలకు వెళ్ళేవాడు. అయితే త్వరలోనే దాని సిద్ధాంతాలతో ఆయనకు నిరాశ కలిగింది. ఈ ఆరంభ కాలంలో ఆయనపైన పడిన ఒక గొప్ప ప్రభావం స్వామి వివేకానందది. ఈ ప్రభావం జీవితంలో ఆయనకు మార్గదర్శకంగా నిలిచింది.

కేలేకర్ 1940వ దశకంలో స్వాతంత్ర్య పోరాటంలో చేరాడు. అందువల్ల 'ఇండియా పోర్చుగీస్' అనబడే గోవా నుంచి బయటపడి బ్రిటిష్ భారతదేశంలోని ముంబయిలో తలదాచుకోవలసి వచ్చింది. ఆ రోజుల్లోనే కాకా సాహెబ్ కాలేల్కర్ సాన్నిధ్యంలో కొంత కాలం గడిపే అదృష్టమూ కలిగింది. అది కేలేకర్ జీవిత గమ్యాన్నే మార్చివేసింది. ఈ అనుభవాలను ఆయన తన మరాఠీ పుస్తకం 'జ్ఞాననిధీ బ్యాసాన్ని ధ్యాంత్' (1970)లో వర్ణించాడు. ఆయన జీవితంపైన, ఆలోచనా ధోరణిపైన ప్రభావం కలిగించిన ఇతర వ్యక్తులు మహాత్మగాంధీ, బుద్ధుడు. ఈ ముగ్గురు ద్రష్టల గురించి కేలేకర్ విస్తారంగా రాశాడు. మహాత్మాగాంధీ, కాకా సాహెబ్ కాలేల్కర్‌ల అనేక గ్రంథాల అనువాదం చేశాడు. వాటికి సంపాదకత్వం వహించాడు. బుద్ధుని ఉపదేశాల్లోని, తత్త్వశాస్త్రంలోని ప్రధానమైన అంశాలను 'తథాగత్' (1998), 'ప్రజ్ఞావాదాచీమ్‌తీన్ పవలమ్ (2005) లాంటి గ్రంథాల్లో వ్యాఖ్యానించాడు. 'తథాగత్' మౌలిక దృష్టితో బుద్ధుని జీవితాన్ని, ఆయన తత్వశాస్త్రాన్ని వివరించిన బృహద్రచన. కొన్ని దశాబ్దాల పాటు తాను సంపాదకత్వం వహించిన 'జాగ్' అనే మాసపత్రిక ద్వారా, 'సునాపరాంత్' అనే కొంకణీ దినపత్రికలో 'సమిధ' పేరుతోను, 'నవప్రభ' అనే మరాఠీ దిన పత్రికలో 'స్వాగత్' అనే పేరుతోను రాసిన సాహిత్యక కాలమ్స్ ద్వారా సామాజిక జాగృతిని పెంపొందించడానికి కేలేకర్ ఎంతో కృషి చేశాడు. ఈ కాలమ్స్‌లో ఆయన సమకాలీన జీవితానికి సంబంధించిన అనేక విషయాల గురించి విస్తారంగా రాశాడు.

కొంకణీ సాహిత్య ప్రపంచంలో పితృతుల్యుడుగా, దూరదూరాలకు విస్తరించిన ఒక విశాల వటవృక్షంలా భావించబడిన కేలేకర్, ఒక వ్యక్తిగా కాక ఒక సంస్థగా నెలకొని యువ రచయితలకు, మూడు తరాల పాఠకులకు ప్రేరణాస్పదుడుగా నిలిచాడు. ఆ భాషలో రచయితల రచయితగా పేరు పొందాడు. బహుగ్రంథ రచయితగానే కాక బహుగ్రంథ పఠితగా కూడా ఆయన అనేక దేశ - విదేశ సాహిత్యకారుల గొప్ప రచనలు చదివాడు. గాంధీ సిద్ధాంతాలను నమ్మిన కేలేకర్ రచనలపైన ఆచార్య కాకా సాహెబ్ కాలేల్కర్ ప్రభావం స్పష్టంగా మనకు కనిపిస్తుంది. ఆచార్య కాలేల్కర్ సాంగత్యంలో చాలా కాలం ఉండడమే ఇందుకు కారణం కావచ్చు. దేశంలోను, విదేశాల్లోను విస్తారంగా పర్యటించిన కేలేకర్ అనుభవాలు ఆయన రచనల్లోకి వచ్చి చేరాయి, ఆయన చేసిన అంతర్యాత్రకు ప్రపంచ నేపథ్యం కలిగించాయి. ఆయన రచించిన 'హిమాలయాంత్' అనే యాత్రా వృత్తాంతంలో తాత్విక జిజ్ఞాసతో కూడిన ప్రకృతి సౌందర్య వర్ణన ఉంది. ఈ రచనకే 1977లో సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. కొంకణీకి సాహిత్య అకాడెమీ గుర్తింపు వచ్చిన తర్వాత ఆ భాషలోని రచనకు ప్రదానం చేయబడిన మొదటి పురస్కారం దీనికే దక్కింది. కేలేకర్ జీవితం యావత్తూ సాహిత్య

సాధనలోనే గడిచింది. తాత్విక దృష్టితో కూడిన వాడే అయినా ప్రకృతి నుంచి, కాలంలో వచ్చే మార్పుల నుంచి, మారుతున్న మానవుని నైజం నుంచి నేర్చుకునే విషయంలో ఆయన ఎల్లప్పుడు ఆసక్తి కనపరచేవాడు. 'నా ప్రియమైన పుస్తకం' అనే వ్యాసంలో ఆయన ఇలా రాశాడు : "నేను ఇప్పుడు మాట్లాడుతున్న పుస్తకం పేరు 'ప్రకృతి'. నేను మాట్లాడుతున్నది ఈ భూమి గురించి, దీనిపైన ఉన్న అన్ని నదులు, కొండలు, జలాశయాలు, సెలయేళ్ళు, సముద్రాల గురించి. ప్రకృతి అంటే నా అర్థం చెట్లు, పొదలు, పూలు, పండ్లు, సమస్త వృక్షజాతులు. నేను, పక్షులు, పశువులు, క్రిమికీటకాలు సమస్త ప్రాణులను, సూర్యుణ్ణి, చంద్రుణ్ణి, రాత్రి ఆకాశంలో మెరిసే అన్ని నక్షత్రాలనుకూడా నా ఈ పుస్తకంలో పరిగణనలోకి తీసుకుంటాను. దీన్ని నాపిచ్చిగా మీరు భావించవచ్చు. అయితే ప్రకృతిని నేను గుడ్డిదానిగా, భావనా రహితమైన దానిగా భావించి నిరాకరించలేను. ప్రకృతి నిరంతరం ప్రేమ పూర్వకంగా నాతో మాట్లాడుతుంది. అందువల్లనే 'ప్రకృతి నా ప్రియమైన పుస్తకం' అని అనడంలో నాకు ఎలాంటి సంకోచం లేదు."



రామ్ మనోహర్ లోహియా

యువకుడుగా ఉన్నప్పుడు గోవాను పోర్చుగీసు పాలకుల క్రూర పరిపాలన నుంచి విడిపించడానికి డా॥ రామ్ మనోహర్ లోహియా ఇచ్చిన పిలుపు ప్రభావం ఆయనపైన పడింది. గోవా స్వాతంత్ర్యోద్యమంలో క్రియాశీలిగా ఉన్నప్పుడు అరెస్టు కాకుండా తప్పించుకోడానికి గోవా వదలిపెట్టి పోవలసి వచ్చింది. అప్పుడే ఆయనకు వర్ధాలోని గాంధీ ఆశ్రమంలో కొంత కాలం గడిపే అవకాశం లభించింది. అక్కడ పొందిన ప్రేరణతోనే పాఠకులకు గాంధీవాద ఆలోచనా విధానాన్ని గురించి తెలిపేందుకు ఆయన హిందీలోను, కొంకణీలోను అనేక రచనలు చేశాడు.

బహుభాషా కోవిదుడైన కేలేకర్ హిందీ, కొంకణీలోనే కాక, మరాఠీ, గుజరాతీలో కూడా రచనలు చేశాడు. రవీంద్రనాథ్ ఠాగూరు రచనలను బెంగాలీ మూలంలో చదవడానికి బెంగాలీ నేర్చుకున్నాడు. ఈయనకు ఇంగ్లీషు, పోర్చుగీస్ భాషల్లో కూడా మంచి ప్రావీణ్యం ఉండేది. కొంకణీ భాషాభివృద్ధి, దాని ప్రత్యేక గుర్తింపును కాపాడే ప్రయత్నం, జీవితంలో ఆయన చేసిన పోరాటంలో అతిముఖ్య భాగం.

కేలేకర్ భారతీయత, గోవాత్వం రెండూ కలగలిసిన ఒక సంయుక్త చైతన్యాన్ని రూపొందించడానికి నిరంతరం శ్రమించాడు. అదే గోవా యొక్క గుర్తింపును నిలిపి ఉంచగలుగుతుందని నమ్మాడు. ఖలిస్తాన్ ఉద్యమం రోజుల్లో ఒక పంజాబీ ఇంజినీరుతో జరిగిన సంభాషణ రూపంలో రచించిన 'ఇంతకూ ఇది ఎవరి దేశం?' అనే వ్యాసంలో ఆయన అతి ప్రాచీన కాలంనుంచి పంజాబు ఎదుర్కొన్న ఆక్రమణల గురించి వ్యాఖ్యానిస్తూ, ఒక సమైక్య భారతీయ గుర్తింపును గురించి ఇలా రాశాడు : "అయితే వీనిలో దేని ప్రభావమూ మా గోవా పైన పడలేదు. ఈ సంఘటనల నుంచి అది పూర్తిగా దూరంగా ఉండిపోయింది. మీరు గోవావస్తే ఎర్రకోట, తాజ్‌మహల్ కంటే వంద సంవత్సరాలు మునుపు కట్టిన చర్చిలు నేను మీకు అక్కడ చూపిస్తాను. ఈ దేశంలో ఏదైనా ఒక భాగం దేశం నుంచి 'వేరు' కావాలని గట్టిగా వాదించగలదని అనుకుంటే అది కేవలం గోవాయే. దాని చరిత్ర వేరు. ఈ చరిత్ర విషాదమయం కావచ్చు. దాని కారణంగా మేము సిగ్గుతో తలవంచుకోవలసిన అవసరం కలగవచ్చు. అయినా అది మా చరిత్ర అనేదాన్ని నిరాకరించలేం. అయినా భారతదేశం నుంచి వేరు కావాలని కోరుకునే వాడు ఒక్కడు కూడా గోవాలో మీకు కనిపించడు."

కొంకణీ భాషా, సాహిత్యాల నిర్మాతగా, గోవా పైనుంచి పోర్చుగీసువారి ఆధిపత్యాన్ని తొలగించడానికి, గోవాకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దాన్ని మహారాష్ట్రలో విలీనం చేసే ప్రయత్నాన్ని వ్యతిరేకించడానికి, గోవాలో కొంకణీకి గౌరవప్రదమైన స్థానం కల్పించడానికి జరిగిన అనేక పోరాటాల, ఉద్యమాల బాటలో పయనించిన ఒక అతి ప్రధాన యాత్రికుడుగా తన సుదీర్ఘ జీవితంలో సాహిత్య, సామాజిక, రాజకీయరంగాల్లో నిర్విరామంగా పోరాటం సాగించిన శ్రీ రవీంద్ర కేలేకర్ ఆగస్టు 2010లో అంతిమ శ్వాస వదిలాడు. మి

# తానొకటి తలచిన దైవమొకటి తలచును!

- *బిరుదురాజు రామరాజు*

ఆంధ్రసారస్వత పరిషత్తువారు పరిణతవాణి ప్రసంగం చేయటానికి ఈసారి నన్ను ఆహ్వానించినందుకు కృతజ్ఞుడను. సాహిత్యాది వివిధ రంగాలలో 70 ఏండ్లు వయసు చెల్లినవారి జీవిత విశేషాలు, అనుభవాలు ఆసక్తిదాయకంగా ఉంటాయనే ఉద్దేశంతో పరిషత్తువారు ఈ పరిణతవాణి ప్రసంగాలు ఏర్పాటు చేస్తున్నారు. కొందరి జీవిత విశేషాలు, కొందరి ఉపలబ్ధులు, కొందరి అనుభవాలు నిజంగానే ఆసక్తిదాయకంగా ఉంటవి. ఆసక్తిదాయకంగా లేని వాటిని ఆసక్తికరంగా చెప్పే ప్రజ్ఞ ఉన్నా కొంతవరకు ఇంపుగానే ఉంటవి – వస్త్ర భూషాదులతో వచ్చే అందంవలె, పరిషత్తువారి నిబంధన ప్రకారం నా వయస్సు పరిణతమైనదే కాని, 'వాణి' ఆశించినంత పరిణతం కాదు. రసం యన్నిష్ఠం? వస్తు నిష్ఠమా? సహృదయ నిష్ఠమా? సహృదయనిష్ఠమనే భావంతో ఈ ప్రసంగం చేయటానికి ఒప్పుకున్నాను.

తెలుగులో "తానొకటి తలచిన దైవమొకటి తలచును" అనీ, ఇంగ్లీషులో "మాన్ ప్రపోజెస్ (బట్) గాడ్ డిస్పోజెస్" అనీ సామెతలున్నవి. ఆ సామెతలు నా కోసమే పుట్టినవి. నా జీవితంలో చాలా వరకు నేననుకున్నవి, ఆశించినవి జరుగలేదు. దైవమనుకున్నవే జరిగినవి. అందువలన దైవం ప్రసాదించిన వాటిలోనే ఆసక్తి పెంచుకొని కృషి చేసినాను. "దైవం దిష్టం భాగధేయం భాగ్యం స్త్రీ నియతిర్విధిః" అని అమరకోశం. దిష్టమే ఇష్టంగా మలచుకొని సంతృప్తి పడ్డాను, సంతోషించినాను.



బిరుదురాజు రామరాజు

పరిణతులైనవారు "సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ న బ్రూయాత్ సత్యమప్రియం" అనే హితవచనం పాటించవలె. ఇందులోని పూర్వార్ధం చేతనైనంత వరకు పాటించగలను. ఉత్తరార్ధం పాటించలేకపోతే శ్రోతలు పాఠకులు క్షమించవలె.

బాల్యం నుండే ఆర్యసమాజం, ఆంధ్రమహాసభ, స్టేట్ కాంగ్రెస్ ఉద్యమాల్లో సక్రియంగా పాల్గొన్నాను. ఊరేగింపుల్లో పాల్గొని లాఠీ దెబ్బలు తిన్నాను. కాంగ్రెస్ సత్యాగ్రహంలో పాల్గొని హైదరాబాదు సెంట్రల్ జైల్లోను, విశ్వ హిందూ పరిషత్తు సత్యాగ్రహంలో పాల్గొని లఖ్నో జేల్లోను ఉన్నాను.

చిన్నప్పటి నుండి దేశభక్తి భావాలు ప్రోది చేసుకున్నాను కనుక రాజకీయాల్లోకి పోదామనుకున్నాను. మా పెద్దలు నన్ను విలాయత్‌కు పంపించి ఐ.సీ.ఎస్. చేయించవలెననుకున్నారు. దైవం తెలుగు పంతులును చేసింది. దైవేచ్ఛనే నా యిష్టంగా మలచుకొని తెలుగు సాహిత్య రంగంలో స్థిరపడ్డాను. తొలిదినాలలో గేయాలు, పద్యాలు, నవలలు వ్రాసినాను. ప్రతిభా వ్యుత్పత్త్యభ్యాసాల్లో మొదటి రెండు నాలో తక్కువ కనుక సృజనాత్మక సాహిత్య రంగంలో రాణింపురాదని, మంచి గుర్తింపు కోసం లోకానికి క్రొత్త విషయాలు చెప్పవలెననే ఉద్దేశంతో పరిశోధన రంగంలోనికి దిగినాను. క్రొత్త పుంతలు త్రొక్కి బాగా కృషిచేసి గుర్తింపు పొందవచ్చునని జానపద విజ్ఞాన రంగంలో పరిశోధన ప్రారంభించి కృతకృత్యుడనైనాను. జానపద గేయాలతో పాటు నూర్లకొలది తాళ్ళపత్ర గ్రంథాలు,

బిరుదురాజు రామరాజు (16.04.1925 – 21.02.2010)

పదులకొలది శిలాశాసనాలు సేకరించినాను. నా తరం యూనివర్సిటీ తెలుగు ఆధ్యాపకుల్లో తాళపత్ర గ్రంథాల్లో శాసనాల్లో అభిరుచిగల వాళ్ళు అరుదు కనుక ఆ కృషి కూడా సత్ఫలితాలిచ్చి నాకు మంచి గుర్తింపు సంపాదించింది. ఈ విధంగా విశ్వవిద్యాలయ స్థాయిలో జానపద విజ్ఞానంలో దాక్షిణాత్య సాహిత్య భాషల్లో పరిశోధన చేసిన వారిలో నేను ప్రథముడనైనాను.

మానవల్లి, వేటూరి, నిడుదవోలు వంటి పెద్దలు పరిశోధనలు ఆదర్శంగా పెట్టుకొని సాహిత్య చరిత్రలకెక్కని ప్రాచీన మధ్యకాలీన తెలుగు సంస్కృత కృతులు దాదాపు నూరు మొదటిసారి పరిచయం చేసిన వాణ్ణి అయినాను. ఇంతవరకు వెలుగు చూడని తెలుగు సంస్కృతం కృతులు ఒక డజను పరిష్కరించి ప్రకటించినాను. ఈ రంగంలో నా సాటివారిలో నా తోడివారిలో ఎవరూ చేయని పని చేసినందుకు పెద్దల మెప్పు పొందినాను. జానపదసాహిత్యంకోసం, తాళపత్ర గ్రంథాలకోసం పల్లెటూళ్ళు తిరిగినపుడే ఇంతకు పూర్వం చారిత్రకుల దృష్టి సోకని క్రొత్త శిలాశాసనాలు నాలుగైదు కనుగొన్నాను. అయితే ఆ రంగంలోని పెద్దల బొమముడులు గమనించి ఆ రంగంనుండి వైదొలగినాను. జానపద విజ్ఞానం తెలుగు పొలిమేరల వరకే సీమితం కాదు. అది అంతర్ రాష్ట్రీయం, అంతర్జాతీయం కనుక ఇంగ్లీషులో నాలుగైదు గ్రంథాలు, 25 పరిశోధన పత్రాలు ప్రకటించి తెలుగుదేశం బయటకూడ గుర్తింపు పొందినాను. అయినా మన పెద్దలకు జానపదంపై ఉన్న చిన్నచూపు గమనించి సంస్కృతంలో ఏం.ఏ. (1960) చేసి, పిహెచ్.డి. కోసం 'కాంట్రిబ్యూషన్ ఆఫ్ ఆంధ్ర టు సంస్కృత్ లిటరేచర్' అనే సిద్ధాంత గ్రంథం వ్రాసి, కారణాంతరాలవలస నిరాశపాలై సబ్మిట్ చేయకుండా ఊరకున్నాను. ఈ కృషి అంతా గుర్తింపుకోసం, పొట్టకూటి కోసం, పదవులకోసం చేసినదే.

మానవల్లి, వేటూరి, నిడుదవోలు వంటి పెద్దలు పరిశోధనలు ఆదర్శంగా పెట్టుకొని సాహిత్య చరిత్రలకెక్కని ప్రాచీన మధ్యకాలీన తెలుగు సంస్కృత కృతులు దాదాపు నూరు మొదటిసారి పరిచయం చేసిన వాణ్ణి అయినాను. ఇంతవరకు వెలుగు చూడని తెలుగు సంస్కృతం కృతులు ఒక డజను పరిష్కరించి ప్రకటించినాను.

అలనాటి నిజాం రాజ్యం వరంగల్ సూబాకేంద్రం హనుమకొండకు 2 1/2 కోసుల దూరాన మడికొండ, అక్కడికి రెండుకోసుల దూరాన ధర్మసాగరం, అక్కడికి రెండు కోసుల దూరాన దేవునూరు గ్రామాలున్నవి. మడికొండ, ధర్మసాగరం కాకతీయుల కాలపు గుళ్ళు శాసనాలున్న పెద్ద గ్రామాలు. దేవునిగుడి లేకున్నా ప్రాగైతిహాసికమానవుల సమాధులున్న (కెయిరనులు, దాల్మెనులు, సిస్ట్‌లు) చిన్న గ్రామం దేవునూరు నా జన్మస్థానం. మడికొండలో మా పెదనాయన, చిన్నాయనలు, ధర్మసాగరంలో మా పాలివాండ్లు, దేవునూరులో మా అమ్మనాయనలుండేవారు. కాపురాలు వేరు గ్రామాలైనా మాది సమష్టి కుటుంబం. మాకు దేవునూరులో 20 నాగండ్ల వ్యవసాయం, మడికొండలో 5 నాగండ్ల వ్యవసాయం కాక, లింగంపల్లి, కడిపికొండ, మడిపల్లి, మహాలింగంపల్లి గ్రామాల్లోను వ్యవసాయభూములుండినవి. మా పెదనాయన రాఘవరాజు, పెద్దమ్మ లలితమ్మలకు సంతానం లేదు. మా అమ్మ లక్ష్మీదేవమ్మ నాయన నారాయణరాజు, చిన్నమ్మ లక్ష్మీనరసమ్మ, చిన్నాయన కొండమరాజు. తమ్ములనూ, తమ్ముల సంతానాన్ని పుత్రనిర్విశేషంగా క్రమశిక్షణలో పెంచి విద్యాబుద్ధులు నేర్పించిన మా పెదనాయన రాఘవరాజు గారు వరంగల్ తాలూకా అంతటా ధనికులకూ, దరిద్రులకూ తలలోని నాలుక; గొప్ప వ్యవహారదక్షుడు. మా చిన్నాయన కొండమరాజు గారు వకీలు (కొండా వెంకటరంగా రెడ్డి గారి క్లాస్‌మేట్). మా నాయన నారాయణరాజుగారు ఉదయాస్తమానం చెమటోడ్చి భూమితల్లికి పులకరింతలు కూర్చే కృషీవలుడు; రాత్రులు భాగవతగోష్ఠీ ప్రియుడు. నాకు ఒక అన్న, ఒక అక్క, నలుగురు చెల్లెండ్లు, ఇద్దరు తమ్ములు. నేను పుట్టినది శా.శ. 1847 క్రోధన సంవత్సర చైత్ర బహుళ సప్తమి ఉత్తరాషాఢ రెండోపాదం తెల్లవారితే బేస్తవారం అనగా 16-4-1925 ఉదయం 4 గంటల ప్రాంతం. కాని ఉద్యోగ జీవితంలో నన్ను వెంటాడి వేధించినది 1333 ఫసలీ బహ్మాన్ నెల 15వ దినం అనగా 9-12-1923. అందువలన అరవైయేండ్లకు 1985 సంవత్సరం రిటైర్ కావలసిన వాణ్ణి 1983 సంవత్సరాంతాన రిటైరైనాను. అది దైవేచ్ఛ. ఆ విషయం తరువాత మనవి చేస్తాను. నాకు ఐదుగురు బిడ్డలు, ఒక కొడుకు. అందరూ బాగున్నారు. నా బాధ్యతలన్నీ తీరినవి.

దేవునూరెంత చిన్న గ్రామమో మడికొండ అంతపెద్ద గ్రామం. సంపన్నులు, సాధారణులు, పేదవారు, అన్ని వృత్తులవాళ్ళు, కవులు, పండితులు, పౌరాణికులు వేదవేదాంగ కోవిదులు, శతావధానులు, నటవిటీవిటగాయకులున్న గ్రామం అది. మడికొండలో తౌటిరెడ్డి గోపాలరెడ్డి పెద్ద భూస్వామి సంస్కృతంలో మాట్లాడేవారు. మ.మ. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారికి రూ. 116/- బాల సరస్వతి బిరుదం ఇచ్చి సన్మానం చేసింది గోపాల రెడ్డిగారే. ఆయన ఆస్థాన పండితులు, పౌరాణికులు వానమామల బక్కయ్యశాస్త్రి గారు. బక్కయ్యశాస్త్రిగారి పెద్ద కొడుకు వెంకటాచార్యులు షడ్దర్శనీ పారగులు. తరువాతి కాలాన కరీంనగరం జిల్లా గట్ల నరసింగాపురం గుండవరం జగన్నాథరావు ఆస్థాన పండితులు. రెండవ కొడుకు లక్ష్మణాచార్యులు చాందా జిల్లా ఆహిరీ సంస్థాన పండితులు, గొప్ప సంస్కృత కవులు. మూడవ, నాల్గవ కొడుకులు వానమామల జగన్నాథ చార్యులు, వరదా చార్యులు గొప్ప తెలుగు కవులు, సంగీత విద్వాంసులు, హరి కథకులు. వీరవల్లి నరసింహా చార్యులు శతావధానులు. అనుముల పెద్దయ్య, పండరి నాథశాస్త్రి, విశ్వనాథ శాస్త్రి, సోదరులు త్రేతాగ్నుల వంటి కాశీపండితులు, కాళోజీ రంగారావు గారు (కాళోజీ రామేశ్వరరావు, నారాయణ రావు గార్ల తండ్రి) వేదకాలపు ఋషివంటి సద్గురువు. పల్లా పాపయ్య సంగీత విద్వాంసులు. ఆయన నాల్గవ కొడుకు పల్లా దుర్గయ్య ఉస్మానియా విశ్వ విద్యాలయం మొదటి తెలుగు ఎం.ఏ. (1942). అనుముల విశ్వనాథ శాస్త్రి కొడుకు అనుముల కృష్ణమూర్తి నాకంటే రెండేండ్లు పెద్దవాడు. తరువాతి కాలాన చక్కని కవి. విశ్వనాథశాస్త్రి గారు తమ కొడుక్కు అమరం - అగ్నిసూక్తం నేర్పుతుంటే విని నేను నేర్చుకున్నాను. మా పొరుగిల్లు తంబళి పాపయ్య (బోడకాకరకాయబొట్టు - తమ్మళ్ళ పాపయ్య జుట్టు - పిల్లల పాటలకెక్కిన ప్రసిద్ధుడు) కొడుకు ముత్తిలింగం వీతరాగి, గాయకుడు. వాళ్ళింట్లో హార్మోనియం, తబ్లా, ఢక్కి, మద్దెల, వీణ, వేణు వాద్యాలుండేవి. వానమామల సోదరులు, మరికొందరు అక్కడ సంగీత సాధన చేసేవారు. భజనలు, హరికథలు జరిగేవి. వానమామల సోదరులు, పల్లాదుర్గయ్య, మోతుకూరి మధుసూదన రావు, ఆవాల వెంకటరెడ్డి నాటకాల రిహార్సల్స్ చేస్తుంటె, నేను ప్రాంప్టింగ్ చేసేవాణ్ణి. బాపట్ల నుండి తెలంగాణానికి వచ్చిన వల్లూరి బసవరాజుగారు (తరువాత కాలాన గొప్ప కాంగ్రెస్ నాయకులు - మంత్రి మాణిక్యం) మడికొండ సంపన్నుల పిల్లలకు ఇంగ్లీషు ట్యూషన్స్ చెప్పేవారు. మా బావ తిరుపతిరాజు, మా అన్న శ్రీనివాసరాజు ఆయన వద్ద ఇంగ్లీషు నేర్చుకున్నారు. నేను పుట్టకుమందే మడికొండలో (1924) ప్రతాపరుద్ర ఆంధ్ర గ్రంథాలయం నెలకొన్నది. ఇటువంటి వాతావరణంలో మడికొండలో మూడవతరగతి దాక చదువుకున్నాను.

మా మేనబావల చదువులకోసం మా నాయనమ్మ హనుమకొండలో ఉండటంచేత నేను హనుమకొండ మఫ్లీ బజారు స్కూల్లో మరల మూడవ తరగతిలో చేరినాను. ఏవో సెలవులకు దేవునూరికి పోతే నాకు సొమ్మరోగం వచ్చింది. ఆ యేడు చదువుపోయింది. మరుసటి సంవత్సరం హనుమ కొండ లష్కర్ బజార్ మఫ్లీ మిడిల్ స్కూల్లో (గడ్డిబంగ్లా నార్మల్ స్కూలుకు అనుబంధం) మరల మూడవ తరగతిలోనే చేరినాను. ఈవిధంగా మూడవ తరగతి మూడేండ్లు చదివినాను. ఈసారి మానాయనగారు నా వెంట మా పెద్ద పాలేరు ఎఱ్ఱగొల్ల ఐలయ్యను తోడుగా పంపినారు. అతని బంధువు కొమురయ్యసార్ ఆ మిడిల్‌స్కూల్లో టీచరు. కొమురయ్యసారే నన్ను నిలువునా చూచి నా అడ్మిషన్ ఫారం నింపినారు. నా పుట్టిన తేది 15 బహ్మన్ 1333 ఫసలీ అనగా 9-12-1923 వ్రాసినారు. నాకు మా నాయనమ్మ తమ్ముడు మహాపండితుడు రాయపర్తివాసి ప్రతికంఠం కృష్ణంరాజుగారు, మరొక బంధువు ఓంకారం రామచంద్రరాజుగారు, కృష్ణాజిల్లా మంటాడవాసి జొన్నవిత్తుల వెంకట సుబ్బయ్య, పాకయాజి (శ్రీ విద్యానందనాథ) శర్మగారు - ఈ ముగ్గురు వ్రాసిన మూడు జాతకాలున్నా కొమురయ్యసార్ వ్రాసినదే అఫిషియల్ డేట్ ఆఫ్ బర్త్ అయినది. దీనిని మార్చటానికి రెండుసార్లు ప్రయత్నించి విఫలుణ్ణయినాను. అది దైవేచ్ఛ - విధి బలీయం.

నాకు మా నాయనమ్మ తమ్ముడు మహాపండితుడు రాయపర్తివాసి ప్రతికంఠం కృష్ణంరాజుగారు, మరొక బంధువు ఓంకారం రామచంద్రరాజుగారు, కృష్ణాజిల్లా మంటాడవాసి జొన్నవిత్తుల వెంకట సుబ్బయ్య, పాకయాజి (శ్రీ విద్యానందనాథ) శర్మగారు-ఈ ముగ్గురువ్రాసిన మూడు జాతకాలున్నా కొమురయ్య సార్ వ్రాసినదే అఫిషియల్ డేట్ ఆఫ్ బర్త్ అయినది.

తొలిదినాలలో నేను హనుమకొండలో రాజపుత్రుల వాడలో బొందిలి చిన్నమ్మ ఇంట్లో ఉండేవాణ్ణి. మా యింటికి కుడివైపు మడిగెల్లో ఇ.వి. రామిరెడ్డి (తరువాత ఐ.ఏ.ఎస్.) ఆయన సోదరులు, ఎడమవైపు నాలుగిండ్ల అవల (ఈనాడు గాంధీభవన్ కార్యదర్శి) బి. లక్ష్మీకాంతరావు సోదరులు, ఆయన బావ పి.వి. నరసింహారావు (తరువాత భారత ప్రధానమంత్రి) ఉండేవారు. లక్ష్మీకాంతరావు చిన్న తమ్ముడు (నేలకొండపల్లికి దత్తుపోయిన) కంకిపాటి జగన్మోహనరావు నా క్లాస్‌మేట్. మా యింటి కెదురుగా కొన్ని గజాల దూరంలో రోడ్డు కావల తెలంగాణంలో రెండవ గ్రంథాలయం (1904 స్థాపితం), రాజరాజనరేంద్ర ఆంధ్ర భాషానిలయం, హైదరాబాదులో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం ఎట్టిదో హనుమకొండలో రాజరాజ నరేంద్రాంధ్రభాషానిలయం అట్టిది. అక్కడ శేషాద్రి రమణకవులు, గార్లపాటి రాఘవరెడ్డి, ఒద్దిరాజు శేషగిరిరావు, ముసిపట్ల పట్టాభిరామరావు, గొట్టిముక్కల రాధాకృష్ణరావు, కంభంపాటి అప్పన్న శాస్త్రి, డి. రాజాసార్, కాళోజీ సోదరులు ఇంకా ఎందరో కవులు పండితులు ప్రతిదినం కూడేవారు. ఆంధ్రప్రాంతం నుండి వచ్చే కవి పండితుల ప్రసంగాలు, అవధానాలు అక్కడే జరిగేవి.


పి.వి. నరసింహారావు

నా హైస్కూలు ఇంటర్ చదువులప్పుడు నాటి యువరాజకీయ కార్యకర్తలు కాళోజీ నారాయణరావు, మధుసూదనరావు, హయగ్రీవాచారి, ఎం.ఎస్. రాజలింగం అడవాల సత్యనారాయణగారల సభలు సమావేశాల్లో పాల్గొన్నాను. వినాయకచవితి, దసరా పండుగులప్పుడు జరిగే విద్యార్థుల వ్యాసరచన, వక్తృత్వ, తోకపద్య పఠనం పోటీల్లో పాల్గొన్నాను. 10వ క్లాసులో ఉండగా వసుచరిత్రకు వచనం వ్రాసినాను. ఆ యేడు నిర్వహించిన ఆంధ్రవారోత్సవాల కమిటీకి నేనే కార్యదర్శిని. ఆ ఉత్సవాలకు నిజాం తమ్ముడు బసాలత్‌జంగ్ బహద్దర్, విద్యామంత్రి అరవముదు అయ్యంగార్, తెలుగుశాఖాధిపతి రాయప్రోలు సుబ్బారావుగార్లు హైదరాబాదు నుండి వచ్చినారు. ఆ సందర్భంలో జరిగిన కవిసమ్మేళనంలో 'ఆంధ్రుడా ఓ ఆంధ్రుడా' శీర్షికతో ఒక గేయం చదివినాను. పెద్దలు మెచ్చి నా వీపు తట్టినారు. ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు లష్కర్ బజారు మర్కజీ స్కూల్ సందులో మార్వాడీల ఇంట్లో ఉండేవాణ్ణి. ప్రక్కయింట్లో ఒద్దిరాజు సీతారామచంద్రరావు, రాఘవరంగారావు సోదరులుండేవారు. వారు బహుభాషల్లో పండితులు, కవులు. స్వగ్రామం ఇనుగుర్తి – పల్లెటూరు నుండి (1918) విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాల, తెనుగు పత్రిక (1922) వెలయించిన సారస్వత ప్రతులు. నా "తెలుగు సాహిత్యోద్ధారకులు" గ్రంథంలో వారి గురించి వ్రాసినాను. నేను 10వ క్లాసు చదువుతున్నప్పుడు మా మడికొండలో 12వ ఆంధ్రమహాసభలు జరిగినవి. ఇంటర్ చదువుతుండగా మహాత్మాగాంధీగారు వరంగల్లుకు వచ్చినారు. ఈ రెండు మహాసభల్లో నేను వాలంటీర్‌గా పనిచేసినాను. నేను 10వ క్లాసులో ఉన్నప్పుడే మా అన్న శ్రీనివాసరాజుగారు చనిపోయినారు. ఆయన చిన్నపుడే ఇంటినుండి పారిపోయి ఏలూరులో మా నాయన గారి స్నేహితుడు మోతే గంగరాజు గారింట్లో ఉంటూ గాంధీస్కూల్లో చదివి, సబర్మతీ ఆశ్రమంలో గాంధీ మహాత్ముని సేవించి జయప్రకాశ్ నారాయణ గారికి అనుచరుడైనాడు. ఆయన మూలంగా మా ఇంట్లో రాజకీయ సామాజిక చైతన్యం కలిగింది. బహుశః ఆ సంవత్సరమే మా నాయనమ్మ తమ్ముడు రాయపర్తి కృష్ణంరాజుగారు చనిపోయినారు. ఆయన వద్ద వందల కొలది తాళపత్ర గ్రంథాలుండేవి. ఆయన ప్రాచీన శాసనలిపులు చదివేవారు. మా నాయన గారికి తాటికమ్మలపై ఘంటంతో లేఖలు వ్రాసి పంపేవారు. 1932 సంవత్సరం వరంగల్లులో కాకతీయోత్సవాలు జరిగినపుడు దూపాటి వెంకటరమణా చార్యులవారు కృష్ణంరాజుగారింటి నుండి కొన్ని తాళపత్ర గ్రంథాలు తెచ్చి ప్రదర్శించినారు. అందులో ఒకటి శ్రీనాథుని శాలివాహన సప్తశతి, ఉత్సవాల తరువాత ఆగ్రంథం మరల వారికి తిరిగి ఇవ్వలేదు. అందువలన వారి మైత్రి చెడినది, సరసము విరసమైనది.

ఇంటర్ పరీక్షలు వ్రాయటానికి నేను 1946 వేసవిలో హైదరాబాదుకు వచ్చినాను. ఇంగ్లీషు, ఎకనామిక్స్ పరీక్షలు వ్రాసిన తరువాత జ్వరపడ్డాను. ఆ జ్వరం టైఫాయిడ్‌గా మారింది. పరీక్ష పోయింది. ఉస్మానియా ఆసుపత్రిలో మూడు

నెలలున్నాను. తరువాత నా బస జాంబాగ్ సుందర భవనంలోనికి మారింది. అది వందేమాతరం వీరభద్రరావు, రామచంద్రరావు సోదరుల కార్యస్థానం. దేశభక్తులైన ఆ సోదరులు నిర్వహించే కార్యకలాపాల్లో పాల్గొంటూ 'లా' చదివినాను. ఆ దినాల్లో మెట్రిక్ ప్యాసైనవారు ఒక యేడాది లా చదివి వకీలు వృత్తి చేపట్టేవారు. రాయ్ బర్కత్‌రాయ్, నాగులవంచ కోదండ రామరావు (ఎన్.కె.రావు) గారల వద్ద లా పాఠాలు చదివినాను. నాటి మేధావుల్లో ఎన్.కె. రావుగారగ్రగణ్యులు, ఆజంజంగ్ బహద్దరు గారికి సన్నిహితులు. వారు మోజంజాహి మార్కెట్ వద్ద వనపర్తి క్వార్టర్స్‌లో ఉండేవారు. అక్కడే కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, సురవరం ప్రతాపరెడ్డి, మందుముల రామచంద్రరావు గార్లుండేవారు. ఎన్.కె. రావుగారు బ్రహ్మచారి. వారికి శుశ్రూష చేయటానికి పోతూ వస్తూ సురవరంవారిని, కప్పగంతులవారిని దర్శించేవాణ్ణి. 1947 సంవత్సరం ఇంటర్ పరీక్ష మరల వ్రాసి ఉత్తీర్ణుడనైనాను. లా పరీక్ష వ్రాయలేదు.

అప్పటి తెల్లబట్టలవాళ్ళ అహమహమిక ఆడంబరాలు వింతగా ఉండేవి. మడికొండలో రెండు మూడు రెడ్ల కుటుంబాల వారు లా చదివి వకీళ్ళైనారు. అదిచూచి మా చిన్నాయన కొండమరాజు గారు లా చదివి వకీలైనారు. మడి కొండ హనుమకొండలకు సమీప గ్రామం వడ్డేపల్లి పింగలిరెడ్డి భూస్వాముల ఆవాసం. ఆ కుటుంబంలో ఒకాయన ఐ.సి.యస్. చేయటానికి విలాయత్‌కు పోయినాడు. నన్ను విలాయత్‌కుపంపే ఉద్దేశంతో మా పెదనాయన, మా నాయన ఇంగ్లీషు మీడియం నిజాం కళాశాలలో చేరుమన్నారు. ఇంటర్‌దాకా ఉర్దూమీడియంలో చదివినవాణ్ణి ఒక్కసారి ఇంగ్లీషుమీడియంలోనికి దూకినాను. ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, తెలుగు–మూడు ఆప్షనల్స్ తీసుకొని 1947–1949 సంవత్సరాలు బి.ఏ. చదివాను. మొదటి కొన్ని నెలలు నిజాం కాలేజి హాస్టల్‌లో ఉన్నాను.

అది నిజాం రాష్ట్రంలో చీకటి యుగం. నిజాం నిరంకుశపాలన రజాకార్ల విజృంభణ. వాళ్ళ మోచేతినీళ్ళు త్రాగే జాగీర్దార్లు. జమీందారుల దౌర్జన్యాల మూలంగా హిందూ ప్రజానీకం అష్టకష్టాలు పడ్డారు. హత్యలు, దోపిడీలు, గృహ దహనాలు, మానభంగాలు విచ్చలవిడిగా జరిగినవి. ప్రభుత్వోద్యోగులు 90 శాతం ముస్లిములే. ముస్లిం పేదలు కూడా నవాబులట్లు గర్వించేవారు. విద్యార్థుల అహంకారానికి హద్దుల్లేవు. ఒక పండుగునాడు హిందూ విద్యార్థులు వండించుకున్న పాయసం గిన్నె రాత్రి భోజన సమయానికి ముస్లిం విద్యార్థులు ఎత్తుకపోయి తిని, గిన్నె ఆవల పారవేసినారు. నేను, నా సహాధ్యాయి నిజామాబాద్ నారాయణ (తరువాత పెద్ద గుత్తేదారు) ఆర్గురు ముస్లిం విద్యార్థులను చితుకబాదినాము. మరునాడే నన్ను నిజాం కళాశాల హాస్టల్ నుండి తొలగించినారు. కొన్ని దినాలు నా చిన్నప్పటి మిత్రుడు సి.యస్.రామలింగం ఇంట్లో (తుల్జా భవాని మందిరావరణం) ఉండినాను. అటు తరువాత సహాధ్యాయులు ఖమ్మం సర్వదేవభట్ల నరసింహమూర్తి, మాదిరాజు రామకృష్ణారావు లుండే మోతీగల్లీ చిదానందమఠం (బడీ చావిడీ వెనుక)లో చేరి స్వయంపాకం ప్రారంభించినాము. నాటి ఆర్య సమాజం, స్టేట్ కాంగ్రెస్, ఆంధ్రమహాసభ, హిందూ మహాసభ నాయకులు నిజాం నిరంకుశత్వాన్ని ఎదిరించే వారితో సాన్నిహిత్యం పెంచుకున్నాను. మాదిరాజు రామకృష్ణారావు సహాధ్యాయి కానడే (తరువాత బొంబాయి హైకోర్టు జస్టిస్, ఔరంగబాద్ విశ్వవిద్యాలయం వి.సి.), ఉస్మానియా విద్యార్థి నాయకుడు శ్రీరామానందతీర్థ, జయప్రకాశ్ నారాయణ గార్లకు సన్నిహితుడు. కానడే, పురుషోత్తం పురాణిక్, అడవిరావు, వెంకట్రావు నాయుడులతో కలిసి ఒక రాత్రి బీబీనగర్ దాకా పరుగెత్తిపోయి, పెద్దలు చెప్పిన పని చేసి వచ్చినాము. న బ్రూయాత్ సత్యమప్రియం.

నిజాం రాష్ట్రంలో చీకటి యుగం. నిజాం నిరంకుశ పాలన రజాకార్ల విజృంభణ. వాళ్ళ మోచేతినీళ్ళు త్రాగే జాగీర్దార్లు, జమీందారుల దౌర్జన్యాల మూలంగా హిందూ ప్రజానీకం అష్టకష్టాలుపడ్డారు. హత్యలు, దోపిడీలు, గృహదహనాలు, మానభంగాలు విచ్చలవిడిగా జరిగినవి.

ఆనాటి దేశభక్తులకు విరుద్ధంగా నిజాం ప్రభుత్వాన్ని సమర్థించే కలకత్తావాలా స్థాపించిన మీజాన్ తెలుగు పత్రికలో ఆధునిక ఆంధ్ర సాహిత్య చరిత్రలో గొప్పవారు అనిపించుకొనే మహామహులు సర్కారాంధ్రంనుంచి వచ్చి కొలువులు చేసిన వారు. ఇక్కడి హిందువులకు తీరని అపకారం చేసినారు – న బ్రూయాత్ సత్యమ ప్రియం. భగవదిష్టమే నా యిష్టం.

***(ఫిబ్రవరి 21, బిరుదురామరాజుగారి వర్ధంతి)***

# నాట్యశాస్త్రంలో స్త్రీలు

- యస్.ఏ.టి. రాజ్యలక్ష్మి

'నాట్యశాస్త్రం' భరతముని విరచితం. బ్రహ్మ ప్రోక్తం. సమకాలీన సమాజానికి, సంప్రదాయాలకు, కళలకు నిలువుటద్దం. నాట్యశాస్త్రం సర్వకళల సమాహారం. భారతీయ నాట్య సంప్రదాయానికి ఆది గ్రంథం. నాట్య సిద్ధాంతాలను నటీ నటుల స్వరూప స్వభావాలను, రంగస్థల విశేషాలను, రసాద్యంశాలను ఛందో వ్యాకరణ వైలక్షణ్యాలను వివిధాధ్యాయాలలో సమగ్రంగా, సాధికారికంగా లక్షణ బద్ధం చేసిన ముని భరతుడు.



**నాట్యశాస్త్రంలో స్త్రీ:** నాట్యశాస్త్రంలో భరతుడు స్త్రీకి సమాన ప్రతిపత్తిని కల్పించాడు. సూత్రధారుడు నాయక భూమికలను నిర్వహించగా, సూత్రధారుని భార్య నాయికా భూమికలను వహిస్తుంది. దీనిని బట్టి నాట్యశాస్త్ర రచనాకాలంలో స్త్రీలే స్త్రీ భూమికలను నిర్వహించేవారని తెలుస్తుంది. సూత్రధారుని భార్య కేవలం నటి మాత్రమే కాదు, ఆదర్శ గృహిణిగా కూడా చిత్రింపబడినది. ఆమె సూత్రధారుని యందు అపారమైన అనురాగమునుకల్గి ఉంటుంది. ఇంటిని చక్కదిద్దడంలో అమితాసక్తిని చూపిస్తుంది. సంతానం యొక్క యోగక్షేమాలలో శ్రద్ధ కనబరచినట్లుగా, కుమార్తె వివాహం విషయంలో ఎంతగానో తాపత్రయపడిన, ఆత్మీయతానురాగాలతో పెనవేసుకున్న మాతృమూర్తిగా స్త్రీ నాట్యశాస్త్రంలో దర్శనమిస్తుంది.

నాట్యశాస్త్రం ప్రకారం స్త్రీ కంఠం సహజంగానే మధురమైనది. స్త్రీ సాహాయ్యం లేకుండా నాట్యంలో కొన్ని వృత్తులను ప్రయోగించడం అసాధ్యం. ఈ విషయాన్ని భరతుడు ప్రథమాధ్యాయంలో పేర్కొన్నాడు. కైశికీ వృత్తిని నాట్యంలో ప్రయోగించటానికి స్త్రీ సహకారం కోసం భరతుడు బ్రహ్మదేవుని ప్రార్థిస్తాడు. అప్పుడు బ్రహ్మ ప్రత్యక్షమై మంజుకేళి, సుకేశి, మిశ్రకేశి, సులోచన, సౌదామిని, దేవదత్త, దేవసేన, మనోరమ, సుదతి, సుందరి, విదగ్ధ, విపుల, సుమాల, సంతతి, సునంద, సుముఖి, మాగధి, అర్జుని, సరల, కేరల, ధృతి, నంజ, పుష్కల, కలమ అను ఈ ఇరవై నాలుగు మంది అప్సరసలను సృష్టించాడు. వీరందరూ కైశికీ వృత్తి ప్రయోగమునందు నేర్పరులు, నాట్యాలంకారంలో చతురలు.

నాట్యశాస్త్రం స్త్రీని విభిన్న కోణాలలో పరిశీలించి స్వరూప, శీల, స్వభావాదులను దృష్టిలో ఉంచుకొని రకరకాలుగా విభజిస్తుంది. రంగస్థలం మీద స్త్రీలు గతి, సంభాషణలయందు మూడు విధాలుగా ఉంటారు. 1 ఆయతము 2. అవహిత్థము 3. అశ్వక్రాంతము. ఈ మూడు విధాల స్త్రీ లక్షణాలను, అవస్థలను, ప్రవర్తించవలసిన తీరు తెన్నులను భరతముని విశ్లేషించాడు. ఇంకా స్త్రీలు ఉత్తమ మధ్యమ, అధమ అనే భేదాలతో ఉంటారని; యౌవన వతులు, వృద్ధ స్త్రీలు, దాసీజనులు, పులింద, శబర స్త్రీల చేష్టలను, గతులను ఎలా ప్రయోగించాలో వివరించాడు. అంతేగాక తపస్వినులు, నియమవతులు, లింగధారిణులు, స్వస్థలు అయిన స్త్రీల శాంత స్వభావరీతులను కూడా నాట్యశాస్త్రం ఆ మూలాగ్రంగా విశ్లేషించి పేర్కొంది. నాయిక భేదాలను పేర్కొంటూ అష్టవిధ శృంగార నాయికలను, వారి అవస్థలను సహేతుకంగా భరతముని పేర్కొన్నాడు.

యస్.ఏ.టి. రాజ్యలక్ష్మి, తెలుగు అకాడమీ, హైదరాబాద్

**అష్టవిధ శృంగార నాయికలు:** 1. వాసక సజ్జిక 2. విరహోత్కంఠిత 3. స్వాధీన భర్తృక 4. కలహాంతరిత 5. ఖండిత 6. విప్రలబ్ధ 7. ప్రోషిత భర్తృక 8. అభిసారిక. నాటకాశ్రయములైన నాయికావస్థలు పై విధముగా ఉండునని వివరించడమే కాక అష్టవిధ నాయికావస్థల అభినయములను కూడా వివరంగా ప్రస్తావించాడు. వివిధ సందర్భాలలో నాయిక ప్రవర్తించే సహజ సిద్ధమయిన చేష్టలను పేర్కొన్నాడు. దైన్యము, రోషము తెచ్చుకొనుట, భూషణములను త్యజించుట, కేశ సంస్కారాదులు లేకుండుట, దుఃఖము, రోదనము అనువాటిచేత నాయికలు తమ తమ అవస్థలను అభినయించ వలెను. ఈ సందర్భంగా స్త్రీలకు సహజంగా ఉండే ఈర్ష్య, అసూయ, లజ్జ, ప్రణయకలహం, విరహబాధ వంటి లక్షణాలను నాట్యశాస్త్రంలో భరతముని ప్రస్తావించాడు. శృంగార ప్రధానంగా నాయికలను విభజించినట్లే శీలమును బట్టి ఉత్తమ, మధ్యమాధమ భేదంచేత మూడు విధములుగా పేర్కొన్నాడు. ప్రకృతి లక్షణ భేదంచేత దివ్య, నృపపత్ని, కులస్త్రీ, గణిక అనే నాలుగు విధాలుగా స్త్రీని విభజించాడు. నాటి సమాజంలో ఉన్న స్త్రీలను పరిశీలించి భరతుడు ఈ విధంగా పేర్కొన్నాడు. ఇది నాటి సమాజానికి దర్పణం.



అంతఃపురంలో ఉండే పట్టమహిషులు, పరిచారికలు వంటి వారు ఏ విధంగా ఉండాలో, వారి గుణశీలాదులు ఎలా ఉంటాయో పేర్కొన్నాడు. స్త్రీ సుఖానికి మూలం. తపస్సుచేత ధర్మాన్ని, ధర్మం చేత సుఖాన్ని సాధించాలి. దానికి స్త్రీ మూర్తియే ఆలంబన. అందుకే వారి సమాగమం ఆకాంక్షిపదగినది అని భరతముని బోధించాడు. ఈ విధంగా సర్వసుఖాస్పదమయిన స్త్రీ దేవ, దానవ, గంధర్వ, రక్షో, నాగ, పక్షి, పిశాచ, యక్ష, వ్యాల, నర, వానర, హస్తి, మృగ, మీన, ఉష్ట్ర, మకర, ఖర, సూకర, వాజి, మహిష, అజ, శ్వ, గవాదులతో సమానమైన శీలస్వభావాలను కలిగి ఉంటారని పేర్కొని, ఏ ఏ స్థితులలో ఈ స్వభావాలు ప్రవర్తిస్తాయో సవిస్తరంగా నాట్యశాస్త్రం పేర్కొంటుంది.

నియమవతులు, తపస్వినులు, లింగధారిణులు వంటి సౌమ్య స్త్రీలను శాంతమే ఆభరణంగా కలవారిగా భరతముని పేర్కొన్నాడు. నాట్యశాస్త్రం ప్రకారం స్త్రీలకు రెండు విధములైన అలంకారములు కలవు. 1. స్వతస్సిద్ధమైనవి 2. అయత్నజము లైనవి. లీల, విలాస, విచ్ఛిత్తి, విభ్రమ, కిలికించిత, మోట్టాయిత, కుట్టుమిత, బిబ్బోక, లలిత, విహృతము అనే ఈ పది, స్త్రీలకు సహజసిద్ధమైన అలంకారాలు. శోభ, కాంతి, దీప్తి, మాధుర్య, ధైర్య, ప్రాగల్భ్య, ఔదార్యములనెడి ఈ ఏడు అలంకారాలు అయత్నజము లైనవి. అవి ప్రయుక్తమయ్యే సందర్భాలలో స్త్రీ స్వభావంలో వచ్చే పరిణామాలను నాట్యశాస్త్రం వివరిస్తోంది. రంగస్థలంపై ఆసన విధులను, శయన విధులను నియంత్రిస్తూ వివిధ భావాలకు అనుగుణంగా ప్రవర్తించవలసిన పద్ధతులను కూడా నాట్యశాస్త్రం పేర్కొంటుంది. సనాతన భారతీయ సంప్రదాయంలో స్త్రీ మానవతి గాను, సుకుమారిగాను భావించడం వలన స్త్రీలను సంబోధించడానికి తగిన పదజాలాన్ని సైతం నాట్యశాస్త్రం పేర్కొంది.

భారతీయ సమాజంలో స్త్రీకి మహోన్నతమైన స్థానం ఉంది. స్త్రీ గౌరవ మర్యాదలను కాపాడాలనే భావాన్ని ఉద్బోధిస్తూ భరతముని నాట్యశాస్త్రంలో స్త్రీలు అవమానింపబడకుండా ఉండేందుకు కొన్ని నిషేధాలను పేర్కొన్నాడు. రంగస్థలంపై వస్త్రధారణ, స్నానం చేయుట, చందనాదులు ధరించుట, కాటుక పెట్టుకొనుట, జుట్టును ముడివేసుకొనుట వంటి కార్యాలను రంగస్థలంపై ప్రయోగించరాదని పేర్కొన్నాడు. ఈ విధంగా నాట్యశాస్త్రం స్త్రీని విభిన్నరీతులలో ఆవిష్కరించింది. దివినుండి భువికి దిగివచ్చిన దివ్యకళ అయిన నాట్యాన్ని ఆమూలాగ్రంగా లక్షణ బద్ధం చేసిన నాట్యశాస్త్రం త్రైలోక్య క్రియోపేతమైనది. ధర్మ ప్రతిపాదితమైనది. చతుర్విధ పురుషార్థ సాధకము, యశస్కరము, సర్వశాస్త్ర సంపన్నము, ఇతిహాస సహితము. అయిన ఈ నాట్యశాస్త్రమును బ్రహ్మ ఋగ్వేదం నుంచి పాఠ్యాన్ని, సామవేదం నుంచి గీతాన్ని, యజుర్వేదం నుంచి అభినయాలను, అధర్వవేదంనుండి రసాలను సేకరించి సృష్టించాడు. ఈ నాట్యం మూడు లోకాలలోని వారి స్వభావాలను ప్రదర్శిస్తుంది.

## బెంగుళూరు నాగరత్నమ్మ ప్రస్థావన:

# ముద్దుపళని రాధికాసాంత్వనము

- ఎన్నార్కె

18వ శతాబ్దానికి చెందిన తంజావూరు నివాసయిన 'ముత్యాలు', పళనిలో కొలువైయున్న సుబ్రహ్మణ్యస్వామి భక్తుడు కావటంతో, తన పెద్ద కూతురుకు 'పళని' అని నామకరణం చేశాడు. ఎంతో గారాబంగా ముద్దు చేయటంతో ఆమె నందరూ 'ముద్దు పళని' అని పిలిచేవారు.

ఆమె యౌవనం వికసించక పూర్వమే సంగీత, సాహిత్య నృత్య కళా విశారదయింది. ఆమెది దేవదాసి కుటుంబ నేపథ్యం కావటంతో ఆమె ఇంటికి విటులే కాదు, విద్వాంసులూ వచ్చి పోతుండేవారు. 1740 ప్రాంతంలో తంజావూరును పాలించిన ప్రతాపసింహుడు ఆమె అందచందాలకూ, కళా సౌష్టవానికి మురిసి ఆమెను తన ప్రియసఖిగా చేసుకున్నాడు.

ముద్దుపళని శ్రీకృష్ణ భక్తురాలు. తాను రచించిన 'రాధికాసాంత్వన'మన్న గ్రంథాన్ని కృష్ణునికే అంకితమిచ్చింది. ఆమె దృష్టిలో కృష్ణుడెప్పుడూ బాలుడే. అతను చిన్ని కృష్ణుడైనా శృంగారలోలుడే. తన రచనలో, అప్పుడు దక్షిణాంధ్ర సామ్రాజ్యంలో నడచిన శృంగార భోగలాలసతనంతా కృష్ణుని పరం చేసింది. కావ్యం ఎత్తుకుంటూనే వ్రేపల్లెను సానివాడలా వర్ణించగలగటం ఆమెకే చెల్లింది. ఎంతో గడుసుగా, అస్కలిత బ్రహ్మచారయిన శుకమహర్షి చేత ఈ శృంగార కథను జనక మహర్షికి చెప్పించింది.

తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు చేసిన ఛార్లెస్ ఫిలిప్‌బ్రౌన్ 1855వ సంవత్సరంలో భారతదేశాన్ని విడిచి వెళ్ళబోయే ముందు కొన్ని ప్రాచీన గ్రంథాలను అచ్చు వేయించడానికి సిద్ధంచేసి మద్రాసులోని ప్రాచ్య లిఖిత భాండాగారంలో వుంచారు.

బ్రౌన్ సహోద్యోగయిన వెంకటనరసు వీటిని అచ్చువేశారు. రాధికాసాంత్వనము 1887లోనూ, తిరిగి 1907లోనూ అచ్చువేసి పుస్తకంగా విడుదల చేశారు. తిరుపతి వేంకటకవుల రచన ద్వారా బెంగుళూరు నాగరత్నమ్మకు "రాధిక సాంత్వనము" గురించి తెలిసింది. ఆమె మూల వ్రాతప్రతిలోని కొన్ని పాదాలు అచ్చు పుస్తకంలో లుప్తం కావటంతో వాటిని తిరిగి రచనలో చేర్చి సంపూర్ణమయిన ఆ రచనను వావిళ్ళ రామశాస్త్రులు అండ్ సన్స్ ద్వారా ప్రచురింపజేసింది. ఈ పుస్తకం మార్చి 30, 1910 సం॥ 750 కాపీలుగా విడుదలైనాయి. కాపీ వెల ఆరణాలు (అర్ధ రూపాయి). రాధికాసాంత్వన రచనను కందుకూరి వీరేశలింగం తీవ్ర పదజాలంతో విమర్శించటంతో బాధపడిన నాగరత్నమ్మ, తాను సంపాదకత్వం వహించి ప్రచురించిన ఈ పుస్తకంలో ముందుమాట వ్రాస్తూ వాటిని ఖండించింది.

**నాగరత్నమ్మ వ్రాసిన ముందుమాట**

*వావిళ్ళ రామశాస్త్రులు అండ్ సన్స్ ప్రచురితం : 1910*

ప్రస్థావన - **బెంగుళూరు నాగరత్నమ్మ :** ముద్దు పళణి, ఈమెను గూర్చి మ॥రా॥శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారు తాము "యాంధ్ర కవుల చరిత్రములో వ్రాయించిన పంక్తులు కొన్ని అవసరమునుబట్టి ఇందు భాషించుచున్నాను.

"ముద్దు పళని పద్య కావ్యములు చేసిన స్త్రీలలో నొకతె. ఈ ముద్దు పళణి వేశ్యాంగన. ఇది రాధికా సాంత్వనమను నాలుగశ్వాసముల శృంగార ప్రబంధమును రచించెను. దీని తల్లిపేరు ముత్యాలు. అది తంజావూరు సంస్థాన ప్రభువయిన ప్రతాపసింహుని యుంపుడు గత్తెయినట్లు గద్యములో

వ్రాయబడిన దానిని బట్టి యూహింపదగియున్నది” అనియు వ్రాయుటచే శ్రీ పంతులు వారు కూడ భూపీఠికను చూచినట్లు కనపడదు. పీఠికలో కవయిత్రి వంశ వర్ణనము కలదు. ముత్యాలు ననునాతడు పళణికి తండ్రి. ముద్దు అనునది ఉపనామము. పళణి యనగా దక్షిణ దేశములోని సుబ్రహ్మణ్యస్వామి వేంచేసియున్న దివ్య స్థలమునకు పేరు. చాలాచోట్ల బిడ్డలకు దేవస్థలముల పేర్లు ఉంచుచుండు వాడుకయున్నది.

ఈ ప్రబంధములో యశోదకు మేనకోడలును, శ్రీకృష్ణునికి భార్యయు యగు ఇళాదేవి చరిత్ర యుండుటచే దీనికి 'ఇళాదేవియ'మను నామాంతరము వచ్చినది.

''ఇది సంగీత సాహిత్య భరత శాస్త్రములలో ప్రవేశరాలైనట్లు తానే చెప్పుకొన్నది. దీని కవిత్వము నతి కఠినమై మృదువుగా నుండినందుకు సందేహము లేదు. దీనికి మంచి సంస్కృతాంధ్ర సాహిత్యమును గలదు. అందందు తప్పులున్నవి కాని అట్టి తప్పులు పురుషుల కవిత్వమునందు సైతము లేక గ్రంథములలో కానబడుచున్నవి'' అని శ్రీ పంతులువారే యొప్పుకొనిరి. బాగుగా ఆలోచించినచో శబ్దములనుబట్టియో, అర్థమును బట్టియో భావములను బట్టియో, రసమును బట్టియో, ఔచితినిబట్టియో యెటులయిన నేమి తప్పు లేకుండా భారతము మొదలుగా ఏ గ్రంథమునూ లేదు. ఇట్లుండగా స్త్రీలు వ్రాసిన గ్రంథములలో తప్పులుండుట ఒక తప్పుకాదు, అయిననూ గ్రంథములలోని భాగము లనేకములు స్త్రీలు వినదగినవియూ, స్త్రీనోటనుండి రాదగినవియూగాక దుష్యములై యున్నవి అని శ్రీపంతులు గారు వ్రాసిరే కాని 'తారాశశాంక విజయము', 'హంస వింశతి', 'వైజయంతీ విలాసము' మొదలగు గ్రంథములలోని వానికన్న ఎక్కువగా ఇందు దుష్యములున్నవా? అదిగాక స్త్రీలు, పురుషుల వలన వినగూడక పోవచ్చును గాని, తమలో తాము చదువుకొనుటకు బాధాకరమేమున్నది? ఇంతకూ ఇది భగవచ్చరిత్రము. తారాశశాంక విజయములవలె స్త్రీలకు చెడు బుద్ధులు గఱపు విషయ మేదియునూ ఇందులేదే! ''ఇది జారత్వము కులవృత్తిగాగల వేశ్యయగుటచే స్త్రీ జన స్వాభావికమైన సిగ్గును విడచి శృంగార రసమను పేర సంభోగాది వర్ణనములను పుస్తకము నిండ మిక్కిలి పచ్చిగా రాసినది” అని వ్రాసిరి. అగ్ని సాక్షికముగా నొక మగనిని గట్టుకొని రెండవ మొగనితో బోవుట జారత్వమనిపించుకొనును గాని, వేశ్య జారిణి అనిపించుకోదు. బ్రహ్మ సృష్టి నాటినుండియూ వచ్చుచున్న మా జాతికి కులవృత్తి ఎట్టిదో, ఆ సంగతి వాత్సాయన కామసూత్రములో యదార్థము గోచరించును.

సిగ్గనునది, స్త్రీ జనమునకే కాని, పురుషులకు మాత్రము స్వాభావికము కాదు కాబోలును. ఇక్కవయత్రి వేశ్య గనుక సిగ్గుమాలి సంభోగాది వర్ణనములు పచ్చిగా వ్రాసిన వ్రాయవచ్చును కాని, శిష్టులనిపించుకున్న పురుషులట్లు వ్రాయగూడదు గదా? అట్టి మహానుభావులు మాత్రము తమ తమ గ్రంథములలో ఇంతకన్న ఎక్కువ పచ్చిగా వర్ణనలు చేయలేదు కాబోలును. వేయేల? శ్రీ పంతులు తమకవుల చరిత్రలో, “వేశ్యా సంపర్కము వలన నెట్టి దృఢమనస్కులకును ననర్థములు వచ్చునని చూపుటకై యింతవరకు కల్పింపబడిన కథ, నీతి బోధకముగానే యున్నది. కాని తరువాత కథ మాత్రము నీతి బాహ్యముగా నున్నది” అనియు, ''ఇటువంటి సిద్ధాంతములే మనదేశములో నీతికిని, పతనమునకు గూడ నమితమైన చెరుపును కలుగ జేయుచున్నది. నీతిని విడచిన మతమెప్పుడూ దేవునికి ప్రీతికరము కానేరదు” అనియు నిందించి, తరువాత తమ స్వహస్తముతో సరిచూచి అచ్చొత్తింప వచ్చిన 'వైజయంతీ విలాసము'లోని 'సచ్చవిల్తుని పచ్చిక పట్టు' కన్నను, వీరే స్వయముగా రచించిన 'రసికజన మనోరంజము'లోని బూతులు కన్నను, ఇందు పచ్చి బూతులు కన్పట్టుచున్నవా? వీరధికారమందుండుటచే మదరాసు విశ్వవిద్యాలయములో దీనిని వారు పఠనీయ గ్రంథముగా నిర్మించుకొనిరి.

> **“… శ్రీనాథుడు తొలిసారిగా రాధాకృష్ణులతో పెదవుల మీద ముద్దులు పెట్టించాడు (భీమేశ్వరపురాణం). ముద్దు పళని ఒళ్లంతా పెట్టించింది. ఎక్కడెక్కడో వలపు ముద్దులు కళలు కరగంగ పెట్టించింది. కామశాస్త్రం కాచి వడపోసిన జాణ, పచ్చిగా శృంగారాన్ని వర్ణిస్తేగాని రసం పండదన్నట్లు రచన చేసింది. రసికులు మెచ్చుకున్నారు – చాదస్తులు నొచ్చుకున్నారు…”** **– ఆరుద్ర**

ఈ గ్రంథము రసమొల్కుచుండుట చేతను, ఇది రచించినది స్త్రీయేగాక, మా జాతిలో పుట్టిన దగుటచేతను దీనిని మంచి ప్రతిగా ముద్రింపవలయునను తలంపుతో ప్రతిపని పూని వ్రాసితిని.

*చెన్నపట్టణము , 9-3-1910*

**రాధికాసాంత్వనము కథ.**

రాధ కృష్ణుని తండ్రయిన నందుని చెల్లెలు. కృష్ణునికి స్వయాన మేనత్త. కృష్ణుని తల్లయిన యశోదకు తోడ బుట్టినవాడు కంభకుడు. ఇతని కూతురు 'ఇళ.' ఈమె కృష్ణునికి వరస. ఇళను కృష్ణునికిచ్చి పెళ్ళి చేశారు. అప్పటికి ఆ పిల్ల యింకా ఈడేరలేదు. ఇళ వ్రేపల్లెలో రాధ పెంపకంలో పెరుగుతుంది. ఇళ సమర్తతో ఈ కావ్యం మొదలవుతుంది. ఆచారం ప్రకారం పునఃస్సంధానం గొప్పగా చేశారు.

రాధ కృష్ణునికి తలంటు పోసింది 'మదన సామ్రాజ్యానికి పట్టాభిషేకం చేసిందా' అన్నట్లు. అంతకుముందే ఆమె ఇళను అలంకరించింది. ఆమెకు ఎన్నో రహస్యాలు వివరించింది. కిటుకులు చెప్పింది. ఆమెను కృష్ణునికి అప్పచెబుతూ, "నీకు తగ్గట్టు నేను కాదు, ఇది ఒట్టి ముద్దరాలు ఎలా ఏలుకుంటావో" అని హెచ్చరించింది.

కృష్ణుడు ఇళ ఒకటయిన తరువాత, రాధ కృష్ణుని వియోగం భరించలేక దుఃఖితురాలవుతుంది. కృష్ణుడు రాధను ప్రసన్నం చేసుకొని ఆమెను సాంత్వనపరచటమే ఇందులోని కథా వస్తువు.



పుస్తకం విడుదలయిన ఒక సంవత్సరం వరకూ ఏమీ జరగలేదు. ఆ తరువాత మొదలయింది అసలు కథ. 1911 జనవరి 11వ తేదీన మద్రాసు నుంచి వెలువడే 'శశిరేఖ' అనే తెలుగు పత్రిక తన సంపాదకీయంలో ఈ పుస్తకాన్ని అసభ్యకరమైన, నీతిమాలిన పుస్తకంగా దుయ్యబట్టింది. "దేవుడు ఒక వ్యభిచారితో నలభై భంగిమల్లో రతిక్రీడ సాగించటం, వావివరుసలులేని శృంగారం దైవ సంబంధమైనవిగా నాగరత్నమ్మ పేర్కొనటం, సామాన్య ప్రజలు సహితం అర్థం చేసుకోగలిగినంత సులభ శైలిలో ఈ రచన ఉండటము వలన అంచనా వేయలేనంత చెడు ఫలితాలలొస్తాయని" పేర్కొంది.

ఈ వ్యాసం కాపీలను పరిశీలించవలసినదిగా ప్రభుత్వం తెలుగు అనువాదకునికి పంపారు. ఆయన ఈ కావ్యంలో అశ్లీలత రోత పుట్టించేదిగా వుందని, కవయిత్రి (ముద్దుపళని), సంపాదకు (బెంగుళూరు నాగరత్నమ్మ) రాలిద్దరూ వేశ్యలని, యుక్తవయస్సులోని పిల్లలు ఇది చదివి చెడిపోతారనీ, సంపాదకులు, ప్రచురణకర్తల మీద ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 292 కింద నేరం మోపవచ్చునని సిఫార్సు చేస్తూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శికి లేఖ వ్రాశారు.

ఈ పుస్తకంతోపాటు మరో ఎనిమిది పుస్తకాలపైన ఆరోపణలు వచ్చాయి. పోలీసులు తమ విచారణలో భాగంగా పుస్తక దుకాణాలను తనిఖీ చేసి, తెలుగు, తమిళ భాషలలోనున్న పద్దెనిమిది పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో కందుకూరి వీరేశలింగం వ్రాసిన 'రసికజన మనోరంజనం' కూడా ఉంది. ఈ పుస్తకాల జాబితాను విడుదల చేసినపుడు, వీరేశలింగం పేరు తీసేసి, గ్రంథం పేరు మాత్రం ఇచ్చారు. మిగిలిన పుస్తకాలకు అన్ని వివరాలు ఇచ్చారు. కేసు విచారణ పూర్తయిన తరువాత వీటిల్లోనుంచి 9 తెలుగు పుస్తకాల మీద మాత్రమే అశ్లీలతకు సంబంధించిన కేసు పెట్టారు. దీనినుంచి 'రసికజన మనోరంజనం'ను మినహాయిస్తూ, కందుకూరి వారు సంపాదకత్వం వహించిన 'వైజయంతీ విలాసం'ను ఉంచారు. వీటన్నిటిపై భారతీయ శిక్షాస్మృతి 293 సెక్షను కింద ప్రచురణకర్త మీద కేసు వేశారు. నాగరత్నమ్మ కేవలం సంపాదకత్వం వహించటం వలన ఆమెపై ఏవిధమైన కేసు పెట్టలేదు. నాగరత్నమ్మ, ప్రచురణ కర్తలు ఈ విషయంలో ప్రజలను చైతన్య వంతులు చేయాలనుకున్నారు. ఈ గ్రంథాలు ఇప్పటివి కావు. ప్రాచీనమయినవి కాబట్టి ఈనాటి చట్టాలు వీటికి వర్తించవని వాదన చేశారు. హైకోర్టు స్టే మంజూరు చేసింది.

మద్రాసు భూస్వాముల సంఘకార్యదర్శి, కళా పోషకుడైన జి. వెంకటరావు అనే ఆయన జయదేవుని గీతగోవిందంలోని 'రాధామాధవ సంవాదమ'నే సంస్కృత కావ్యానికి ఇది అనుసరణ. రాధాకృష్ణుల ప్రేమ కథావస్తువుగల ఇతర కావ్యాల వలెనే ఇందులో కూడా అంతర్లీనంగా, ఆధ్యాత్మికత భగవదారాధన వున్నాయి. ఆనాటి సున్నితమైన మనోభావాలు,

నాజూకైన ఆలోచనా సరళి ఈనాటి నైతిక ధోరణిగల విమర్శకులకు రుచించవు. ప్రేమను కళాత్మకంగా వర్ణించడానికి సమగ్రమైన ప్రమాణాలు లేవు అంటూ, మిగిలిన ఎనిమిది పుస్తకాలపైన కూడా ప్రతివాదం చేస్తూ ప్రభుత్వానికి వ్రాశారు. ఇంకా, "అక్కడక్కడా శృంగారవర్ణనలే న్యాయ విచారణకి ప్రాతిపదికలయితే తెలుగు, సంస్కృత కావ్యాలేవీ మినహాయింపు కాదు. తెలుగు ప్రబంధాల ప్రచురణ నిలిపి వేయవలసి ఉంటుంది. ఈ సాహిత్యంపై న్యాయవిచారణ జరగాలనటమే మంచి పద్ధతి కాదు" అంటూ తెలిపారు.

మొత్తంగా ఈ గొడవపై గవర్నర్ కౌన్సిల్ ఆసక్తి కనపరచింది. సర్ ముర్రే హెమ్మిక్ అనే సభ్యుడు, "రాధికాసాంత్వనము అమ్మకానికోసం వుంచుకున్న వ్యక్తి భారత శిక్షాస్మృతి ప్రకారం శిక్షార్హుడే. శృంగారభాగాలున్న పుస్తకాల పంపిణీ ఆపెయ్యాలి. ప్రచురణకర్త ఈ పుస్తకాన్ని దురుద్దేశంతో వేయలేదు. సెన్సారుకాబడని భాగాలతో వున్న కాపీలను అమ్మకుండా వుండటానికి ప్రచురణకర్త ఒప్పుకుంటే కేసు ఎత్తి వేయవచ్చని" రికమండ్ చేశారు. ఈ విషయం శరవణబవనందం పిళ్ళే అనే పోలీసు ఆఫీసరుకు పరిశోధన నిమిత్తం ఇచ్చారు. ఆయన ప్రచురణకర్త పరువు ప్రతిష్టలున్న గౌరవనీయమైన వ్యక్తని, కులీనులు, పాశ్చాత్య దృక్పథం గలిగిన భారతీయులు ఈ పుస్తకం తను ఇళ్ళల్లో చదవడానికి తగ్గవి కాకపోవటంతోనే వీటిపట్ల మరింత వ్యతిరేకత పెరిగిందని వ్రాశాడు.

దక్షిణ భారత సంఘం, తెలుగు సంస్కృత పండితులు, తెలుగు సాహిత్యాభిలాషులతో ఒక సమావేశం జరిపి, "కేసునడుస్తున్న 9 తెలుగు ప్రచురణలు ప్రాచీన తెలుగు సాహిత్యానికి చెందినవి. ఇవి సంస్కృత సాహిత్యాన్ని అనుసరిస్తూ వచ్చినవే. అందుకని వీటిపై కేసు ఉపసంహరించుకోవలసినదిగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన గురజాడ అప్పారావు పంతులు ఈ తీర్మానాలను ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి పంపారు. చివరకు ఈ 9 పుస్తకాలను సెన్సారు చేయకుండా ప్రచురించనని ప్రచురణకర్త వ్రాత పూర్వకంగా హామీ ఇచ్చిన తరువాత కేసులను ఉపసంహరించు కోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం వారి దృష్టిలో రాధికాసాంత్వనములో 23 పద్యాలు అసభ్యంగా కనిపించటంతో వాటిని నిషేధించారు. అవి :

| | |
|---|---|
| ప్రథమా శ్వాసంలో | 65, 66, 70, 71, 82, 85, 86, 88, 103. |
| ద్వితీయాశ్వాసంలో | 139, 140, 142. |
| తృతీయాశ్వాసంలో | 105, 110, 113, 115, 123, 127, 133 |
| చతుర్థా శ్వాసంలో | 102, 103, 104, 105 |

*మచ్చుకు ఒక పద్యం:*

**సీ॥ చెలువుండు కౌఁగిటఁ జేర్చునో, యపుడీవు**
**గుబ్బలమెల మెల్లఁ గ్రుమ్మవమ్మ!**
**విభుఁడు చెక్కిలి ముద్దుపెట్టునో, యపుడీవు**
**నలరు మో వొక్కింత యానవమ్మ!**
**సామి పైకొని రతి సల్పునో, యపుడీవు**
**నించుక యెదురొత్తు లియ్యవమ్మ!**
**ప్రాణేశుఁ దల కేళి బడలునో, యపుడీవు**
**పురుషాయతము వేగఁ బూనవమ్మ!**

**తే॥ అతఁడు నవరస రసిక శిఖావతం సుఁ**
**దధిక సుకుమార మూర్తి నీ, వతని నెటుల**
**వలచి వలపించు కొనియెదో? పలికినాను,**
**నాన గొన బోకు, నా మీద నాన నీకు.**

అయితే కందుకూరి వీరేశలింగం అనుయాయులు వూరుకోలేదు. రాధికాసాంత్వనము మొత్తం అశ్లీలమనీ, వాటిలోని దోషాలను తొలగించటం అసాధ్యమనీ పేర్కొన్నారు. దానితో మొత్తం అన్ని ప్రతులను నాశనం చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం 1911 సెప్టెంబరు 27న పోలీసు కమీషనరుకు మెమొరాండం ఇచ్చింది. ఈ సాహిత్య రణరంగంలో రాధికా సాంత్వనము కనుమరుగైంది. మిగిలిన పుస్తకాలు సెన్సారు కాబడ్డ వాటిని తొలగిస్తూ ప్రచురించబడ్డాయి.

ఈ మొత్తం విషయంలో డాక్టర్ కె.ఎన్. కేసరి 1949లో దీని గురించి వ్రాస్తూ, "వీరేశలింగాన్ని ఎదుర్కోడానికి అసమాన ధైర్య సాహసాలు కావాలి. నాగరత్నమ్మ కాబట్టి ఆ సాహసం చేయగలిగింది" అన్నారు.

బెంగుళూరు నాగరత్నమ్మ తాత్కాలికంగా ఈ విషయంలో ఓడిపోయినట్లనిపించినా, టంగుటూరి ప్రకాశం పంతులు మద్రాసుకు ముఖ్యమంత్రిగా నున్నపుడు దీనిపై నిషేధాన్ని ఎత్తివేశారు. చివరకు ఆమె వాదమే గెలిచింది. 1950 సంవత్సరంనుండి రాధికాసాంత్వనము అనేక ముద్రణలకు నోచుకుని ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.

## ప్రపంచీకరణ

# వృత్తి పదజాల పరిరక్షణ

*- మూలె విజయలక్ష్మి*

ఆంధ్రదేశం కళలకు కాణాచి, కులవృత్తులకు ఆటపట్టు. కులవృత్తులు భాషకు ఆయువుపట్టు. దేశీయతకు పట్టుగొమ్మలు. తెలుగు సంస్కృతీ వైభవానికి ఆనవాళ్లు. ఇంతటి దేశీయత కలిగిన కులవృత్తులు నేడు ప్రపంచీకరణ ప్రభావం వల్ల కునారిల్లుతున్నాయి. పొట్టకూటికోసం వృత్తి కళాకారులు కూలికి నాలికి పోతున్నారు. ఉందూరు వదలి పల్రస్తం బాటపడుతున్నారు. పల్లెసీమల్లో సేద్యం కులకసిపి పనులు అల్లిబిల్లిగా అల్లుకున్న అనుబంధాలు కకావికల మవుతున్నాయి. చకచకా నడిచే నాగలి, గిరగిరా తిరిగే చక్రం, పసపస చెక్కే బాడిశె, వాటుకొట్టుతుంటే లయతో నాదిరదిన్న అంటూ వీనులవిందుచేసే మగ్గం, కణకణమండే కొలిమి ప్రపంచీకరణ ప్రభావంతో నిస్సత్తువ కమ్ముకొని కూల బడినాయి.

మరోవైపు జానపద కళనే వృత్తిగా, జీవనాధారంగా సాగించే జానపద కళాకారులు, కులాల నాశ్రయించి బతికే ఆశ్రితకులాలు అలోలక్షణా అంటూ ఆగమ్మపక్షులవుతున్నారు.

ఈ సంక్లిష్ట పరిస్థితులలో సామాజిక స్పృహ ఉన్న రచయిత స్పందించారు. ఈ దయనీయ జీవన చిత్రాలను తెలుగు సాహిత్యంలో కళ్ళకు కట్టించారు. మగ్గాలమీద నేతతోనే నీతిగా బతుకెళ్ళదీసే నేతన్న నేడు నిర్వేదంతో, నిట్టూర్పులతో కాలం వెళ్ళదీసే జీవితగాథ జాతశ్రీ 'చిరునామా.'

కోత మిషన్లు, ట్రాక్టర్ల రాకతో కులవృత్తులు ఎత్తుబడి బరువైన జీవితం గాథ సుంకోజి దేవేంద్రాచారి 'అన్నం గుడ్డ.'

నాగలికీ నక్కుకీ వున్న లంకి, కంసాలోడికి కాపోనికి వున్న లంకి వికలమవటంతో పర్ణశాలలాంటి ఆసరసాల జీర్ణశాల కావటంతో దిగులుపడిన కంసాలన్న గతజీవిత వైభవగాథ గౌరునాయుడు 'ఆసరసాల.'

మన్నునుంచి పుట్టి మానవమనుగడనుంచి ఎదిగి తరానికి తరానికి నైపుణ్యాన్ని పొంది కుదేలయిన కుమ్మరన్న గాథ పెద్దింటి అశోక్ కుమార్ 'కాగుబొత్త.'

కల్లుపులిసిపోవడం తప్ప ఖర్చయ్యే రోజులు పోవడంతో తాళ్లు ఎక్కిదిగడమే తప్ప ఎదిగొచ్చే స్థితికానని చితికిన గౌండ్లన్న గాథ జాతశ్రీ 'అంతర్ముఖం.'

యిప్పుడు బాటాలొచ్చి గూటాలకి పనిలేక పొయ్యా! కంపెనీలొచ్చి కొంపకూల్చేశె. ఈ పలాస్టికు సెప్పులొచ్చి పేనాలను కాజేసినాయి. చర్మకార వృత్తికారుని ఆవేదన ఎండ్లూరి 'సెప్పులుమాకులదేవతలు.'

ఆటపాటలతో అలరించే జానపద వృత్తికారులకు పట్టెడన్నం దొరకడం కనాకష్టమైంది. ఇంక వీరితోపాటు ఉండే మూగజీవాలకు ఆకలి తీరే దారేది. గంగిరెద్దు లాటాడించి పొట్ట పోసుకునేవారి దీనగాథ జాతశ్రీ 'వ్యక్తిగతం.' కుల విద్య దొమ్మరాటాడితే చూసి, కాసు విదిలించే నాథుడు కరువై బువ్వదొరకని బతుకుల చిత్రం జాతశ్రీ 'విధ్వంసం.' అంతరించి పోతున్న ఎలుగ్గొడ్డాట, మల్లేశు కుక్కలాట చిత్రణ వి. రాసాని నాల్గోన్నాటకం.

రచయితలు సామాజిక స్పృహతో, నిబద్ధతతో కుల వృత్తులపై ప్రపంచీకరణ ప్రభావాన్ని అక్షరీకరించారు. వారి బతుకువేదన, వృత్తిపై మమకారం, కులపనివదలి ఇకయేపని చేపట్టాలన్నా వృత్తికారుని గుండె బరువు పాఠకుని కంటతడి పెట్టిస్తాయి. రచయితలు కులవృత్తుల దైన్యస్థితిని చిత్రిస్తూనే, వృత్తి సంబంధి, ఉత్పత్తి సంబంధి పదజాలాన్ని నిక్షిప్తం చేశారు.

డా. మూలె విజయలక్ష్మి ఫోన్ : 9966138779

వృత్తికళాకారుని పనితనాన్ని, ఒడుపును చూపించారు. పల్లెసీమల్లో వృత్తుల మధ్య అవినాభావ సంబంధాన్ని ఆత్మీయతలను ప్రదర్శించారు. పదజాల పరంగా ఒక కథను పరికిద్దాం. 'కాగుబొత్త' కథలో వృత్తి సంబంధి, ఉత్పత్తి సంబంధి పదజాలం.

**వృత్తి సంబంధి పదజాలం:** గుబ్బిగడ్డ, మట్టిగుంత, వాయిలి పొరుక, ఉనుక, సారెబలిచ్చు, సారెముల్లు, బొద్ది, సారెచక్రం, కందెన, గుండురాయి, సారెకోల, మోటుసల్ప, గొర్రెబూరు, సారె, సారెగీర, వాము.

**ఉత్పత్తి సంబంధి పదజాలం:** కూరాడుకుండలు, ఐరేండ్లు, బల్దకడువలు, ఎసులలు, కంచుట్లు, గూనలు, మంగులాలు, కాగులు, కలికుండలు, ఒత్తు కుండలు, గోలాలు, పేర్పులు, గొబ్బలు, లొట్లు, గురుగులు, గల్లగురిగి.

జానపదుని వర్ణనలు, పోలికలు తమ జీవితం లోనివే. భాష, సంస్కృతి తమ పల్లెలోనివే. తన ఇక్కన పక్కన ఉన్నవే. పరాయి కరణచెందదు. దేశీయతను నింపుకొని ఉంటుంది.

ఇవేకాకుండా కథా రచనకు మాండలిక శైలిని ప్రయోగించడం వల్ల మాండలికాలు మస్తుగా దట్టించారు. పునుకుడు చేతులు, మసులపడు, ఇగురం, ఓదిచ్చు, రంజన్లు. ఇదిత్తు ఈదునం, కొంకులు, మేనతు, మాలు తెచ్చు, సూర్లచెక్కు. ఇలా సాహిత్యాన్ని పరికించి, అన్వేషిస్తే మట్టిలో మాణిక్యాలు వెలుగులు విరజిమ్ముతాయి. దేశ్యపదజాల వాడుకలో, భద్రపరచడంలో ఆలోచితంగానైనా, అనాలోచితంగానైనా రచయితలు తమవంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నారు.

మానవమనుగడకు, అభివృద్ధికి పోరాటం, సామాజిక అవసరాలు నాడైనా, నేడైనా ఉన్నవే. నేడు ఉత్పత్తి పరిజ్ఞానం, సాంకేతికత అభివృద్ధి చెందింది. వృత్తి పదజాలాన్ని ఆధునిక పరికరాలకు, వాటి విభాగాలకు వినియోగించి పదాలకు నూతన తేజాన్ని కల్పించవచ్చు. అందుకు తగిన కృషి సల్పాలి.

వృత్తి పదజాల సేకరణలో నిఘంటుకారులు ప్రశంసనీయమైన కృషి చేశారు. ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి భారతీయభాషల్లో మొదటిగా తెలుగులో వృత్తి సంబంధ మాండలిక పదకోశ నిర్మాణానికి పటిష్టమైన ప్రణాళిక రూపొందించారు.

వ్యవసాయం - భద్రిరాజు కృష్ణమూర్తి (1962), వాస్తు - బూదరాజు రాధాకృష్ణ (1968), చేనేత - భద్రిరాజు కృష్ణమూర్తి (1971), కుమ్మరం - జి.ఎన్.రెడ్డి (1936), లోహకారం - జి. నాగయ్య (1991), బెస్త పరిశ్రమ పడవల నిర్మాణం - దోణప్ప (1992), మేదర - పోరంకి దక్షిణా మూర్తి (1992), వడ్రంగం-జి.ఎన్.రెడ్డి (1997) సంపాదకీయంలో వృత్తి పదకోశాలు వెలువడినాయి.

ఆయావృత్తులకు సంబంధించిన పదాలు వాటి వివరణలు క్షేత్ర పర్యటన ద్వారా సేకరించి పొందుపరిచారు. కొన్ని కేంద్రాలను ఎన్నుకొని సేకరించటం వల్ల సమగ్రంగా చేరలేదు. చర్మకారవృత్తి, వేట, నాటువైద్యం వంటి కొన్ని వృత్తులకు పదకోశాల నిర్మాణం ఇంకా చేపట్టలేదు. మునుపటి కాలంలో ఏదో ఒక కులవృత్తి నాశ్రయించి కడుపు నింపుకున్నవాడే. విద్య, సాంకేతిక విజ్ఞానాభివృద్ధి, సామాజికంగా వచ్చిన మార్పులవల్ల ఈ పద్ధతి సడలింది.

ఇప్పటి వరకు వెలువడిన నిఘంటువుల్లో వేలాది దేశ్య పదాలుచేరాయి. దేశీయమైన వృత్తులు కాబట్టి అన్యదేశ్య ప్రభావం అంతో ఇంతో ఉన్నా దేశ్య పదజాలం అధికం. కులవృత్తులు కూలబడిపోతున్న తరుణంలో పదజాలం వాడుక కాలం మాటుకు చేరుతుంది. నిఘంటువులో చేరినంత మాత్రాన భాషకు జీవత్వం ఉండదు. ఆ మాటకొస్తే సంస్కృతానికి అనేక నిఘంటువు లున్నాయి. కానీ వ్యవహార దూరం కావటం వల్ల మృతభాషగా పరిగణింపబడుతోంది. ఏ భాషలో పదజాలమైనా జీవంతో తొణికిసలాడాలి. పూటపూట మనిషినోట పల్లవించాలి. ప్రతిధ్వనించాలి.

మానవమనుగడకు, అభివృద్ధికి పోరాటం, సామాజిక అవసరాలు నాడైనా, నేడైనా ఉన్నవే. నేడు ఉత్పత్తి పరిజ్ఞానం, సాంకేతికత అభివృద్ధి చెందింది. వృత్తి పదజాలాన్ని ఆధునిక పరికరాలకు, వాటి విభాగాలకు వినియోగించి పదాలకు నూతన తేజాన్ని కల్పించవచ్చు. అందుకు తగిన కృషి సల్పాలి.

**పదజాల సేకరణ - నిఘంటువుల నిర్మాణం :** తెలుగు పలుకు పల్లియుల లోగిట్లో, పల్లియుల నోట్లో కమ్మగా, తీయగా పలుకబడుతోంది. నాగరికులు, విద్యావంతుల భాష సంకరమైంది. తెలుగు ప్రాచీనకాలం నుంచి వివిధ కారణాల వల్ల అన్యభాషా ప్రభావానికి లోనైంది. ప్రాఙ్నన్నయ యుగ

శాసనాల్లో తొలిదశలో కన్పించని సంస్కృత పదజాలం రానురాను అధికమయ్యింది. నన్నయ నుంచి నేటివరకు అవిచ్ఛిన్నంగా తెలుగు భాషపై సంస్కృతంపై చేయి చేసుకొంటూనే ఉంది. మధ్యయుగాల్లో ముస్లిం పాలనవల్ల పారశీ, అరబిక్, హిందుస్థానీ, భౌగోళిక సాన్నిహిత్యంవల్ల తమిళం, కన్నడ, ఒరియా, మరాఠీ పదాలు చేరాయి. ఆధునిక యుగంలో ఆంగ్లపదాలు కోకొల్లలుగా చేరాయి. ఇంకా పుంఖాను పుంఖాలుగా చేరుతూనే ఉన్నాయి.

అధిక ప్రచారంలో ఉన్న తెలుగు నిఘంటువులను అవలోకిస్తే తెలుగుపై సంస్కృత ప్రభావమెంతో తేట తెల్లమవుతుంది. కావ్యభాష ఆధారంగా నిర్మించిన శబ్దరత్నాకరం, సూర్యరాయాంధ్ర నిఘంటువుల్లో పెద్ద పీట తత్సమ పదాలదే. సూర్యరాయాంధ్ర నిఘంటువులో మొత్తం ఆరోపాలు 79, 575. అందులో తత్సమ పదాలు 46,361, సంస్కృత క్రియలు 1,336, మిశ్రమ పదాలు 415, హిందుస్థానీ పదాలు 377, అంటే దేశ్యపదాలు 20,976 మాత్రమే (సూర్యరాయాంధ్ర నిఘంటువు - విమర్శ మూలె విజయలక్ష్మి 1988 అముద్రిత వ్యాసం) శబ్దరత్నాకరంలో వివిధ సంకేతాలతో సూచించిన ఆరోపాలు మొత్తం 35,273. అందులో 15,824 సంస్కృత సమాలు, 3,436 వైకృతాలు, 11,437 దేశ్యాలు, 880 హిందుస్థానీ పదాలు తక్కినవి ఇతర సంకేతాల్లో సూచించబడినాయి (శబ్దరత్నాకరం - నిఘంటువు నిర్మాణరీతి డా. కె. శారద' వ్యాస విన్యాసం 2007).

తెలుగు పదజాలాన్ని ఆంధ్రదేశం నలుమూలల నుండేకాక రాష్ట్రేతర, దేశేతర ప్రాంతాల్లో నివసించే తెలుగు ప్రజలనుండి, సాహిత్య భాష నుండి సేకరించాలి. దేశ్య పదాలను జల్లెడపట్టి అర్థాలను, అర్థఛాయలను నిర్ణయించి కోశస్థం చేయాలి.

**పరభాషా పదాల చేరిక - నిరోధం:** పరభాషా పదాల చేరికను నిరోధించాలి. పరభాషా పదాల వాడుకపట్ల వ్యామోహాన్ని వదలి, దేశ్యపదాలను మక్కువతో, చిత్తశుద్ధితో వినియోగిస్తే తెలుగు భాష కలకాలం కళకళలాడుతుంది. 12, 13 శతాబ్దాల్లో జానుతెనుగు ఉద్యమం, ప్రబంధ యుగానంతరం 500 ఏళ్లు సాగిన అచ్చ తెనుగు ఉద్యమం, ఆధునిక కాలంలో వ్యవహారిక భాషోద్యమం సంస్కృత పదాల చేరిక, వాడుకను నిరసించినవే. అయినా నేటికీ ఆధునిక సాంకేతిక అనువాదంలో, నూతన పదకల్పనలో తత్సమ పదాల వైపే మొగ్గు చూపడం దేశ్య పదాలపట్ల చిన్న చూపుకు నిదర్శనం. ఇప్పటి మాతృభాషా ఉద్యమం ఆంగ్ల పదాల చేరిక, వాడుకను, ఆంగ్ల భాషా వ్యామోహంపై నిరసనను అధికంగా ప్రదర్శిస్తున్నారే తప్ప, తత్సమ పదాల చేరికను అంతగా పట్టించు కోవడంలేదు. ఆ మాటకొస్తే దేశ్య, అన్యభాషా పదజాలం పట్ల అవగాహన ఎంతమందికుంది? తమిళ భాష ప్రతిపత్తి నిలుపుకోవడానికి ప్రధాన కారణం పదే పదే పడుతున్న పరభాషల ప్రభావాన్ని గట్టిగా నిరోధించటమే.

**కొత్తమాటల పొందిక-దేశ్య పదాలకు పెద్దపీట:** ఏ భాషా సమాజంలో అయినా ఆధునిక సాంకేతిక శాస్త్రరంగాలకు సంబంధించి, కొత్తవస్తు సంస్కృతికి సంబంధించి పదజాలముండదు. ఆయా సమాజాలు ఆధునిక అవసరాలకు తగినట్టు కొత్త మాటలు రూపొందించుకోవడం లేదా ఆదానం చేసుకొంటాయి.

కొత్తమాటలను పొందించుకోవటంలో దేశ్యపదాలకు ప్రాధాన్యమివ్వాలి. ఆ మాటలను జనులకందించాలి. అవి జనులనోటననగలగాలి. ఈ విషయంలో తమిళ ప్రభుత్వం సంస్థలు ఎంతో గట్టి కృషి సల్పుతున్నాయి. నూతన విజ్ఞానం, సంస్కృతి అందుబాటులోకి వస్తూనే తమిళ పదాలతో అనువదించి వాడుకలోకి తెస్తున్నారు. ప్రసార సాధనాలు, ప్రజలు కొత్తమాటల వాడుకకు చిత్త శుద్ధితో సహకరిస్తున్నారు. కొన్ని ఉదాహరణలు చూద్దాం.

| **ఆంగ్లం** | **తమిళం** |
|---|---|
| సాఫ్ట్‌వేర్ | మెన్‌పొరుళ్ |
| హార్డ్‌వేర్ | వన్‌పొరళ్ |
| మదర్‌బోర్డ్ | తాయ్‌పలక్కై |
| ఇంటర్ నెట్ | ఇనైయదళం |

మరి తెలుగులో ఆదానం తప్ప కొత్త మాటల పొందికకు కృషి ఎంత?

**అర్థ విస్తృతిలో వాడుక :** పాతపదాలకు, వాడుకలో ఉన్న దేశ్య పదాలకు నూతనార్థాలను కల్పించాలి. పారిభాషిక పదకల్పనకు జనులనోట నలిగిన పదాలను వాడడం సౌలభ్యంగా ఉంటుంది. ఉదాహరణకు గుడ్డలు కుట్టడానికి ఉపయోగించే సూది, వైద్యరంగంలో ఇంజక్షన్‌కు, ముల్లు గడియారం ముల్లుకు పర్యాయాలయ్యాయి. ఆంగ్లంలో రోగ నివారిణికి, మందు శరీరంలో చొప్పించటానికి వాడే

సాధనానికి ఒకే పదం వాడుతుంటే తెలుగులో సూదిమందు, సూది అని కల్పింపబడ్డాయి.

జానపదులు పరిమితమైన మౌలిక పదాలతో అపరిమితమై పదజాల కల్పన ఎలా చేస్తున్నారో గమనించి, వారి పదకల్పనా చాతుర్యాన్ని ఆదర్శంగా గ్రహించాలి. ఉదా. 'దొంగ' పదానికి ఎన్ని అర్థచ్ఛాయలు కల్పించారో చూడండి.

దొంగ మాటలు, దొంగ చేష్టలు, దొంగ పనులు, దొంగ చూపులు, దొంగ వ్యాపారం, దొంగసారా, దొంగ పూత, దొంగ యేడుపు, దొంగ మేత, దొంగెత్తు, దొంగ నిద్ర, దొంగ బీగం, దొంగ పోటు, దొంగాట, దొంగచాట, దొంగచాటు, దొంగ రోగం, దొంగ కుండలు, దొంగ నాటకం, దొంగ వేషం, దొంగ పెళ్ళి మొదలైనవి.

ఇలాంటి పదకల్పనా చాతుర్యం ఏవృత్తి పదకోశాన్ని చూసినా దర్శించవచ్చు. పరిమితమైన పదాలతోనే అనంత పదజాలాన్ని కల్పించుకోవడం జానపదుని నైజం. దేశ్య భాష సామాన్యుల నోళ్లలో ఎలా అనలు కొనలు సాగుతుందో అర్థం చేసుకోవాలంటే వృత్తి పదజాలాన్ని, మాండలికాలను నిశితంగా అధ్యయనం చేయాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో సంస్కృతి, జీవన విధానం నానాటికి కొత్తపుంతలు తొక్కుతోంది. పారిశ్రామికాభివృద్ధిలో దేశీయ వృత్తుల స్వరూపం మారి పోతోంది. కాబట్టి పై అంశాలను దృష్టిలో పెట్టుకొని తెలుగు పదజాలాన్ని ఆధునిక అవసరాలకు వినియోగించాలి. అంతేకాకుండా వివిధ రంగాలలో తెలుగు పటిష్టంగా అమలు చేసినపుడే తెలుగు పలుకు తీపి, తెలుగు వాడి, తెలుగు సత్తా తేజరిల్లుతుంది.

ఆచంద్రతారార్కం తెలుగు పలుకు జనులనోట జవ సత్వాలతో నవనవలాడాలి. తల్లిభాష ఆధునిక సామాజిక అవసరాలను తీర్చేటంతగా అనలు కొనలు సాగాలి. అందరికీ ఆదర్శంగా నిలవాలి అంటే భాష బంగారు భవిష్యత్తుకు అమ్మలు, అయ్యలు, అధికారులు, అధినేతలు నడుంబిగించాలి. క్రియాత్మకమైన చర్యలు చేపట్టాలి. మి

---





మిసిమి
మాసపత్రిక

చందాదారులుగా చేర్పించండి
# బహుమతి
పొందండి!

**మీ** ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా. మీకు ప్రియమైన వారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యం కదా. వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. మీరు కోరిన గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం **మిసిమి**కి చందా **₹200** పంపండి (వారి పూర్తి చిరునామాతో). ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపికచేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే – మంచి సారస్వతంతో...

**ఈ క్రింది పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి**

| | | ₹ |
|---|---|---|
| 1. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 2. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 3. | VEMANA - Through Western Eyes - *V.R. Narla* | 50.00 |
| 4. | THE FIRST POETICAL READER (Walter Joyes and N.C. Sashacharloo) | 50.00 |
| 5. | వేమన ఉపదేశామృతం – *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |
| 6. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 7. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 8. | అమాహ (కథలు) వి. అశ్వినీకుమార్ | 60.00 |
| 9. | అంతర్వీక్షణం (వ్యాసాలు) " " | 60.00 |
| 10. | నాలో నేను (కవితలు) " " | 60.00 |

**మీ చందా మిసిమి పేర ఈ క్రింది చిరునామాకు పంపండి**

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com



# స్వాప్నిక చేతన

ఒంటరిగా ఆరుబయట పడుకుని వున్నాను
నాపైన వాయువు ప్రవహిస్తున్నది
చీకటి ప్రవహిస్తున్నది
గగనం దిగొచ్చి నాపై నుంచి
నీలాల నురగలతో ప్రవహిస్తున్నది
ఇదంతా లోలోనే గమనిస్తున్న
నా చూపులు
మూసుకున్న కళ్ళను తట్టి
తామే వెలుతురు రవ్వలై బయటపడి
నా అవయవాల పైనుంచి ప్రవహిస్తున్నాయి.
ఆ ప్రవాహగుణం
చేతుల్లోకి, పాదాల్లోకి ప్రవేశించగానే
నా మేను నిటారుగా నిలబడి
ప్రవాహ రూపకానికి నాంది పలికింది
నేనే ఒక సజీవ ప్రవాహాన్నైపోయాను.
ఎదురైన చెట్లను కౌగిలించుకుంటూ
ఎక్కడో ఎన్నెన్ని ఎత్తుల పైన నిలుచున్న
పర్వతాలను
కొస వేళ్ళతో నిమురుకుంటూ
అక్కడక్కడ నా ఎదుట అగుపడే
నదుల జలాలను
ముఖంపైన చల్లుకుంటూ
సాగిపోయింది నా శరీర ప్రవాహం.
నాలో ప్రగాఢ చైతన్యాన్ని నింపింది
ఈ ప్రవాహమే.
ఇది నా జీవితాంతం ఇలాగే వుంటే
ఎంత బాగుంటుందో,
అలా అనుకుంటూ ఒళ్ళు విరుచుకుని
లేచి చూశాను
ఏవీ ఆ ప్రవాహాలన్నీ
నేనొక్కణ్ణే ఉన్నానేమిటి?
అప్పుడు తెలిసింది
నేనింత వరకున్నది కలలో అని;
ప్రవాహ రూపంలో నన్ను ఆవేశించింది
ఆ స్వాప్నిక చేతన అని.



(సి. నారాయణ రెడ్డి)

# ఛాయాచిత్ర నవాబు
# రాజన్ బాబు



నిలువెత్తు ప్రతిభ

తెల్లని కొంగలు, నల్లని మబ్బులు, క్షణానికో రూపుదాల్చు కొనే శ్వేతమేఘాలు, పంటలు, పొలాలు, చెట్లు, చేమలు, పెరట్లో గంతులువేసే తువ్వాయిలు, వారసత్వంగావచ్చిన మగ్గం నేతలో మర్మంగా రూపుదిద్దుకుంటూ, చీర అంచులపై అందాలు చిందించే రంగులు - అన్నిటినీ ప్రేమించాడు. వాన కురిస్తే, పువ్వు విరిస్తే తానొక్కడి గురించే కాదు, మనందరి గురించీ అని భావించాడు బాల రాజన్. ఈ అనంత సౌందర్యాలను తన పిడికిలిలో బిగించి, ఒక మాధ్యమంలో బంధించి మనకందరికీ చూపాలనుకున్నాడు. ఆ చిన్ననాటికల ఆయన జీవన ధ్యేయాన్ని ఫోటోగ్రఫీ వైపు మరలించింది.

కరీంనగర్ జిల్లా కోరుట్ల గ్రామంలో ఫిబ్రవరి 9, 1939వ సంవత్సరంలో బండి రాజన్ బాబు జన్మించారు. ప్రాథమిక విద్య తరువాత, హైస్కూలు చదువు ముగిసిన వెంటనే ఫైన్ ఆర్ట్ కాలేజ్ (హైదరాబాద్)లో విద్యార్థిగా అడుగుపెట్టాడు. మొదటి రెండు నెలల కాలం గడవక ముందే ప్రతిభ రీత్యా రెండవ సంవత్సరానికి ప్రమోట్ చేయబడ్డాడు. ఈ విధంగా ఐదు సంవత్సరాల కోర్సును, నాలుగు సంవత్సరాలలోనే ముగించి మొదటివాడుగా ఉత్తీర్ణుడైనాడు. లలిత కళాశాలలో చిత్రకళ, శిల్పాలతోపాటు ఫోటోగ్రఫీని ఆప్షనల్ సబ్జెక్టుగా తీసుకున్నాడు. చదువు ముగిసిన వెంటనే కొంతకాలం ఇక్రిసాట్‌లో ఫోటోగ్రాఫర్‌గా పనిచేసి ఆ తరువాత తాను చదివిన కాలేజీలోనే ఆధ్యాపక వృత్తిని చేపట్టారు. 1978వ సంవత్సరంలో బయటకు వచ్చి రాజన్ స్కూలు ఆఫ్ ఫోటోగ్రఫీని స్థాపించారు. ఎందరో విద్యార్థులకు ఫోటోగ్రఫీ చదువు చెప్పారు.

అకడమిక్‌గా ఫోటోగ్రఫీని ఒక శాస్త్రంలా అభ్యసించినా ట్రయల్ అండ్ ఎర్రర్ ద్వారా స్వానుభవాన్ని సంపాదించినా ఇంకా మిగిలినది చాలా ఉన్నదని పించింది. ఇంతలో రాజా త్రియంబక్ రాజ్‌తో పరిచయం ఏర్పడింది. అందరిచేత ప్రేమాభి మానాలతో రాజాసాబ్‌గా పిలువబడే ఆయన ఈ చిన్న రాజన్‌లోని ఉత్సుకతను చూసి శిష్యునిగా తీసుకున్నాడు. ఒక వ్యక్తిగా కాక ఒక వ్యవస్థగా నిలబడ్డ ఆయన నీడలో రాజన్ ఎన్నో సూక్ష్మమైన కళాత్మక విషయాలను గ్రహించారు. ఆ రోజునుంచీ ద్రోణుని వద్ద అర్జునునిలా రాజన్‌బాబు ఛాయాచిత్ర ప్రస్థానం అప్రతిహతంగా సాగిపోయింది.



చివరి చుక్క

శ్రీ భగవాన్‌దాస్ స్థాపించిన ఫోటోగ్రఫీ క్లబ్ పోటీలలో క్రమం తప్పకుండా బహుమతులు గెలుచు కుంటూ వచ్చిన స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి వరకు ఆయన కళా ప్రపంచం విస్తరించింది. 1983వ సంవత్సరంలో అత్యున్నతమైన ఎ.ఆర్.పి.ఎస్. గౌరవాన్ని పొందగలిగారు (అసోసియేట్ ఆఫ్ ది రాయల్ కాలేజ్ ఆఫ్ ఫోటోగ్రఫీ, లండన్). లండన్‌లోని రాయల్ కాలేజీ ఆఫ్ ఫోటోగ్రఫీ ఎన్నో శాస్త్రీయమైన, కళాత్మకమైన నిబంధనల ననుసరించి ప్రపంచ వ్యాప్తంగా కొందరు ఫోటోగ్రాఫర్‌లకు ఇచ్చే గుర్తింపు అది. రాజన్‌బాబు అంతటితో తృప్తిపడలేదు. మరింత ప్రతిష్ఠాత్మకమైన ఎఫ్.ఆర్.పి.ఎస్. గౌరవాన్ని మరోనాలుగు సంవత్సరాల వ్యవధిలో సాధించారు (ఫెల్లో ఆఫ్ ది రాయల్ కాలేజ్ ఆఫ్ ఫోటోగ్రఫీ, లండన్). ఈ గౌరవాన్ని సాధించుకున్న ఏకైక ఫోటోగ్రాఫర్ ఆంధ్రప్రదేశ్‌లో ఆయన ఒక్కరే. తరువాత 26 సంవత్సరాలు గడిచినా మరెవ్వరూ ఆ గౌరవాన్ని దక్కించుకోలేక పోయారు.

రాజన్‌బాబు తన చిత్రాలలోని ఎక్కువ భాగాన్ని విశాఖపట్నం వద్ద నున్న అరకులోయలోని గిరిజనుల జీవన విధానంపై తీసినవే. వీటిలో కొన్నింటిని "అడవిపూలు" పేరుతో పుస్తక రూపంలో ప్రచురించారు. ఎఫ్.ఆర్.పి.ఎస్. గౌరవ పురస్కారానికి ఆయన తీసుకున్న విషయం (సబ్జెక్టు) 'ప్రకృతి-నగ్నస్త్రీ'. ఇది ఎంతో కష్ట సాధ్యమైనదే కాక, కత్తిమీద సాములాంటి ఈ ప్రక్రియలో ప్రజలచేత జేజేలు పలికింపచేసారు. ప్రపంచ వ్యాప్తంగా 1970లో బెల్జియం దేశంలో, 1987లో


స్నేహం

జెకోస్లావాకియాలో, 1996లో టొరంటోలో, 1998లో అమెరికాలో, 2008లో చైనాలో ఆయన చిత్రాలు ప్రదర్శించబడ్డాయి. ఒక్క విషయాన్ని మనం ముఖ్యంగా గుర్తుంచుకోవాలి. ఆయన కేవలం ఫోటోగ్రాఫర్ కాదు, ఫోటో పెయింటర్. ఆయనది – చిత్రగ్రఫీ!

ఒక ఆచార్యునిగా తనకు తెలిసినదంతా విద్యార్థులకు నేర్పి, వారిలో నూతనోత్సహాన్ని నింపి, ఎందరినో బహుమతులకు అర్హులుగా తీర్చిదిద్దిన మార్గనిర్దేశకుడాయన. గత 25 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ ఫోటోగ్రఫీకు ఆయన వెన్నెముకగా నిలిచారు. అనేక జాతీయ, అంతర్జాతీయ పోటీలకు న్యాయమూర్తిగా వ్యవహరించారు. ఇదంతా ఏదో ఆషామాషీగా సాధించినది కాదు. దీని వెనుక పట్టుదల ఉంది. దానికి రెట్టింపు శ్రమ ఉంది. తపస్సు లోని ఏకాగ్రత ఉంది. నిత్య విద్యార్థి లాంటి అన్వేషణ వుంది. వీటన్నిటినీ మించి ఫోటోగ్రఫీపై అపరిమితమైన ప్రేమ ఉంది. రాజన్‌బాబు పుడుతూనే కెమెరాలను చంకనేసుకొని పుట్టలేదు. కానీ కెమెరా భుజాన్ని తగిలించుకోని రాజన్‌బాబు రూపాన్ని మనం ఊహించలేము. ఇది ఇప్పుడు ఆయన శరీరంతో విడదీయరాని అంతర్భాగం. కెమెరా లెన్సును మూడవ కన్నుగా మార్చుకున్న పరమేష్టి రాజన్‌బాబు.

ఫోటోగ్రఫీ అంటే కాంతిసాయంతో కళాత్మకంగా చిత్రాలను రూపుదిద్దటమని రసజ్ఞులు నిర్వచించారు. ఇది కళాత్మక ఛాయచిత్రాలకు వర్తిస్తుంది. ఛాయచిత్రాలను ఒక ప్రత్యేక కళగా, చిత్రకళతో సమానమైనదిగా వందసంవత్సరాల క్రితమే గుర్తించారు. వైజ్ఞానిక, కళాత్మక విషయాలలో అంతర్జాతీయ ఖ్యాతిగాంచినది లండన్‌లోని రాయల్ కాలేజి. ఇది 1853లో ప్రారంభింపబడి, ఇప్పటి వరకూ ప్రతిష్ఠాత్మకమైన ప్రమాణాలకు మారుపేరుగా నిలబడుతుంది. ప్రస్తుతం బ్రిటన్ రాణి రెండవ ఎలిజబత్ దీనికి చీఫ్ పాట్రన్. భౌతిక, రసాయనికశాస్త్ర విజ్ఞానంతో ఛాయాగ్రాహకుడు తన సౌందర్య దృష్టితో రూపుదిద్దిన అత్యున్నత ఛాయాచిత్రాలకు వీరు గౌరవ ప్రదమైన గుర్తింపు నిస్తారు. ఇది మూడు రకాలుగా ఉంటుంది.

మొదటిది ఎల్.ఆర్.పి.ఎస్. (లైసెంసియేట్ ఇన్ రాయల్ ఫోటోగ్రాఫిక్ సొసైటి ఆఫ్ లండన్.) ఇది మన కాలేజీలో డిగ్రీ చదువుతో సమానమనుకోవచ్చు. ఈ గౌరవం పొందాలంటే 10 ఫోటోగ్రాఫ్‌లను పంపవలసి ఉంటుంది. వాటిలో నున్న ఎక్స్‌పోసర్, ఫ్రేమింగ్, ప్రింటింగ్, ప్రజంటేషన్ అనే నాలుగు అంశాలలో సభ్యునికున్న నైపుణ్యాన్ని పరిశీలించి ఈ గౌరవాన్ని ప్రధానం చేస్తారు.

రెండవది ఎ.ఆర్.పి.ఎస్. ; అసోసియేట్ ఆఫ్ ది రాయల్ ఫోటోగ్రాఫ్‌కి సొసైటీ అని దీని వివరణ. దీనికిగాను 15 ఛాయాచిత్రాలను పంపవలసి ఉంటుంది. అందులో పైన పేర్కొన్న నాలుగు అంశాలతోబాటు కళాత్మక, కాంతి విన్యాసాలలో ఛాయాగ్రాహకుని నైపుణ్యాన్ని గమనించి అందులో అతనికి గణనీయమైన ప్రతిభ ఉన్నదని నిర్ధారించుకున్న తరువాతనే ఈ గౌరవాన్ని ఇస్తారు. ఇది రెండవమెట్టు. ఇంచుమించుగా అకడమిక్ ఎమ్.ఏ. లాంటిది.

ఇక మూడవది ఎఫ్.ఆర్.పి.ఎస్. ఫెలో ఆఫ్ ది రాయల్ కాలేజ్ ఆఫ్ ఫోటోగ్రఫీ. ఇది పిహెచ్.డి లాంటి డాక్టరేట్‌తో సమానమైనది. ఇంచుమించుగా ఇది అత్యంత నైపుణ్యానికిచ్చే చరమస్థాయి. ఇందుకుగాను 20 ఛాయాచిత్రాలను పంపవలసి ఉంటుంది. వాటిలో పైన పేర్కొన్న విషయాలతో బాటు, ఏదో ఒక అంశంపై ప్రకృతిలోనున్న సహజమైనకాంతిలో గాని లేదా స్టూడియో వెలుగులలోగానీ, ఈ రెంటిలో ఏదో ఒక దానిని మాత్రమే ఎంపిక చేసుకొని తీసిన 20 ఛాయా చిత్రాలను పరిశీలిస్తారు. ఈ పరిశీలనలో పంపిన అన్నిచిత్రాల లోనూ ఒక ఏకీకృతభావం ఉండాలి. ఈ ఇరవైచిత్రాలలోనూ ఛాయాగ్రాహకుని ప్రత్యేకమైన తనదైనశైలి స్పష్టంగా కనిపించాలి. అది అకడమిక్ తారాస్థాయిలాంటి గౌరవం. రాజన్‌బాబు ఎఫ్.ఆర్.పి.ఎస్.యే కాక ఫ్రాన్స్ దేశపు గౌరవ బిరుదైన ఏ.ఎఫ్.ఐ.ఎ.పి.ని కూడా పొందారు. దానిని పొందిన మరో ఇద్దరిలో ఒకరు ఒకప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యకార్యదర్శి ఎన్. భగవాన్ దాస్. ఐ.ఎ.ఎస్., తరువాత హసన్, రాజన్‌బాబు మూడవ వారు.

***- కాండ్రేగుల నాగేశ్వర రావు***

**ముఖచిత్రం :** జాన్ విలియమ్ వాటర్‌హౌస్ (1849–1917) ప్రీ రాఫిలైట్ చిత్రకారుడు – వాటర్‌హౌస్ చిత్రాలు చాలా రమణీయంగా, ప్రణయాత్మకంగా ఉంటాయి. ముఖచిత్రంగా ముద్రించిన ముద్దరాలు 'లేడీ షలాట్'ని లార్డ్ టెనీసన్ (1809–1892) పద్యం స్ఫూర్తితో వాటర్‌హౌస్ చిత్రించాడు.

*But Lancelot mused a little space*
*He said, "She has a lovely face;*
*God in his mercy lend her grace,*
*The Lady of Shalott"*



# ఒక రాత్రి

ఓ చీమ చీకటిని మోసుకొస్తుంది
పురుగు లైటును ఆర్పేస్తుంది
దోమ నిద్రను కాటేస్తుంది.
నిశ్శబ్దం
నన్నో ప్రతిమగా చెక్కుతుంది.
కిటికీలోంచి
గాలి కవిత్వమై వీస్తుంది.

బయట సముద్ర కల్లోలాల్ని
గోడలు ఆపలేవు.
లైట్‌హౌజ్ ఒంటరితనాన్ని రచిస్తుంది.
షర్ట్‌కు చిక్కుకున్న గడ్డిపోచ
కరువు వ్యథల్ని పాడుతుంది.
ఒకానొక వొగరు వాసన
తలపులను జడిపిస్తుంది.
ఆకులు అస్తిత్వం కోసం
చెట్లనుంచి దూకేస్తాయి.
మృత్యువు వాహనాల రూపంలో
హైవేల మీద పరుగెత్తుతుంది.
ఆకాశం నినాదాలను
మళ్లీ మళ్లీ పుక్కిలిస్తుంది.
ఎన్ని చూసిందో భూమి
ఏమీ ఎరుగనట్టు
చాపచుట్టను పరుచుకొని వొరుగుతుంది.

ఏదో ముల్లు
ఎప్పుడూ కెలుకుతుంటుంది
ఇంతకూ ఆ పిల్లవాడు
ఎందుకు ప్రాణం తీసుకున్నాడో తెలియదు
అతని కోసం జరుగుతున్న
ప్రయత్నాలు చూసైనా
అతడు మళ్లీ బతికితే బాగుండు.

**– డా. ఎన్. గోపి**

# ఆరోహణ



- ముక్తవరం పార్థసారథి

ఈ భూగోళం మీద మానవావిర్భావం నుండి, నిలబడి నడచిన అద్భుత క్షణం మొదలు – శాస్త్ర సాంకేతిక రంగాలలో ఆవిష్కరణల 'ఆరోహణ'ను సరళంగా, సోదాహరణంగా వివరిస్తాడు డా. బ్రోనొస్కి. ఈయన పోలాండ్‌లో జన్మించి ఇంగ్లండ్‌లో స్థిరపడి – గణితశాస్త్ర అధ్యాపకుడిగా, జీవశాస్త్రవేత్తగా, శాస్త్ర చరిత్ర కారునిగా, రంగస్థల రచయితగా, కవిగా – అనేకానేక రంగాలలో ప్రజ్ఞాశాలిగా గౌరవం పొందారు.

ఈ 'మానవారోహణ' రచనా పరంపర వెలువరించి నాలుగు దశాబ్దాలయినా ఇటువంటి మరో ప్రయత్నం జరుగ లేదు. అంటే 'ఆరోహణ'లో ఇది కూడా ఒక ఘట్టమే!

ఆంగ్ల సాహిత్యంలో అనేక శాఖలను ఆకళింపు చేసుకుని, తెలుగు పాఠకులకు గత మూడు దశాబ్దాలుగా ఆయా విశేషాలను పరిచయం చేసిన బహుగ్రంథకర్త, ముక్తవరం పార్థసారథి. డా. బ్రొనొస్కి వ్రాసిన 'ది ఎసెంట్ ఆఫ్ మాన్' గ్రంథాన్ని తెలుగులో సరళ – స్వేచ్ఛానుసరణను ఈ 'ఆరోహణ' క్రమంగా **మిసిమి** పాఠకులకు అందిస్తున్నారు.

మనిషి ఒక విలక్షణ జీవి. ఇతర జంతువులకు లేని శక్తియుక్తులతనికున్నాయి. ఈ లక్షణాలే అతడికో ప్రత్యేకత కల్పించాయి. వాటిలా అతడు పరిసరాలలో ఒదిగిన ఒక రూపం కాదు. అతడు పరిసరాలను ప్రభావితం చెయ్యగలడు, మార్చగలడు. శారీరకంగానూ, మానసికంగానూ అతడు ప్రకృతి పరిశోధకుడు. ఈ భూగోళం మీద సర్వాంతర్యామి. అనుకూలమైనా కాకపోయినా అన్నిఖండాలనూ నివాసయోగ్యం చేసుకున్నాడు.

ఒక కథ ప్రచారంలో వుంది. స్పానిష్‌వాళ్ళు, ఖుమార్గాన 1769లో పసిఫిక్ సముద్రతీరానికి వచ్చినప్పుడు, పున్నమి రోజున చేపలు అక్కడి బీచ్‌లమీద నాట్యం చేస్తాయని చెప్పారట కాలిఫోర్నియా ఇండియన్లు (స్థానిక ఆదివాసీలు). నిజమే! సముద్రంలో పోటు వచ్చినప్పుడు స్థానికంగా దొరికే ఒక రకం చేపలు (గ్రూనియన్) నీళ్లలోంచి బయటికివచ్చి యిసుకలో గుడ్లు పెడతాయి. ఆడ చేపలు, తోక యిసుకలో దూర్చి నిల్చుంటే, మగ చేప వాటి చుట్టూ తిరిగి నాట్యం చేస్తూ, అవి పెట్టిన గుడ్లను పొదుగుతాయి. ఆ ప్రక్రియకు పున్నమి రోజులు తప్పనిసరి. ఏ అడ్డంకి లేకుండా తొమ్మిది, పది రోజుల పాటు పొదిగితే, తిరిగి పోటు వచ్చేనాటికి పిల్లలు సముద్రంలోకి వెళ్ళిపోతాయి.

భూగోళం మీది అనేక ప్రదేశాలలో, యంత్రంలోని భాగాలు ఒకదానితో ఒకటి ఒదిగినట్టు, వివిధ జంతువులు పరిసరాలలో భాగంగా జీవిస్తాయి. ముడుచుకుని పడుకున్న ముళ్లపంది వసంతకాలం రాగానే లేచి పరిగెత్తుతుంది. రెక్కలార్చుకుంటూ వచ్చిన హమ్మింగ్‌బర్డ్ సూదిలాంటి తన ముక్కును విరబూసిన పుష్పాల్లోకి కసుక్కున గుచ్చుతుంది. ఆకుల రంగు రూపులను, కొన్నిసార్లు యితర ఎగిరే కీటకాలనూ అనుకరించిన సీతాకోక చిలుకలు తమ శత్రువుల నుండి ఆత్మరక్షణ చేసుకుంటాయి. ఒక హైస్పీడు వాహనంలాగ మట్టి పొరలలో చరచరా పరిగెత్తుతుంది కుమ్మరి పురుగు.

ముక్తవరం పార్థసారథి, ఫోన్ : 9177618708

అనేక మిలియన్ల సంవత్సరాల పరిణామ ఫలితంగా, గ్రూనియన్ చేప, సముద్రపు ఆటుపోట్లకు అనుకూలంగా గుడ్లు పెడుతున్నది. కాని ప్రకృతి, అంటే, జీవపరిణామం – మానవుణ్ణి ఏ ఒక్క ప్రత్యేక పరిసరాలకూ అనుకూలంగా తయారు చెయ్యలేదు. అంతేగాదు, గ్రూనియన్‌తో పోలిస్తే, అతనికున్న ఆత్మరక్షణ శక్తి చాలా తక్కువ. ఇదే తిరకాసుమరి. అన్ని పరిసరాలనూ తనకు అనుకూలంగా మార్చుకోగలడు. అనేక రకాల జంతువులు గెంతుతాయి, పరిగెడతాయి, ఎగురుతాయి, నేల కలుగుల్లో నివసిస్తాయి, నీళ్ళలో ఈదుతాయి. కాని మానవుడు మాత్రం ఏ ఒక పరిసర పరిస్థితికో పరిమితంకాలేదు. అతడి వూహాశక్తి, హేతుబద్ధమైన అతడి ఆలోచనలు, మానసికస్థైర్యం, కష్ట సహిష్ణుతవల్ల పరిసరాలను యథాతథంగా అంగీకరించక, వాటిని తనకనుకూలంగా మార్చుకుంటాడు. పరిసరాలను మార్చుకుంటూ వచ్చిన అతని ఆవిష్కరణల జాబితా పెద్దది. ప్రకృతి పరిణామక్రమంకన్న భిన్నమైనదిది. జీవశాస్త్ర పరంగానే కాక, సాంస్కృతిక విప్లవాలకు కూడా దారి తీసిందిది. ఈ ఆవిష్కరణ క్రమాన్ని నేను మానవారోహణ – 'The Ascent of Man' అంటాను.

> మనిషి ఆలోచనలు, ప్రత్యేకించి శాస్త్రపరమైన ఆలోచనాధోరణిని అనుసరిస్తూ సాగుతుందీ ప్రస్థానం. ప్రకృతి అతనికి ప్రసాదించిన ప్రత్యేకలక్షణాలనుపయోగించుకొని ఎంత ఎత్తుకెదిగాడు అన్నదే మన పరిశీలనాంశం!

'ఆరోహణ' అనే పదాన్ని నేను ఒక ప్రత్యేకార్థంలో వాడుతున్నాను. జంతువులకు లేని వూహాశక్తి మనిషికున్నది. ప్రణాళికలు రచిస్తాడు. కొత్త విషయాలు కనుక్కుంటాడు. వివిధ రంగాలలోని ప్రతిభలను మేళవించి, మరింత సంక్లిష్టమైన ఆవిష్కరణలను సాధ్యం చేస్తాడు. కాలక్రమంలో అతడు అత్యంత జటిలమైన సమస్యల్ని కూడా పరిష్కరించుకున్నాడు. వివిధ కాలాలలో, వివిధ దశలలో జరిగిన ఆవిష్కరణలు, సాంకేతికంగా, సాంస్కృతికంగా, కళల్లోనూ, శాస్త్ర పరంగానూ మానవుడు తన ప్రత్యేక లక్షణాలను (యితర జంతువులతో పోల్చినప్పుడు) పదును పెట్టుకుంటూ, అభివృద్ధిచెందిన క్రమానికి మెట్లు, మైలురాళ్ళు నిర్మించుకున్నాడు.

నిజమే. అత్యంత అద్భుతమైన ఆవిష్కరణలు యిటీవలే జరిగాయి కదా, అనుకుంటాం అందరం. ముఖ్యంగా నాలాంటి శాస్త్రజ్ఞునికి అలాగే కనిపిస్తుంది కూడాను. ఈ శాస్త్ర ప్రగతికి మనందరం తప్పక గర్వపడాలి. డి.ఎన్.ఎ. కోడ్ నిర్మించగలగడం ఒక్కసారి వూహించుకోండి. లేదా మనిషి మెదడుకున్న లక్షణాలను, జరుగుతున్న పరిశోధనలు లేదా సాపేక్ష సిద్ధాంతం వెనక దాగిన తాత్విక అంతర్దృష్టి, లేదా అణు స్వభావం గురించిన పరిశోధన – ఒక్కొక్కటీ ఒక్కో అద్భుతం కాదా!

ఇవన్నీ మనం సాధించిన విజయాలే కాని, యివన్నీ తరతరాలుగా విజ్ఞాన సోపానాల అధిరోహణ ఫలితమే. మునుపటి తరాల అనుభవాన్ని నిరాకరించటం హాస్యాస్పదం. మానవుడు సాధించినదేదీ – ముఖ్యంగా శాస్త్ర విజ్ఞానం – వస్తు ప్రదర్శనశాలలో పెట్టిన పరిపూర్ణ కళాఖండం కాదు. జ్ఞానమెప్పుడూ పరిణామక్రమంలో ఒక దశ మాత్రమే. ఈనాటి ప్రగతిలో, తొలినాళ్ల పరుస వేదుల కృషి కూడా దాగున్నది. మాయన్ (మెక్సికో) ఖగోళ శాస్త్రజ్ఞుల పరిణతి చెందిన గణితజ్ఞానం కూడా ఒక పునాదిరాయి. ఆండీస్ పర్వత శ్రేణిలోని మాచు, పీచు శిలా సంపద, మూరిష్ స్పెయిన్‌లోని అల్హంబ్రా జామెట్రీ – ఈనాడు, అయిదు శతాబ్దాల తర్వాత మనకు గొప్ప అలంకరణలుగా కనిపిస్తాయి. కాని, మనం, కళను మాత్రమే ఆస్వాదిస్తూ కూర్చుంటే, ఆనాటి సాంస్కృతిక మేధో మథనాన్ని అధ్యయనం చెయ్యలేం. ఆ నిర్మాణాలు చేపట్టిన కాలంలో, అవి నేటి డి.ఎన్.ఎ. కోడ్ పజిల్ కన్నా తక్కువ ముఖ్యమైనవేమీ కావు.

ప్రతి పరిణామదశలో టర్నింగ్ పాయింట్ ఒకటుంటుంది. అదే, ప్రపంచాన్ని కొత్తగా, సమగ్రంగా అర్థం చేసుకోవటానికి దోహదపడే దృష్టికోణం. కాలగమనానికి బ్రేక్ వేసిన ఈస్టర్ ద్వీపంలోని శిల్పాల్లో యూరోపులోని మధ్యయుగాలనాటి గడియారాల టిక్‌టిక్ చప్పుళ్ళలో అది నిక్షిప్తమైవుంది. మనిషిని లేదా ప్రకృతిని కొత్తగా అర్థం చేసుకునే ఒక దార్శనిక దృష్టివల్లే సాంస్కృతిక దశలు మలుపు తిరుగుతాయి. కాని, పునరాలోచిస్తే మనకేమనిపిస్తుందంటే, మలుపులు కూడా కాదు. నాగరికతనుండి నాగరికతకు ప్రయాణించేది ఒకే ఆలోచనా ప్రవాహం. రసాయన శాస్త్రంలో, భిన్న ధర్మాల మిశ్రధాతువులను మిళితం చెయ్యడమే ఒక

నిత్యనూతనమైన ప్రక్రియకదా. దక్షిణ అమెరికాలో, క్రీస్తు పుట్టిన కొద్దికాలానికే, ఆసియాలో అంతకుముందే ఈ రహస్యం తెలుసు. అణువిచ్ఛిత్తి, అణుసంయోగం రెండూ చరిత్ర పూర్వకాలంనాడే – కనీసం వూహామాత్రంగా ఆవిష్కరణల రూపంలో మనకు దర్శనమిస్తాయి. రాతినీ, యితర పదార్థాలనూ విభజించనూ వచ్చు. సంయోగించనూ వచ్చని ఆనాటి వాళ్లకు తెలుసు. జీవశాస్త్ర ఆవిష్కరణలు కూడా అలనాడే ప్రారంభమయ్యాయి. వ్యవసాయం, అడవి గోధుమలను ఆహారయోగ్యంగా పండించటం, మరీ ముఖ్యంగా, ఒక పట్టాన లొంగని గుర్రాలను మచ్చిక చేసుకుని, ప్రయాణాలకుపయోగించటం గొప్ప ఆవిష్కరణలే.

ఈ మలుపు తిప్పిన క్షణాలనూ, శాస్త్రజ్ఞానం నిరాఘాటంగా ప్రవహించిన పద్ధతినీ మీకు చూపే క్రమంలో ఓ పద్ధతిని పాటిస్తాను గాని, కాలక్రమంగా మన ప్రయాణం వుండకపోవచ్చు. మానవమేధస్సు వివిధరంగాలలో వికసించిన క్రమం నాకిష్టం. నేను చెప్పబోయేది ఆ చరిత్రే. మనిషి ఆలోచనలు, ప్రత్యేకించి శాస్త్రపరమైన ఆలోచనా ధోరణిని అనుసరిస్తూ సాగుతుందీ ప్రస్థానం. ప్రకృతి అతనికి ప్రసాదించిన ప్రత్యేక లక్షణాల నుపయోగించుకొని ఎంత ఎత్తుకెదిగాడు అన్నదే మన పరిశీలనాంశం!


డా. బ్రోనోస్కి

మీరు చదవబోతున్న ఈ వ్యాసాలు, మానవమేధో చరిత్రలో చేస్తున్న ప్రయాణం. ఆవిష్కరణ శిఖరాలను మనం స్పర్శిస్తాం. ప్రకృతి మనకు ప్రసాదించిన ప్రత్యేక లక్షణాలను పరిపూర్ణంగా సాకారం చేసుకోవటం అతడి లక్ష్యం. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎగురుతూ కనిపించే కీర్తి పతాకలవే. ప్రముఖ బ్రిటిష్ కవి డబ్ల్యు.బి. యేట్స్ మాటల్లో "మేధస్సును వృద్ధాప్యం దరిచేరదని నిరూపించిన "స్మారక హర్మ్యాలు."

ఎక్కడ ప్రారంభిద్దాం? సృష్టితో అంటే, ఈ భూగోళంమీద మానవుని ఆవిర్భావంతో. 1859లో అచ్చయిన 'ది ఆరిజిన్ ఆఫ్ స్పీసీస్‌తో,' 1871 నాటి "ది డిసెంట్ ఆఫ్ మాన్"తో చార్ల్స్ డార్విన్ మనకు మార్గదర్శకుడయ్యాడు. ఆఫ్రికాలోని భూమధ్య రేఖ మధ్య తొలిమనిషి తిరుగాడాడన్నది యిప్పుడు యించుమించు అందరూ అంగీకరిస్తున్న సత్యం. ఉత్తర కెన్యా, ఈశాన్య ఇథియోపియాలోను లేక్ రుడాల్ఫ్‌ల గడ్డిమైదానాలలో మానవ పరిణామక్రమం ప్రారంభమైంది. ఈ లేక్ రుడాల్ఫ్ గ్రేట్ రిఫ్ట్ లోయలో వుంటుంది. నాలుగు మిలియన్ సంవత్సరాల నాటి నీటి పరిమాణం కుంచించుకుపోయి ఏర్పడిన 'లేక్' అది. 'ఓమో'నదినుండి యిక్కడికి ప్రవహిస్తుంది నీరు. మనిషి తొలి ఆనవాళ్ళకు ఇదే అనువైన ప్రదేశం.

ప్రాచీన గాథలు, మానవుని సృష్టి ఒక ఆదర్శవంతమైన, అందమైన ప్రకృతి మధ్య జరిగినట్టుగా చెబుతాయి. బైబిల్‌లో చెప్పిన జెనెసిస్ (సృష్టి) ప్రకారం నేనిప్పుడు ఈడెన్ వుద్యాన వనంలో నిలబడి వుండాలి. కాని, ఇది 'ఈడెన్' కాదు. అయినా, నేను భూగోళపు బొడ్డువద్ద, మనిషి జన్మస్థలం వద్ద నిల్చున్నాను – అంటే ఇక్కడ భూమధ్యరేఖ వద్ద ఈస్ట్ ఆఫ్రికన్ రిఫ్ట్ వాలీలో. ఓమో ముఖద్వారం వద్ద తగ్గిన నీటిమట్టం చుట్టూ వ్యాపించిన బీడు భూములు మనిషి చరిత్రను రికార్డు చేస్తున్నాయి. ఒకప్పుడు, ఇది 'గార్డెన్ ఆఫ్ ఈడెన్' అయినప్పటికీ ఈనాటికది ఎండి పోయింది.

నేనీ ప్రదేశాన్ని ఎంచుకోవటానికో కారణమున్నది. ఇక్కడ నాలుగు మిలియన్ సంవత్సరాలుగా అగ్నిపర్వతం వెదజల్లిన లావా బూడిద రూపంలో పొరలు పొరలుగా పరుచుకుంది. అప్పటికే అక్కడున్న బురద, రాళ్ళు వగైరా యితర అవశేషాలతో యిది కలసిపోయింది. ఈ 'పొరలు' అనేక దశల్లో ఏర్పడ్డాయి. నాలుగు మిలియన్ల దొకటి, మూడు మిలియన్ల దొకటి, రెండు మిలియన్లదొకటి. ఆ తర్వాతి పొర మరొకటి. అప్పటికి రిఫ్ట్ వాలీ కుంచించుకుపోయి, యిప్పుడున్న పరిమాణానికి చేరుకుంది. కాల నిర్ణయానికి సహకరించే ఈ 'పొరలు' ఓమో ప్రవాహంవల్ల, కొండలవల్ల కొంత ప్రభావితమైనాయి.

ఇక్కడి కొండలు కూడా కాలక్రమంలో ఏర్పడినవే. అంటే, నాలుగు, మూడు, రెండు మిలియన్లు, ఆ తర్వాత సంవత్సరాల పరిణామ ఫలితమే. ఈ రాళ్ళలో, మనిషి ముందే జీవించిన, యితర జంతువుల అవశేషాలు కూడా వున్నాయి.

ఆనాటి జంతువులను చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఎందుకంటే, యిప్పటికే అవి అలానే వున్నాయి. కాని, రెండు మిలియన్ సంవత్సరాలనాటి తొలిమానవ అవశేషాలను చూసినప్పుడు మాత్రం, వాటికీ, నేటి మానవునికీ పోలికే లేదు. ముఖ్యంగా 'పుర్రె' – కంకాళం – ఎంతో మార్పు చెందింది. సహజంగానే, జంతువులు కూడా మార్పు చెందే వుంటాయనుకుంటాం. కాని ఆఫ్రికాలోని అవశేషాల రికార్డును పరిశీలిస్తే యిది తప్పని తేలుతుంది. ఆనాడు 'దుప్పుల అవశేషాన్ని' పరిశీలించినప్పుడు, అది నేటి దుప్పిలాగే వుంటుంది. కాని ఆనాటి వేటగానికీ, నేటి ఆఫ్రికన్‌కూ పోలిక వుండదు.

ఆనాటి జంతువులను చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఎందుకంటే, యిప్పటికీ అవి అలానే వున్నాయి. కాని, రెండు మిలియన్ సంవత్సరాలనాటి తొలిమానవ అవశేషాలను చూసినప్పుడు మాత్రం, వాటికీ, నేటి మానవునికీ పోలికే లేదు.

వేట (లేదా మరేదైన వృత్తి) మాత్రమే మనిషిలో మార్పులు తీసుకొచ్చిందని నా అభిప్రాయం కాదు (వేటాడే జంతువులు అనేకం వున్నాయి గదా!). అలాంటి అన్ని జంతువుల్లోనూ మనిషి మాత్రమే మారాడు. సెర్వల్ కాట్ (ఆఫ్రికన్ అడవి పిల్లి) యింకా వేటాడుతూనే వుంది. ఓరిక్ (దుప్పి) యింకా పరిగెడుతూనే వుంది. మిలియన్ల సంవత్సరాల నాటి జంతువులే అవి. ఆఫ్రికాలో క్షామం వచ్చిన తర్వాత మానవ పరిణామం ప్రారంభమైంది. తటాకాలు ఎండిపోయాయి. అడవులు నశించి గడ్డమైదానాలుగా తయారైనాయి. మనిషి కొత్త పరిస్థితులకు అలవాటు పడాలి. పరిణామక్రమంలో బలమైన జీవజాతులే మిగుల్తాయి. కాని ఈ క్రమంలో అన్ని జీవులూ మూల్యం చెల్లించుకోలేక తప్పదు. పరిసరాలు వాటిని బందీలను చేస్తాయి. ఉదాహరణకు గ్రేవీస్, జీబ్రా లాంటి జంతువులు, గడ్డిమైదానాలు ఎండిపోయినా అవి వాటికో బోనులా మారిపోయాయి. చెంగు చెంగున ఎగిరే 'గ్రాంట్స్ గజెల్లా' (చిన్న సైజు దుప్పి) మారిన పరిస్థితులకు అనుగుణంగా అది కూడా మారింది.

బీడు భూమిలా తయారైనా ఓమో పరివాహక ప్రాంతంలో, మనిషి తొలి అడుగులు వేశాడు. అవును 'ఎసెంట్ ఆఫ్ మాన్' మానవాధిరోహణ – యింత చప్పగా ప్రారంభమైంది. అయినా, ఇదే కీలక దశ. రెండు మిలియన్ సంవత్సరాల క్రితం మన మూలపురుషుడు నడిచాడు గాని, అతడి నడకకూ, ఈనాటి మన నడకకూ ఏమీ పోలికలేదు. అతడి పాదాల నిర్మాణం కూడా మనకన్న భిన్నంగా వుంది. మొత్తంమీద తొలిసారి, మనిషి నిటారుగా, తలెత్తుకుని నడిచాడన్నది వాస్తవం. ఈ చర్య ద్వారా అతడు తన శరీర అవయవాలను కొత్తగా ఉపయోగించాడు.

మనం ముఖ్యంగా పరిశీలించవలసింది అతడి తల. ఎందుకంటే, యితర అన్ని అంగాలకన్నా, ఎక్కువగా పరిణామం చెందిందదే. మన పరిశోధనకు మరో అనుకూలమైన విషయం మాంసంవున్న యితర అంగాలు కాకుండా (ఆనాటి), తల–మనకు శిలాజాలలో యథాతథంగా దొరికింది. దీనివల్ల మనకు 'మెదడు' గురించి ఏమీ తెలియదుగాని కనీసం దాని పరిమాణాన్నైనా అంచనా వెయ్యవచ్చు. గత యాభై సంవత్సరాలలో, దక్షిణాఫ్రికాలో దొరికిన పుర్రెల శిలాజాలవల్ల మనకు తెలిసిన మనిషి తల ఎలా వుండేదో నిర్ణయించగలిగాం. మనం మాట్లాడుకుంటున్న ఓమో దగ్గిరకాక, భూమధ్య రేఖకు దిగువన 'టాంగ్' అనేచోట అనాటమిస్టు రేమాండ్ డార్ట్ ఈ చారిత్రక ప్రధానమైన పుర్రెను కనుగొన్నాడు. అయిదారేళ్ళ చిన్నపిల్ల పుర్రె అది.

మొహం స్పష్టంగా వుంది. పుర్రెలో కొంతభాగం దొరకలేదు. 1924లో దీన్ని కనుగొన్నప్పుడు అందరినీ దిగ్భ్రమపర్చింది. డార్ట్ ఎంత పరిశోధన చేసినా, యితర శాస్త్రజ్ఞులు దాని గురించి ఆచి తూచి మాట్లాడారు.

ఆ పుర్రెకున్న రెండు ముఖ్యమైన అంశాలను డార్ట్ గమనించాడు. మొదటిది 'ఫోరామెన్ మాగ్నమ్' (వెన్నెముక, మెదడు దాకా రావటానికి పుర్రెకున్న రంధ్రం) నిటారుగా వుంది. అంటే ఆ కుర్రాడి తల (జంతువుల తలలా వంగిపోకుండా) నిల్చుని వుందన్నమాట. మనిషి మొదటి

లక్షణం అది. మరొకటి, పలువరుస. వీటి అధ్యయనంవల్ల చాలా విషయాలు తెలుస్తాయి. ఇవి చిన్నపళ్లు. చదరం ఆకారంలో వున్నాయి. అంటే పాలపళ్లన్నమాట. జంతువులను వేటాడే చింపాంజీల కోరల్లాంటి పళ్లు కావు. ఆహారాన్ని నోటితో చీల్చకుండా, చేతులతో పట్టుకుని నోటికందించే పద్ధతి అలవడింది. మనకు దొరికిన సాక్ష్యం ప్రకారం ఆకుర్రాడు మాంసం–పచ్చిమాంసం తింటాడు. అంటే చేతులుపయోగించిన ఆ జీవి ఏవో పరికరాలు – రాతి పనిముట్లు – రాతి కత్తుల్లాంటివి వాడి వుండాలి.

డార్ట్ ఈ జీవికి 'ఆస్ట్రాలోపిథికస్' అని పేరు పెట్టాడు. నాకా పేరు నచ్చలేదు. ఎందుకంటే దానర్థం సదరన్ ఏప్. అని. ఏప్ కాని తొలి ఆఫ్రికన్ జీవిని ఏప్ అని ఎందుకన్నాడో కాస్త తికమక పెట్టే విషయమే.

కొత్త పుర్రెలు దొరకటానికి మరో పదేళ్ళు పట్టింది. ఈసారి ఎదిగిన మనుషుల పుర్రెలు దొరికాయి. 1950 దాకా



'ఆస్ట్రాలోపిథికస్' తో ప్రారంభమైన కథ పూర్తికాలేదు. అనేక 'మిస్సింగ్ లింక్స్'ను సమగ్రంగా అర్థంచేసుకోటానికి అన్నాళ్ళు పట్టింది. మొదట దక్షిణాఫ్రికా, తరువాత టాంజానియాలోని ఓల్డువాయ్ జార్జ్, యిటీవల లేక్ రుడాల్ఫ్ వద్ద చక్కటి సాక్ష్యాలు లభించాయి. ఈ శతాబ్దంలోని గొప్ప ఆవిష్కరణల్లో యిదొకటి. 1940కి ముందు ఫిజిక్సులో, 1950 తర్వాత జీవశాస్త్రంలో సాధించిన ఆవిష్కారణలంత ముఖ్యమైనది. మనిషి ఆవిర్భావం గురించి అత్యధికంగా తెలుసుకోగలిగింది ఈ సాక్ష్యాల ఆధారంగానే.

ఈ 'ఆస్ట్రాలోపిథికస్' శిశువుతో నాకు ప్రత్యక్ష సంబంధముంది. 1950లో, అది మనిషిదో కాదో స్పష్టంగా తెలియని రోజుల్లో నా గణితశాస్త్ర పరిజ్ఞానాన్నుపయోగించి కొన్ని పరిశోధనలు చెయ్యమన్నారు. ఈ పలువరుసను చింపాంజీల పలువరుసతో పోల్చి, లెక్కలువేసి రెంటిలోవున్న తేడా చెప్పాలి. అప్పటిదాకా పుర్రెనెప్పుడూ చేతితో పట్టుకుని ఎరగను, పైగా 'పలువరుస' గురించి నిర్ణయం చెప్పగలిగిన ప్రతిభాలేదు. అయినా, ఆ అవకాశం నన్నుత్సాహ పరిచింది. వుద్వేగానికి కూడా గురయ్యాను. అప్పటికి నాకు నలభై దాటాయి. జీవితకాలమంతా ఆల్‌జీబ్రా లెక్కల్లో కృషిచేశాను. నా జ్ఞానం రెండు మిలియన్ సంవత్సరాల నాటి సాక్ష్యాన్ని పరిశోధించి 'మనిషి చరిత్ర' మీద కొత్త వెలుగు ప్రసరించాలి. అదో అద్భుతం.

ఆ క్షణంనుండీ, మనిషి యిప్పుడున్న దశకు ఎలా చేరుకున్నాడన్న దాని గురించి నిరంతరం ఆలోచిస్తూనే వున్నాను. శాస్త్ర పరిశోధనలో రాసిన గ్రంథాల్లో, సాహిత్యంలో టి.వి. సిరీస్‌లో ఆ పరిశోధన కొనసాగుతూనే వుంది. తొలిమానవుడు (హ్యూమినిడ్) నేటి మానవుడిగా ఎలా రూపాంతరం చెందాడు? వివిధ రంగాలలో నైపుణ్యం సంపాదించి, పరిశీలనాశక్తిని పెంచుకుని, ఆలోచకుడై, మేధోజీవియై, తదేక దీక్షలో కార్యసాధకుడై, ప్రతీకలతో భాషనూ, గణితాన్నీ సృష్టించి, కళల్లో, జామెట్రీలో, కవిత్వంలో, శాస్త్రాధ్యయనంలో యిన్ని వున్నత శిఖరాలను ఎలా అధిరోహించాడు? 'ఎసెంట్ ఆఫ్ మాన్' ఎలా ప్రారంభమైంది? ప్రకృతిని జయించి, జ్ఞానతృష్ణను ఎలా పెంచుకున్నాడు? వీటికి సమాధానాలు కనుగొనే ప్రయత్నమే ఈ వ్యాసాలు. టాంగ్ శిశువు తన జీవితం ఎలా ప్రారంభించాడో నాకు తెలియదు. కాని ఆ అనాది శిశువే మానవేతిహాసానికి మూలవిరాట్టు.

***(ఇంకావుంది)***

# తెలుగునాట దేవతలు

*- మలయశ్రీ*

నాగ దేవతలు, చెట్లు, గుట్టలు, నీళ్ళు - వాగులు - ఇక్కడి మన పూర్వుల మొక్కులందిన తొలి దేవతలు.

పురుష దేవరలు - మల్లయ్య (కొండయ్య, గుట్టయ్య, గట్టయ్య,) శివుడే. నరసింహుని పూజలూ ఇటు ఎక్కువే. ధర్మపురి, యాదగిరి, బెజ్జంకి, నల్లగొండ, లింబాద్రి మొదలగునవి. నృసింహాలయాలు తెలంగాణలో అధికం. ఉత్తరాంధ్రలో సింహాద్రి అప్పన్న; మధ్యకోస్తాలో మంగళగిరి పానకాలస్వామి; రాయలసీమలో అహోబిలం / ఓబులయ్య ముఖ్యులు. చెంచులకు నరసింగం ఇష్ట దైవం - చెంచులక్ష్మి భర్త కదా!

పోతురాజు, కాటమయ్య, భైరవుడు స్థానిక మగ దేవుళ్ళు, ఆంజనేయుడు రామాయణ గాథవల్ల వ్యాప్తి. స్త్రీ దేవతలు మాత్రం ఎక్కువ. పోచమ్మ / పోషమ్మ, ప్రోలమ్మ, పోలేరమ్మ, మైసమ్మ, చౌడమ్మ, ఎల్లమ్మ, దుర్గమ్మ, నూకాలమ్మ, మారెమ్మ, మావుళ్ళమ్మ, బాలమ్మ, తిరుపతమ్మ, బాల సన్యాసమ్మ, కోట సత్తెమ్మ.... ఇంకా అంకమ్మ! అంకాలమ్మ, భూలక్ష్మి, సారగమ్మ.... ఆడ దేవతలు.

వీరి వివరాలు చూద్దాం. ముందుగ మగదేవుళ్ళ వివరాలు ఇవి.

**మల్లయ్య :** మల అంటే కొండ. గిరీశుడు గౌరీపతి శివుడు, మల - తెలుగు మాట. మలె - కన్నడం, మలై - తమిళం (మలైయప్ప - శివుడే కావలె. కాని, ఇప్పుడది తిరుమల శ్రీనివాసుని పేరు. కొండమీద ఉన్నవాడు కాబట్టి. అయినా వెన్కటేశ్వరుడే వేంకటేశ్వరుడు) మల+అయ్య = మలయ్య అవుతది. పదసులభోచ్చారణ కోసం ఊతగా లకు లకారం వచ్చింది. ఒక్క శ్రీశైలం మల్లన్న మాత్రమే మల్లికార్జునుడు. చంద్రగుప్త మౌర్యుని (జైనుడు) భార్య, కుమార్తె మల్లిక అర్జున పుష్పాలతో ఆ స్వామి పూజ చేసిన కథను పట్టి, జానపదుల గాథలో మల్లన్న - ఆదిరెడ్డి! భైరవ, బేతాళ శివకింకరులు.

**పోతురాజు :** ఈ పోతురాజు పోచమ్మ తమ్ముడు. భార్య లేదు. పోచమ్మకు భర్త ఉండడు. ఆ అక్క గుడిముందు ఈ తమ్ముని కాపలా! పోచమ్మ గుడిముందే కాక, పొలం, బావి గట్టు మీద పోతలింగని (సున్నం పూసిన రాతి కనీలు) రైతుల పూజలందుకుంటున్నవి.

**కాటమయ్య :** అడవి దేవుడు. పూర్వంలో అరణ్యాలెక్కువ, కాదు - అడవి, వనం. కాటగలియు జాతీయం, చెట్ల విలువను చాటేది కాటిరేడు (కాట్రేడు / కాట్రేవు) కాటమయ్య పండుగ. వన భోజనాలు పాతవి. వనమహోత్సవాలు కొత్తవి.

కాడు - చితి. ఆ పదం, అర్థం అడవిని పట్టి వచ్చిందే. శవాలను కాల్చినా, పూడ్చినా నాడు అడవులలోనే కదా. ఇట్లాగే గాలి దేవుడు, వానదేవుడు కూడా.

ఇంకా, పురుష దేవతలు కులాల వారీగా ఉన్నరు. మడేలయ్య, మడి (వస్త్రం) ఏలు వ్యక్తి, రజకుల కులదైవం. మల్లన్న గొల్లల దేవుడు, బీరన్న (వీరభద్రుడు) కురమల వేల్పు.

**ఆడ దేవతల వివరాలు :**

వీరు స్థానిక దేవీ మూర్తులు. అయినా సంప్రదాయకుల చేత సప్తమాతృకలుగా మార్పు చెంది ఆదిశక్తి (కాశీమాత) అపర రూపాలుగా ఆరాధింపబడుతున్నవి.

**పోచమ్మ :** ప్రోచు + అమ్మ = ప్రోచమ్మ, పోచమ్మ. కాపాడే తల్లి, పోషించు తల్లి పోషమ్మ! బ్రోచు సరి కాదు. తెలంగాణలోని ప్రతి గ్రామం వెలుపల పోచమ్మ శిలామూర్తి పూజలు - గుళ్ళున్నవి. పోచమ్మ ప్రధాన గ్రామదేవత.

ఈ పోచమ్మకు మారు రూపమే కోస్తాంధ్ర ప్రోలమ్మ. ప్రోలు వికృతి పదానికి ప్రకృతి పురి. ప్రోలమ్మ అంటే

డా. మలయశ్రీ, ఫోన్ : 9866546220

నగరమాత. నెల్లూరి ఖడ్గ తిక్కన జనని ప్రోలమ్మ. తొలి కాకతీయ పాలకులలో ఇద్దరు బేతరాజులు (బేతాళుని పేరు) ఇద్దరు ప్రోలరాజులున్నరు. ఇదే దేవి రాయలసీమ ప్రాంతంలో పోలేరమ్మ. ఆ దేవత ప్రసక్తి పోతులూరి వీరబ్రహేంద్రస్వామి జీవిత చరిత్ర వల్ల వచ్చింది. ప్రోలు-ఏలు-అమ్మ – పోలేలమ్మ. జనం నోళ్ళలో పడి ఆది కాస్త మారి పోలేరమ్మ అయింది. రలయోరభేదః. పోచమ్మ, పోలమ్మ, పోలేరమ్మ పర్యాయ పదాలు.

**మైసమ్మ :** మహిషమ్మ, దున్నపోతుపై ఎక్కి వెళ్ళే తల్లి. మహిసంబంధ పదం కాదు. మహిషాసుర మర్దినిగా ఈమె కథ మారి ఉండవచ్చు. ఆమె శార్దూల – సింహ వాహని. ఈ దేవి నెలకొన్న ప్రదేశాన్ని పట్టి పలుపేర్లు. ఊరి మైసమ్మ, కట్ట మైసమ్మ, గండి మైసమ్మ, గడీ మైసమ్మ, బంగారు మైసమ్మ.. ఆటవికులకు (గోండులకు) కూడ మైసమ్మ పూజలున్నవి.

**మహంకాళి :** మహాన్ కాళి, మహాకాళి. చాందా, కలకత్తా, సికిందరాబాద్, ఉజ్జయిని (మహాకాళ క్షేత్రం – మేఘసందేశం) కాళీ దేవళాలు. త్రిలింగదేశంలోని కాళేశ్వరం శివాలయం. సంస్కృత భాషలో 'ళ' లేదు. అప్పుడది కాలేశ్వరం అవుతది. కాలుడు – శివుడు, యముడు. కాళేశ్వరం గర్భగుడిలో ఒకే ప్రాణవట్టం మీద రెండు లింగాలు (శివ, యమ) ఇప్పటికీ పూజలందుకొనుట విశేషం. కాళి – మహాకాళికాదేవి అవతారాలు సతీదేవి, పార్వతి. అంటే ఆమె భాగవతంలో బమ్మెర పోతన అన్నట్లు – ముగురమ్మల మూలపుటమ్మ ఆ పద్యాన్ని చూడండి.

అమ్మల (తల్లుల, లేదా ఆ, మల – కొండ) కన్న అమ్మ ముగురమ్మల మూలపుటమ్మ (ఆది శక్తి), సురారులమ్మ (దేవతలకు శత్రువులైన రాక్షసుల తల్లి దితికి) కడుపు ఆరడి పుచ్చిన యమ్మ – పుత్రశోకం కలిగించిన తల్లి – దుర్గాదేవి!

కాళి అనార్యుల దేవత. దేవతల పక్షం చేరి రాక్షస సంహారం కావించెనా? అవీ నాటి వర్ణనలు – హిందూమతం గారడీ.

**దుర్గ :** కాళికాదేవికి మరో పేరు దుర్గ. కనకదుర్గ (విజయవాడ) బంగారు తల్లి. దుర్గను ఆదిశక్తి రూపంగా భావిస్తూ జనం పూజిస్తున్నా, ఆ శబ్ద స్వరూపాన్ని చూసి నాకో వినూతన భావం స్ఫురించింది. దుర్గం అంటే కోట. దుర్గాన్ని కాపాడే తల్లి దుర్గమమ్మ – దుర్గమ్మ! అని ఆ పేరు కావచ్చు కదా!

గుంటూరుజిల్లా నిజాంపట్నం ఓడరేవు ముంగిట 'మొగదారమ్మ' గుడి ఉంది. ఆ పేరు ఏమిటా? అనే చర్చ నాకు, స్థానిక సాహితీ మిత్రుడు నాసరయ్యగారితో నడిచింది. అది "ముఖద్వారం అమ్మ." దేనికి? సముద్రానికి. ఆ ఓడరేవు సముద్రం చీలిక పై భాగం 'పొగురు' అని అన్వర్థ నామం అక్కడి జనవ్యవహారంలో ఉంది.

రామాయణం లంకాపురి కోటగవని లంకిణి కాపలా ఉద్యోగిని. బల్మూరి కొండల రాయుని జానపద గేయగాథలోని ఆర్వెల్లి కటారి జింకని గడీ రక్షణకావించే నాయకురాలు (పల్నాటి మంత్రి నాగమ్మ) గ్రామదేవత.

దుర్గమ్మ, దుర్గమమ్మ కోటమైసమ్మవలె దుర్గ రక్షణ కావించే దేవత అనవచ్చు.

**ఎల్లమ్మ :** గ్రామ పొలిమేర దేవత ఎల్లమ్మ. ఎల్ల – సరిహద్దు, తాడి, ఈత వనాల్లో తిరిగే గౌడులకు ఎల్లమ్మ కులదేవత. "ఎలపట్టపగలు ఎల్లమ్మ కొలుపు" – అని ఒక సామెత ఉంది. ఎల్ల – ఊరికి దూరం, పట్టపగలు – ఎండవేళ, ఎల్లమ్మ కొలుపు – భయానకం. పోలేం, చూడలేం అని భావం.

ఇంటిలోపలి గోడకు స్త్రీలు, చందమామ సైజులో గుండ్రంగా పూతగంధం పూసి, పసుపు, కుంకుమ చుక్కల బొట్లు పెట్టి, దాని చెంత చిలుక కొయ్యకు వేపరెమ్మలు చెక్కి పూజిస్తరు. ఇది ఇల్లమ్మ. రాను రాను ఎల్లమ్మ అను పేరే స్థిరపడ్డది. ఇల్లమ్మ పేరు మాయమైంది.

పరశురాముని తల్లి, జమదగ్ని భార్య రేణుక ఈ ఎల్లమ్మేనట. ఆ కథ గౌడపురాణంలో ఉంది. రేణుక జమదగ్నుల పెండ్లి, అనార్య-ఆర్య జాతుల సంకరానికి మైత్రి, కలయికకు నిదర్శనం. అరుంధతీ వసిష్టుల కల్యాణం అంతే కదా.

ఇక, బాల సన్యాసమ్మ, తిరుపతమ్మ, కోట సత్తెమ్మ... ఆత్మబలిదానం కావించుకున్న స్త్రీలే. కట్టమంచివారి 'ముసలమ్మ మరణం' కావ్య నాయిక సైతం ఒక పల్లెపడుచు.

**అంకమ్మగుడి :** పలనాటిసీమ కారెంపూడిలో ఉంది. రాయలసీమలోను అంకమ్మ పూజలున్నట్లు తెలిసింది. అంకమ్మ, అంకాలమ్మ అర్థమేమిటో కాని, ఆటవికుల (చెంచుల) ఇష్టదేవత అని వినికిడి.

**మారెమ్మ :** మారి (గత్తర – కలరా) కలిగించే / తగ్గించే తల్లి మారెమ్మ. "నిన్ను మారెమ్మ మింగ (మ్రింగు గాక)" అని ఆడవాళ్ళ తిట్టు. కర్ణాటకలో మారెమ్మ కొలుపులు జాస్తి. స్త్రీలు

బోనం పాత్రలు తలపై ఎత్తుకొని, రాత్రివేళ సామూహికంగా వెళ్ళి ఊరి నడిమి మారెమ్మ దేవికి నివేదన కావించి పూజిస్తరు. గుడిముందు వీర యువకులు బాజా చప్పుళ్ళ మధ్య ఉత్తేజితులై 'బాయి బీగ' వీర కృత్యాలతో నృత్యం చేస్తరు. అవి భయానక దృశ్యాలు. బాయిబీగ అంటే నోటికి తాళం. సన్నని లోహపు తీగెలను దవడకు, నాలుకకు లేదా రెండు పెదవులకు కుచ్చి, వాటి రెండు కొసలను కలిపి వడి తిప్పుతరు. వీరావేశభక్తి. ఈ సన్నివేశం నేను మైసూరు పట్టణంలో స్వయంగా చూసినది – 1974.

**సారగమ్మ :** తెలంగాణాలో ఊరినడుమ రెండు చెక్క బొమ్మలు పూజలందుకుంటున్నవి. ఇవి కలరాను కలిగించే / తొలగించేవేవట. వీటి కొలుపులు భయానకం. విగ్రహాల ముందు రంగు పొడులతో పట్టు (ముగ్గు) పోసి, పంబలీలు తాళాలు తప్పెటల నడుమ వీరగానాలతో (మద్యపానం తప్పని సరి) ఊగిపోతూ, ఎగురుతూ గొర్రెపోతుల గావు పడుతరు – మెడకొరికి బలియిస్తరు. యేబదేండ్ల క్రితం ఊరూరికి ఇవి జోరుగా ఉండేవి. ఆ రెండు బొమ్మల్లో ఒకటి పెద్దది భూలక్ష్మి/ మహాలక్ష్మి. రెండవది కొంత చిన్నగా ఉండేది ఆమె కూతురు – సారగమ్మ. సారగం అంటే పని. తల్లి భూదేవి, బిడ్డ శ్రమ దేవత. ఎంత అందమైన, అవసరమైన భావనో!

"సారగమ్మ చండ్లకు చాకలి మంగలి కొట్లాడినట్లు" అని సామెత ఉంది. దేవత అను పవిత్ర భావనది కాదది. చెక్కబొమ్మ శృంగార అంగాలపై ఆశ వ్యర్థం అని. శిలా ప్రతిమలైనా అంతే.

**చౌడమ్మ :** ఇటీవల ఒక వైష్ణవ కవి రాసిన, 'చౌడేశ్వరీ శతకం' చూసిన. ఆ పేరిటి దేవి తెలంగాణలో లేదు. అనంతపురంలో ఉన్నట్లు మిత్రుడు సుజరె కథనం. ఆమె పద్మశాలీల కులదేవత. ధర్మవరంలో ఏటా ఈదేవి పూజలు పెద్ద జాతరగా చేస్తరట. అక్కడనేత (పట్టు) పని వృత్తివాళ్ళు ఎక్కువ సంఖ్యలో ఉన్నరు కదా.

చౌడమ్మ – చావుడమ్మ 'మరణదేవత' అనవచ్చు. రాయలసీమ కర్ణాటకకు దగ్గర. అక్కడి చాముండేశ్వరి ఇటువచ్చి చావుడమ్మ అయ్యిందో, ఇక్కడి గ్రామీణ దేవత అటువెళ్ళి నాగరీక దేవతగా మారిందో తెలియదు.

**గంగమ్మ :** గంగానది కాదు. గోదావరిని కూడా (గౌతమి, గోదా) గంగ అనే పిలుస్తున్నరు. గంగమ్మ జాతర తిరుపతిలో గొప్పగా జరిగినట్లు పత్రికల వార్తలు. అంటే – అది జలదేవత పూజ అనవచ్చు. పచ్చిగంగ ముట్టను అన్నప్పుడు అది మంచినీళ్లే – గంగానది కాదు. గంగా / గోదావరి నదుల ప్రాంతం వారు – జాలరులు స్థలం మారి ఈ గంగ ఆరాధనలు వ్యాపించే వీలుంది. ఇవి నీటి విలువను చాటేవి. శ్రీశైలం దగ్గరి కృష్ణానది పేరు 'పాతాళగంగ'!

**నూకాలమ్మ :** బియ్యం / అన్నం ఇచ్చే తల్లి లేదా స్ఫోటకం పొక్కులు బియ్యం నూకల వలెనే ఉంటవి కదా. అందుకే నూకాలమ్మ అను పేరు రావచ్చు. ముత్యాలమ్మా అంతే. పోచమ్మ – పోలమ్మ ఆమె. నూకాలమ్మ దేవత గుడి భీముని పట్నం / భీమ్లీలో ఉన్నట్లు మిత్రుడు డి. అప్పారావు పంపిన వివరణ. కోస్తాంధ్ర ప్రాంతంలో జిల్లా జిల్లాకు వేర్వేరు గ్రామదేవతలు ఉన్నట్లు తెలిసింది.

**మావుళ్ళమ్మ :** ఈ దేవి ఉత్తరాంధ్రలోనే ఉన్నట్లుంది. ఇటులేదు. దక్షిణ కోస్తా – రాయలసీమ సంగతి తెలియదు. మామిడి చెట్లతో సంబంధం లేని పదమిది.

చాందా, నాగపూర్ ప్రాంత గ్రామదేవత మావుళి. ఆమె తెలుగు వారి పోచమ్మ – ప్రోలమ్మ వంటిది. ఆ మహారాష్ట్ర మావుళీ ఇటు దిగమతి అయ్యి 'మావుళి అమ్మ' మావుళమ్మ, మావుళ్ళమ్మగా మారవచ్చు.

**పైడితల్లి :** బొబ్బిలి యుద్ధం కాలం నాటి విజయనగరం రాచింటి ఆడపడుచు పైడితల్లిగా ఇప్పటికీ పూజలందు కుంటున్నది. అక్కడి ఉత్సవంలో పూజారి, బండి వాసం కొసకు కట్టిన ఉట్టిలో కూచుని ఊరేగే 'సిరిమాను' వీరశైవుల 'సిడిమ్రాను' వంటిదే. సిడిమ్రేలుతూ మొక్కు చెల్లింపు హింసాపూరిత భయానక భక్తి చర్య. సిడిమ్రాను ప్రస్థావన 'క్రీడాభిరామం'లో వచ్చింది.

శిలామాను అని ఓ కథ దక్షిణాంధ్రది – సీమదేనో చదివిన గుర్తు. అది ఈ సిడి – సిరిమానే. ఒక్కొక్క పదానికి ఎన్ని మార్పులో. ఆచారాలూ మారె. క్రైస్తవ మరియమ్మ (క్రీస్తు మాత మేరీ) మందిరాలు వచ్చె. పదేండ్ల క్రితం విశాఖకు వెళ్ళినపుడు అక్కడ కొత్తగా "ఎయిడ్సమ్మ" గుడి నిర్మించి పూజిస్తున్నరనే విషయం తెలిసి నవ్వుకున్నం. ఇంకెన్ని మార్పులు, చేర్పులో. ఇవి ఈనాటి, నాటి – నేటి మనవాళ్ళ దేవీ వేడుకల వివరాలు.



## చరిత్ర, ఆగమ శాస్త్రం

# తిరుమల ఆలయం

*- దేవిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి*

మానవతా విలువలకు ప్రతిరూపం భగవంతుడు. ఆ మానవ విలువల సూత్రరూపం మతం. మానవుల ఆధ్యాత్మిక అవసరాల్ని తీర్చేది ఆలయం; ప్రజల ప్రాథమిక అవసరాల్ని తీర్చేది ప్రభుత్వమైనట్లు. మానవతా విలువల్ని కాలరాచేది, సత్యాన్ని తగులబెట్టేది, ఛాందసాన్ని పెంచేది మతం కాజాలదు; అది మానవతా విలువల ప్రతిరూపమైన భగవంతునికి చేసే అపచారం మాత్రమే. అలాగే మానవ విలువల ప్రతిరూపమైన భగవంతుని దగ్గరగా దర్శించుకోనీయక పోవడం కూడా భగవదపచారమే. అంటే, తిరుమల ఆలయంలో నిత్యం అపచారం జరుగుతోంది. అందుకు కారకులు ఆగమ పండితులు, తిరుమల – తిరుపతి దేవస్థాన యాజమాన్యం. భగవంతుని ప్రాశస్త్యాన్ని కాపాడేది భక్తుడు మాత్రమే; ఆగమ శాస్త్రం, స్తోత్రం, పండితులు, మత పెద్దలు, దేవస్థాన యాజమాన్యం కాదు. ఆగమశాస్త్రం నిజానికి భక్తుని అవసరాలు తీర్చడానికి ఎల్లప్పుడూ అనుకూలమని ఆలయ చరిత్రే చెబుతోంది. శాస్త్రాన్ని అడ్డంపెట్టుకొని తమ ప్రాముఖ్యాన్ని కాపాడుకోవాలని భావించేవారి వలనే సమస్యలు తలెత్తుతున్నాయి.

అసలు మారీచి సంహిత ఆధారంగా వైఖానస ఆగమం క్రీ.శ. 8వ శతాబ్దిలో పుట్టింది. క్రీ.శ. 966లో భోగ శ్రీనివాసుని వెండి ప్రతిమ అంకురార్పణ జరిగిన తరువాతనే వెంకటేశ్వరుని ఆలయంలో వైఖానస ఆగమం ఆచరించడం ఆరంభమైంది. అంతకు మునుపు తిరుమల ఆలయంలో వైఖానస ఆగమం ప్రకారం పూజాది కార్యక్రమాలు జరిగేవి కావు. ప్రాచీన కాలం నుండి అనుసరిస్తుండిన అలవాట్లు, ఆచారాల ప్రకారమే పూజా కార్యక్రమాలు జరుగుచుండేవి. శాస్త్రం, స్తోత్రంతో సంబంధంలేని అతిసాధారణ ధూపదీపనైవేద్యాలు (నేటి చిన్న చిన్న ఆలయాల్లో జరిగినట్లు) మాత్రమే ఉండేవి. క్రమబద్ధమైన పూజావిధానం ఉండేది కాదు. క్రమంగా పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చ, పూజా విధానాలు వాడుకలోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఆ తరువాతే ఆగమం అనుసరించడం ఆరంభమైంది. అసలు, వేంకటేశ్వరుని ఆలయం లాంటి స్వయంవ్యక్త ఆలయంలోని ప్రాచీనపు అలవాట్లు, ఆచారాల్లో వైఖానస ఆగమ ప్రమేయం ఉండడానికే వీలులేదు. అయినా దానిని ఆచరిస్తున్నారు. ఆగమ ప్రమేయం ఉండరాదు కాబట్టే వేంకటేశ్వరుని ప్రతిమ ఆగమ శాస్త్ర ప్రకారం లేకున్నా ఆరాధింపబడుతోంది. అసలు, ఆగమం పుట్టుకకు 800 సంవత్సరాలకు ముందే వేంకటేశ్వరుని ప్రతిమ ఆవిర్భవించింది. నేటి ఆగమరీతి పూజా విధానాన్ని క్రోడీకరించినవాడు క్రీ.శ. 966లో భోగ శ్రీనివాసుని ప్రతిమస్థాపన జరిగిన కాలానికి చెందిన అలవందర్ అని పిలువబడిన యమునముని (నాథముని మనుమడు). ఇక ఆలయ సంబంధ శ్లోకాలు కూడా క్రీ.శ. 10వ శతాబ్ది చివర్లోనే పుట్టాయి. అలాంటి వాటిలో అలవందర్ రచించిన "స్తోత్రరత్నం" ఒకటి. అంటే, క్రీ.శ. 966కు ముందు ఆగమరీతి పూజావిధానంగాని, స్తోత్రపఠనంగాని వుండేది కాదు. అసలు క్రీ.శ. 8వ శతాబ్దికి పూర్వం భక్తి తన్మయత్వంతో భగవంతుని ఆరాధించే ఆచారమేలేదు. ఇక, అద్వైతమైతే క్రీ.శ. 9వ శతాబ్ది మొదటి అర్ధభాగం నాటి శంకరాచార్యుని కాలంలోను, విశిష్టాద్వైతం క్రీ.శ. 11-12 శతాబ్దాల నాటి రామానుజాచార్యుని కాలంలోనూ, వీరిద్దరి తరువాత చాలా కాలానికి ద్వైతం మాధ్వుని కాలంలో పుట్టాయి.

ఇక, హైందవ మతంలోని "ముక్కోటి దేవదేవీలు', వారి అవతారాల సమ్మేళన రూపుడుగా తిరుమల 'వేంగటేశ్వరుడు'

డా. దేవిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, ఫోన్ : 9849584324

(తప్పుల్ని, కష్టాల్ని కాల్చివేసి రక్షించే వాడు), వేంకటేశ్వరుడుగా, మహావిష్ణు ప్రతిరూపంగా (అవతారంగా కాదు) ఆరాధింపబడుచున్నాడు. ప్రాచీన కాలాన శైవ, వైష్ణవుల మధ్య కొన్ని శతాబ్దాల పాటు సాగిన తీవ్ర ఘర్షణలతో విసుగు చెంది, రెండు తెగల మధ్య మతసామరస్యంకై చేసిన ప్రయత్నంలో భాగంగానే, రెండు తెగలకు ఆమోదమైన దైవంగా, రెండు తెగల దేవదేవీల సమ్మేళన రూపుడుగా కొలుచుకోవడం జరుగుతోంది.

తొలుత వేంకటేశ్వరునికి ఆలయమే లేదు. వేంకటాచలంగా నేడు పిలువబడుతోన్న కొండపై నుండి ప్రవహిస్తుండిన ఒక సెలయేటి ఒడ్డున ఆర్చావతార (నిలువు రూపం) ప్రతిమారూపంలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉండేవాడు. అది గమనించిన అక్కడి పశువుల కాపరులు, ఏనుగుల్ని పట్టి అమ్మేవారు నాటి తిరుపతి పరిసర విశాల ప్రాంతాలకు పాలకుడుగా ఉండిన తొండైమాన్ చక్రవర్తిగా పిలువబడుచుండిన అదోండై దృష్టికి తీసుకురాగా ఆయన వేంకటేశ్వరునికి తొలి ఆలయాన్ని నిర్మించాడు. ఇతడు తొలి చోళుల చక్రవర్తయిన కరికాళచోళునికి, నాగవంశ రాణికి జన్మించాడని, క్రీస్తుశకం ఒకటవ శతాబ్దినాటి వాడని చెప్పబడుచున్నాడు. ఇతడు దక్షిణ, పశ్చిమ ప్రాంతాల నుండి వెల్లాల మొదలైన జాతీయుల్ని పదివేల మందికి పైగా, జనం తక్కువగా ఉన్న తన తిరుపతి పరిసర రాజ్యానికి రప్పించి వ్యవసాయాభివృద్ధికై కృషిచేసినట్లు తెలుస్తోంది.

అయితే, ఇతడు ఒక మండపం లాంటి గోడలు లేని ఆలయాన్ని నిర్మించాడేగాని, నేటి ఆలయం లాంటి దానిని నిర్మించలేదు. అందుకు కారణం ఆనాటికి కట్టడ ఆలయాల విధానం దేశంలో ఎక్కడా వాడుకలో లేదు. దీనితో, వేంకటేశునికి ఎండ, వాన, గాలి నిరంతరం తగులుతూ ఉండేవి. క్రీ.శ. 756 నాటి ప్రాచీన గ్రంథమైన శిలప్పదికారం నాటికి కూడా ఈ ఆలయానికి పేరు ప్రఖ్యాతులు లేవు. క్రీస్తుశకం ఎనిమిదవ శతాబ్దిలో, దానికి కొంచెం అటు ఇటుగా జీవించిన పన్నెండుమంది ఆళ్వారులు తమ భక్తి పాటలతో (వీటినే ప్రబంధాలంటారు) వేంకటేశ్వరుని గురించి పలు దక్షిణ భారత ప్రాంతాల్లో ప్రచారం చేయడంతో ఈ ఆలయం, ఈ దైవం క్రమంగా ప్రాచుర్యాన్ని పొందాయి. ఆళ్వారుల్లో అత్యధికుల బ్రాహ్మణేతర చతుర్వర్ణులు, చతుర్వర్ణేతరులు ఉండడం గుర్తించదగిన అంశం. ఆళ్వారుల్లో కులశేఖరుడు ఒకడు. మధ్యయుగపు చివరి నాటి అన్నమయ్య ఆళ్వార్ల భక్తిగీతాల నుండే స్ఫూర్తినిపొంది తన కీర్తనల్ని రచించాడు. శిలప్పదికారం కాలానికి సెన్‌గాన్ నెడియోన్ అని వేంకటేశ్వరుని పిలచేవారని నాటి కేరళ ప్రాంతపు మాంగాడు నుండి వచ్చిన యాత్రికుని మాటల బట్టి తెలుస్తోంది.

క్రీస్తుశకం ఎనిమిదవ శతాబ్ది మధ్య నాటికి, తొండైమాన్ నిర్మించిన మండపరీతి ఆలయం దాదాపు పూర్తిగా శిథిలమైంది. అంతేగాక, ఆనాటికి తిరుమల వెళ్ళడానికి కాలి మార్గాలు కూడా సరియైనవి లేనందున ఆలయ దర్శనానికి వెళ్ళేవారు అత్యల్పంగా ఉండేవారు. ఈ సమస్య వలనే క్రీ.శ. 826 ప్రాంతంలో తిరుచానూరులో తిరువిలన్ కోయిల్‌గా పిలువబడిన వేంకటేశ్వరుని ఆలయం నిర్మించబడి భక్తుల ఆధ్యాత్మిక అవసరాలు తీర్చబడినాయి. అయితే క్రీ.శ. 1000 ప్రాంతానికి ఈ ఆలయం తన ప్రాధాన్యతను కోల్పోయింది. అప్పటికే, క్రీ.శ. 900 ప్రాంతంలో తిరుమలలో నిర్మింపబడిన కొత్త ఆలయం ప్రాధాన్యత పొందసాగింది. వేంకటేశుని తిరుచానూరు ఆలయం పల్లవరాజు విజయదంతి విక్రమవర్మ కాలంలో నిర్మింపబడినట్లు తెలుస్తోంది.

ఇక, తిరుమలలో తొండైమాన్ నిర్మించిన మండపరీతి ఆలయం శిథిలం కావడంతో దాని స్థానంలో గట్టి రాతి గోడలతో కూడిన కోయిల్ – ఆళ్వార్‌గా, పిలువబడుతోన్న గర్భగృహ, శయనమండపంగా పిలువబడుతోన్న ముఖ మండప, ఈ రెండింటి చుట్టూ ముక్కోటి ప్రదక్షిణగా పిలువబడుతోన్న ప్రదక్షిణాపథలతో కూడిన వేంకటేశ్వరుని ఆలయం క్రీ.శ. 900 ప్రాంతంలో నిర్మించబడింది. ఇదే నేటికీ ఉన్న అసలు ఆలయం. ఆ తరువాత క్రీ.శ. 966లో గర్భగృహం, ముఖమండప, ప్రదక్షిణాపథలకు ముందు, తూర్పు వైపున తిరువిలన్‌కోయిల్ అని పిలువబడుతోన్న స్నపన / స్థపన మండపను పల్లవ నాయకుడైన పేర్‌కదైయర్ కుమార్తె, కొడవై నాయకుడైన శక్తివితన్కన్ రాణియైన కడవన్ పెరుందేవిగా పిలువబడిన సమవై రాణి నిర్మింపజేసింది. క్రీ.శ. 966 జూన్ 8వ తేదీన మానవాళ పెరుమాళ్‌గా పిలువబడిన భోగ శ్రీనివాసుని (వేంకటేశ్వరుని ప్రతిరూపం) వెండి ప్రతిమను అభిషేకాది దైవకార్యక్రమాలకై సమవై ఆలయానికి సమర్పించారు. దీనితోబాటు ఆయనకు పలు నగల్ని, భూముల్ని ఇచ్చారు. ఇందుకుగాను అంకురార్పణ, పతాక ఆవిష్కరణలతో కూడిన తొలి పురటాసి ఉత్సవాలను

(బ్రహ్మోత్సవాలను) సూర్యచంద్రులు ఉండేవరకు జరిపించాలని సమవై కోరినారు (దానాలు ఇచ్చినవారు సూర్య చంద్రులుండే వరకు, తమ దాన లక్ష్యాన్ని నెరవేర్చాలని కోరడం ప్రాచీన శాసనాల్లో విరివిగా అగుపడుతుంది). మారీచి సంహిత ఆధారంగా క్రీ.శ. 8వ శతాబ్దిలో పుట్టిన వైఖానస ఆగమశాస్త్రం, క్రీ.శ. 966లో భోగ శ్రీనివాసుని అంకురార్పణ తిరువిలన్ కోయిల్‌లో జరిగిన తరువాతనే వేంకటేశ్వరుని ఆలయంలో ఆచరించడం ఆరంభమైంది. అంతకు మునుపు శాస్త్రంతో సంబంధంలేని సాధారణ ధూపదీపనైవేద్యాలు ఉండేవి. సమవై దానధర్మాల తరువాతనే వేంకటేశ్వరుని పేరు ప్రఖ్యాతులు వ్యాప్తి చెందసాగాయి. ఆలయ సంబంధ శ్లోకాలు కూడా క్రీ.శ. 10వ శతాబ్ది చివర్లోనే పుట్టాయి, 'శ్రీ అలవందర్ స్తోత్ర రత్నం' వంటిది. అంతకుముందు అవి లేవు. అంటే, క్రీ.శ. 966కు మునుపు ఆగమరీతి పూజావిధానంగాని, స్తోత్రపఠనంగాని ఉండేవి కాదు. సమవై తరువాత ఒకటవ రాజరాజు చోళుని కాలంలో క్రీ.శ. 1000 ప్రాంతంలో రాణీ పరాంతకదేవి తిరుమలేశునికి పలుదానాలు ఇచ్చారు. దానాలు ఇచ్చేనాటికి సమవై, పరాంతకదేవీలు భర్తల్ని కోల్పోయిన వారుగా ఉన్నట్లు తెలుస్తోంది. క్రీ.శ. 900లో కట్టడ ఆలయం ఏర్పడిన నాటికి గాని, క్రీ.శ. 966లో తిరువిలన్ కోయిల్ నిర్మింపబడినప్పటికి గాని గర్భగృహంపై నేడు ఉన్న విమానం ఉండేది కాదు. సమతల పై కప్పు మాత్రమే ఉండేది.

క్రీ.శ. 1250 ప్రాంతంలో (క్రీ.శ. 1244 - 1250 మధ్య), క్రీ.శ. 900 ప్రాంతపు నాటి ఆలయంలో మార్పులు చేయబడ్డాయి. గర్భగృహ, శయన మండప గోడల చుట్టూ ఆనుకొని వెలుపల వైపున మరొక వరుస రాతిగోడలు నిర్మించ బడ్డాయి. అప్పటికే ఉన్న పాత ప్రదక్షిణా పథ గోడలు పగులగొట్టబడినాయి. ప్రదక్షిణాపథ వెడల్పు పెంచబడి నూతన ప్రదక్షిణాపథ గోడలు నిర్మించబడ్డాయి (ఈ ప్రదక్షిణాపథాన్నే ముక్కోటి ప్రదక్షిణ అంటారు). ఈ నూతన గోడలపైన విమాన నిర్మాణం చేయబడింది. దానిపై బంగారుతాపడం చేసిన రేకులు అమర్చబడ్డాయి. పాత ప్రదక్షిణాపథ గోడలు తొలగించగా వచ్చిన శాసనాలుగల రాళ్ళను మరలా కొత్త ప్రదక్షిణాపథ గోడలలో అమర్చడం జరిగింది. ఈ మార్పు లన్నింటిని వేంకటేశ్వరుని వీరభక్తుడైన యాదవ వంశానికి చెందిన వీరనరసింహరాయలు చేశాడు (ఈతనికే ఘట్టిదేవ యాదవరాయలు, రాజమల్లు అను పేర్లు ఉండినట్లు తెలుస్తోంది). నాటి చక్రవర్తి సుందర పాండ్యుడు (క్రీ.శ. 1251-1275) గర్భగృహ విమానంపై బంగారు తాపడం గల 'కలశం'ను క్రీ.శ. 1262లో నిర్మింపజేశాడు. వీర నరసింహుడు క్రీ.శ. 1262లో పాదిరివేడు గ్రామాన్ని వేంకటేశ్వరునికి దానంగా ఇచ్చాడు. కాని, ఇతని కాలంలోనో, ఈతని తరువాతనో క్రీ.శ.1265-1285 మధ్య, ముక్కోటి ప్రదక్షిణాపథ మూసివేయబడింది. ప్రదక్షిణాపథలోని తూర్పు విభాగంలో నేడు రామర్‌మేడైగా పిలువబడుతోన్న విభాగం ఏర్పరచబడింది. (యాదవ వంశీయులు క్రీ.శ. 1260ల ప్రాంతం వరకు చోళుల సామంతులుగా ఉండినట్లు, ఆ తరువాత స్వతంత్రులైనట్లు తెలుస్తోంది). వీరి రాజ్యాన్ని విజయనగర పాలకులు ఆక్రమించారు. ఇక తిరుమణి మండపం (ప్రస్తుతం హుండీ, పెద్దగంట, గరుడ మండపం, జయవిజయులున్న మండపం), చంద్రగిరి నివాసి మల్లన్న లేక మాధవ దాసర్‌చే క్రీ.శ. 1417లో విజయనగర పాలకుల కాలాన నిర్మింపబడింది. అంతకుముందు రెండువందల సంవత్సరాలకు పూర్వమే క్రీ.శ.1180-1190 మధ్య, లోపలి గోపురం, ప్రాకారాలు (గోపుర తలాలుతప్ప), క్రీ.శ. 1200 ప్రాంతంలో వెలుపలి గోపురం, ప్రాకారాలు (గోపుర తలాలు తప్ప) నిర్మించబడ్డాయి.

గోపురాల తలాలు, వేయికాళ్ళ మండపాలు మాత్రం సాళువ నరసింహరాయలు (క్రీ.శ. 1472-1482) దానంగా ఇచ్చిన తిరుపతి సమీప దుర్గ సముద్రం గ్రామ ఆదాయం నుండి క్రీ.శ. 1482లో నిర్మించబడ్డాయి. అంతకు పూర్వమే, తిరుమణి మండపం నిర్మించిన ఏడాదే, అనగా క్రీ.శ. 1417లోనే లోపలి గోపురం ఎదురుగా పశ్చిమాన ఉండిన ధ్వజస్థంభం, బలిపీఠాలు లోపలి గోపురం ఎదురుగా తూర్పు వైపునకు స్థానచలనం గావించబడ్డాయి. శాస్త్ర సమ్మతం కాని రామానుజమందిరం క్రీ.శ. 1177 ప్రాంతంలో, వరదరాజ మందిరం క్రీ.శ. 1340లో, నరసింహస్వామి మందిరం క్రీ.శ. 1460లో, రంగనాథ మందిరం, రంగమండపాలు క్రీ.శ. 1340 -1350 మధ్య నిర్మించబడ్డాయి. అర్చావతార వేంకటేశ్వరుని ఆలయంలో ఇవి ఉండరాదు. ఇక క్రీ.శ. 1473లో సంపంగి ప్రదక్షిణాపథంలోని నాల్గుమూలల్లోని మండపాలు, క్రీ.శ. 1561లో తిరుమలరాయ మండపం, క్రీ.శ. 1680 ప్రాంతంలో కళ్యాణమండపం నిర్మించబడ్డాయి. క్రీ.శ. 17వ శతాబ్దిలో ఐనమండపం, దాని ముఖమండపాలు నిర్మించబడ్డాయి.

**ఇలా, వేంకటేశ్వరుని ఆలయంలో పలు మార్పులు చేయబడ్డాయి.**

అంతేకాక, క్రీ.శ. 830–850 నాటి బాణవంశపు విజయాదిత్యుడు వేంకటేశ్వరుని ఆలయంలో నందవిలక్కు లేక నిరంతరాయంగా వెలిగే దీపం ఒకటి ఏర్పాటు చేశాడు. క్రీ.శ. 966 లోనూ అలాంటి ఏర్పాటే జరిగింది. క్రీ.శ. 985–1013 నాటి ఒకటవ రాజరాజు రాణి ఉలగమదేవి కూడా అదే ఏర్పాటు చేసింది. అయితే, ఒకటవ రాజేంద్ర చోళుని కాలాన క్రీ.శ. 1014లో ఇరవైనాల్గు దీపాలు వెలిగించే సాంప్రదాయం ఆరంభించబడింది. ఇలాంటి మార్పునూ శాస్త్రం సమ్మతించింది. అలాగే శైవ, వైష్ణవ తెగ భేదాలకు అతీతంగా, కుల భేదాలకు అతీతంగా వేంకటేశ్వరుని ఆరాధించడం జరుగుతోంది. గర్భగృహంలోని వేంకటేశ్వరునికి తొలి నైవేద్యంగా ఇవ్వబడిన ప్రసాదం దైవ దర్శనానికి వచ్చిన తొలి వ్యక్తి చతుర్వర్ణేతరుడైనా ఆ వ్యక్తికీ ఆ ప్రసాదం దానితో బాటు తీర్థం, శథరి ఇవ్వడం జరుగుతోంది. రెండవ వ్యక్తి బ్రాహ్మణుడైనా అతనికి కూడా ఆ ప్రసాదం, తీర్థం, శథరి ఇవ్వడం జరుగుతోంది. ఆ పని అపవిత్రమైన పనిగా భావించడం లేదు; శాస్త్రం, ఆచారం దానిని ఆమోదిస్తోంది. అలాగే క్రీ.శ. 900 ప్రాంతంలో నిర్మింపబడిన పల్లవ నిర్మాణరీతిలోని వేంకటేశ్వరుని తొలి ఆలయ ప్రాకారాన్ని క్రీ.శ. 1250 ప్రాంతంలో యాదవ వీర నరసింహరాయలు పగులగొట్టి ఆ రాళ్ళపై ఉండిన నాల్గు శాసనాల్ని ప్రస్తుతం ఉన్న ప్రాకారపు ఉత్తరగోడ రాళ్ళపై చెక్కించినా శాస్త్రం సమ్మతించింది. ఇక, ఆలయప్రాంగణంలోనే కృష్ణదేవరాయలు, ఆయన రాణులు, అచ్యుతరాయలు, ఆయన రాణి, కర్నాటక నవాబు, మంత్రి తోడర్‌మల్లు వంటి వ్యక్తుల శిల్పాలూ ప్రతిష్ఠించబడ్డాయి. తిరుచానూరు వేంకటేశ్వరుని తిరువిలన్ కోయిల్ నుండి తీసుకు రాబడినవిగా భావింపబడుతోన్న తిరుమంత్రశాలై పెరుమాళ్ (కొలువు శ్రీనివాసుడు), మలైకునియని నన్ పెరుమాళ్ (మలయప్ప) ప్రతిమలకు వేంకటేశుని ఆలయంలో క్రీ.శ. 1339 ప్రాంతంలో ఆశ్రయం ఇవ్వబడింది. ఒక సందర్భంలో తిరుమల గ్రామం తగులబడడంతో ఉగ్ర శ్రీనివాసునికి కోపం వచ్చినందున అలా జరిగిందని భావించి ఆయన స్థానంలో మలయప్పకు ప్రాధాన్యం ఇవ్వడం ఆరంభమైంది. ఇదే రీతిలో ముస్లింల దండయాత్రల నుండి రక్షించడంకై క్రీ.శ. 1320లో శ్రీరంగం నుండి తీసుకురాబడిన రంగనాథస్వామికి తిరుమలలో ఆశ్రయం ఇవ్వబడింది. రంగనాథుడు క్రీ.శ. 1320–1360 మధ్య, తిరుమలలోనే ఉండినట్లు తెలుస్తోంది. దీనిని శాస్త్రం ఆమోదించింది.

అచ్యుతరాయలైతే ఏకంగా ఆలయంలోనే పట్టాభిషేకం చేసుకొన్నాడు. భగవంతునికి అభిషేకం చేసే పాత్రతో తన అభిషేకాన్ని ఆచార్య పురుషునితో జరిపించుకొన్నాడు. ప్రధాన అర్చకుని ప్రక్కన పెట్టి సహస్రనామార్చన చేశాడు. విజయనగర ప్రభువుల కాలాన తిరువీధిసానుల, లేక దేవదాసీల విధానం తిరుమల ఆలయంలో పాటించబడింది. ఇవిగాక కాలక్రమాన పూజల్లో, ఉత్సవాల్లో, ప్రసాదాల్లో, అభిషేక జలం తేవడంలో (తొలుత పాపవినాశనం నుండి, తరువాత గోగర్భం నుండి, ఆ తరువాత బంగారుబావి నుండి) ఎన్నో మార్పులు చేర్పులు జరిగాయి. సౌర చంద్రమాన పంచాంగాన్ని ఆచరించే వారి కొరకు అధిక మాస ఏడాదిలో రెండవ బ్రహ్మోత్సవం నిర్వహించడం జరుగుతోంది. మహావిష్ణువు నివాసమైన వైకుంఠానికి ప్రతిరూపంగా భావింపబడే తిరుమల కొండపై అర్చావతార వేంకటేశ్వరుడు, ఆయన ఆలయం, అంటే, ఆయన నివాసం తప్ప, ఇతర ఆలయాలు, మానవ నివాస గృహాలు ఉండరాదని రామానుజాచార్యులు (క్రీ.శ. 1017–1137) ఆలయసేవకులు, భక్తులు తిరుపతిలోనే నివసించాలని, నిద్రించాలని నియమం విధించి అందుకై గోవిందరాజపేటగా పిలవబడిన తిరుపతి పట్టణాన్ని నిర్మింపజేశాడు. అయినా తిరుమలలో ఇతర దేవతా మందిరాలు, మానవుల శిల్పాలు, నివాస గృహాలు నిర్మింపబడుతూనే ఉన్నాయి. వాటిని శాస్త్రం సమ్మతిస్తూనే ఉంది. అలాగే భక్తులు ఆళ్వార్ తీర్థంలో (కపిల తీర్థం) స్నానంచేసి, ఆ తరువాత తిరుమల పుష్కరిణిలో మరో మారు స్నానమాచరించి వేంకటేశ్వరుని దర్శించుకోవాలని నియమమున్నా పాటించేవారే లేరు. పండితులతో బాటు, వేంకటేశ్వరుని దర్శించేవారు 32 సూత్రాల్ని పాటించాలని నియమమున్నా ఎవరూ పాటించడం లేదు. దానిని శాస్త్రమూ సమ్మతిస్తోంది. ఆ ఆలయం ఎదుట ఒకప్పుడు జంతు బలులూ ఇచ్చేవారు. ఇవిగాక, అంగ ప్రదక్షిణాల్ని సాంప్రదాయ సంబంధంలేని దుస్తులు ధరించడాన్ని ఏపండితుడూ ఆక్షేపించడం లేదు, శాస్త్రం కూడా సమ్మతిస్తూ ఉంది. అంటే, వేంకటేశ్వరుని ఆలయంలో చాందసస్థాయిలో శాస్త్రం అనుసరించబడడం లేదు. ఇప్పుడు ఆలయంలో మూవింగ్

## 'శ్రీకృష్ణ దేవరాయల 30,000 బంగారు నాణెలు :

# భక్తికి, విజయానికి [కృతజ్ఞతకు] చిహ్నాలు





శ్రీకృష్ణదేవరాయలు తెలుగు, కన్నడ, తమిళ ప్రాంతాలతో కూడిన త్రిభాషా సామ్రాజ్య పాలకుడు, అద్భుత వాస్తు నిర్మాణాల సృష్టికర్త. గొప్ప శిల్ప కళాఖండాల నిర్మాణాలకు కారకుడు, బహుభాషా, సాహిత్య పోషకుడేగాక, స్వయంగా తానూ బహు భాషా కోవిదుడు. అందుకే తిరుమల వంటి ప్రాంతాల్లో తన త్రిభాషా ప్రజల సౌకర్యంకొరకై ప్రతి శాసనాన్ని మూడు భాషల్లోనూ (తెలుగు, తమిళ, కన్నడ) చెక్కించాడు. త్రిభాషా సూత్రాన్ని పాటించాడు. ఉదయగిరి కోట స్వాధీన ప్రయత్నంలో విజయం సాధించినందుకు కృతజ్ఞతగాను, తన వీర భక్తిని చాటుకోవడానికి గాను జూలై 6, 1514న 30,000 బంగారునాణేలతో తిరుమల ఆలయంలో శ్రీవేంకటేశ్వరునికి 'కనకాభిషేకం' జరిపించాడు. ఈ విషయం 1998 నాడు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించిన శాసనాల మూడవ వాల్యూంలోని 68వ శాసనంలో ఉంది. వ్యక్తుల్లోని కృతజ్ఞతా స్థాయి, గుణస్థాయి, ఒకసమాజ నాగరకతా స్థాయిని తెలియజేస్తుంది అనే అర్థంలో రవీంద్రనాథ్ ఠాగూర్ తన 'గీతాంజలి'లో చెప్పిన 'గ్రాటిట్యూడ్ ఈజ్ ఎ సైన్ ఆఫ్ సివిలిజేషన్' అన్నమాటలు ఇక్కడ కృష్ణరాయల విషయంలో అగుపడుతుంది.

కృష్ణరాయల 30,000 నాణేలపై ముందువేపు ఆభరణాలంకారుడై 'పద్మపీఠం'పై నిలుచొని ఉన్న వేంకటేశ్వరుని ప్రతిమ, ఆయన వెనుక సాంప్రదాయ 'మకరణ తోరణం' ఉన్నాయి. నాణేల వెనుక భాగాన మూడు వరుసల్లో నాగరలిపిలో 'శ్రీ' 'కృష్ణరా' 'య' అని చక్రవర్తి పేరు ఉన్నది. ఈ నాణేలు చేతితో తయారుకాబడినవి. ఒక్కొక్క నాణెం ఒక 'వరహా' విలువ, 7.8 గ్రాముల బరువు, 18-20 మిల్లీమీటర్ల వృత్తం, 2 మిల్లీమీటర్ల మందం ఉండేవి. కృష్ణరాయల 30,000 వరహాలు ఆలయాభివృద్ధికి ఉద్దేశింపబడ్డాయి. వీటిలో 27 నాణేలు హంపి, దాని పరిసరాల్లో లభించాయి. ప్రస్తుతం ఇవి కర్ణాటక రాష్ట్ర మైసూరు మ్యూజియంలో భద్రపరచబడి ఉన్నాయి.

కృష్ణరాయల వారసులైన శ్రీరంగరాయలు, వేంకట రాయలు కూడా వేంకటేశ్వరుని ప్రతిమగల నాణేల్ని ముద్రింపజేశారుగాని, అవి కృష్ణరాయల వేంకటేశుని నాణేలవలె ప్రాచుర్యాన్ని పొందలేదు. క్రీ.శ. 1807లో బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ కూడా వేంకటేశ్వరుని వెండి నాణేల్ని ముద్రింపజేసింది. అయితే, ఇవి ఒక్కొక్కటి అర్ధ వరహా విలువగలిగి ఉండేవి. ఈ విలువ తెలుగు, తమిళ, ఇంగ్లీషు, పర్షియన్ భాషల్లో ముద్రింపబడి ఉంది.

ఫ్లాట్‌ఫాం ఏర్పాటు చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రయత్నిస్తోంది. ఈ యంత్రాలు, శబ్దాలు ఆలయానికి హాని చేస్తాయని, వృద్ధులు, పిల్లలు, అంగ వైకల్యులు వీటిపై నడవడం చేతగాక, పడి, రక్తపాతం జరిగే అవకాశాలున్నాయని తెలిసినా పండితులనబడే వారెవ్వరూ గట్టిగా ఆక్షేపించడం లేదు. అయితే ఇదే పండితులు ఆలయ హెరిటేజ్‌కి శాసనాలకు భంగం కలుగకుండా, పెద్ద గుడిగంట వద్ద తిరువిలన్ కోయిల్ తూర్పు - ఆగ్నేయంలో చిన్న ద్వారం నాలుగు అడుగులది ఏర్పాటుచేసి రెండింతలు సంఖ్యలో భక్తులు దైవదర్శనం చేసుకోవడానికి అనుమతించమంటే మాత్రం (రెండు వరుసల 'క్యూ' కొరకు) ఆగమ విరుద్ధమంటున్నారు. పైన వివరించిన మార్పులు చేర్పులన్నీ ఎలా శాస్త్ర సమ్మతమో వారికే తెలియాలి. శాస్త్రం ఆలయ వృద్ధికి భక్తుని ఆధ్యాత్మిక సంతృప్తికి దోహదపడాలే తప్ప ప్రతిబంధకం కారాదు. ఆలయంలో హెరిటేజ్ శాసనాలకు నష్టం లేకుండా చిన్న ద్వారం ఏర్పాటు చేసినంత మాత్రాన ఆలయ పవిత్రత, భక్తుల సంఖ్య

తగ్గిపోతాయని అనుకోవడం అవివేకం. శాస్త్రంలోలేని ఆర్జితసేవల విధానంతో భగవంతునితో వ్యాపారం చేస్తూ ధనార్జనే ధ్యేయంగా జరుగుతోన్న పాలన ఏ విధంగా సమర్థనీయమో పండితులే చెప్పాలి.

ఇక, దైవ దర్శనం సమస్య గురించి పరిశీలిస్తే, అన్ని రోజుల్లోనూ భక్తులందరికీ పదిగంటల సమయంలోపు దైవదర్శనం కల్పించవచ్చు. ఎలాగంటే; భక్తులు ఒకరి వెనుక మరొకరుగా ఒకే వరుసలో నడిచేట్లు చేసి (డివైడర్ల మార్పులతో, వంద అడుగులకు ఒక క్యూ మెయింటెయినర్ నియామకంతో) వరాహస్వామి మందిరం ముందునుండి మాత్రం రెండు వరుసలుగా నడుస్తూ - వరాహస్వామిని దర్శనం చేసుకొంటూ ముందుకు నడచి - తిరుమణి మండపం దక్షిణ ఆగ్నేయంలోని వెడల్పాటి ద్వారంగుండా తిరుమణి మండపంలోకి ప్రవేశించి (తిరుమణి మండపం తూర్పు ఆగ్నేయ, తూర్పు ఈశాన్య మార్గాలు అర్చకులు, వి.ఐ.పీ.ల రాకపోకలకు వదిలేసి) - తిరుమణి మండపం మధ్య భాగం నుండి భగవంతుని తృప్తిగా చూస్తూ ముందుకు నడచి - తిరువిలన్‌కోవిల్ లోనికి ప్రవేశించి - రామర్‌మేడై (రాములవారిమేడ) గడప దగ్గరకు వెళ్ళి - ఒక్క సెకండు భగవంతుని దగ్గరగా, తృప్తిగా చూస్తూ, ఆయనను దాటి - ఎడమ వైపుగా పయనించి - తిరువిలన్ కోవిల్ తూర్పు, ఆగ్నేయంలో ఏర్పరచబడు మూడున్నర అడుగుల ద్వార మార్గంలోంచి (పెద్దగంటను ఆరడుగులు ముందుకు జరిపి) ఆలయం బయటకు వచ్చి-ఇప్పటివలే బంగారుబావి, వకుళాదేవి యజ్ఞ మండపం మొదలైన వాటిని చూసుకొంటూ విమాన ప్రదక్షిణచేసి - హుండీలో కానుకలు సమర్పించి - నరసింహస్వామిని దర్శించి-లోపలి గోపురం ద్వారా ఇప్పటివలే వెలుపలి ప్రాంగణంలోకి వచ్చేట్లు చేయడం.

అయితే ఈ పద్ధతిలో జయవిజయుల మధ్యగల ద్వారం వద్ద నుండి రామర్‌మేడై గడప ఎడమవైపు చివరి భాగం లెవల్ వరకు ఒక అడుగు ఎత్తుగల చెక్క మార్గం ఏర్పరచడం వలన మాత్రమే ఎడమ వరుసలోని భక్తులు కూడా భగవంతుని తృప్తిగా చూడడానికి వీలౌతుంది. లేకుంటే రామర్‌మేడై వద్ద కుడివైపు వరుసలోని భక్తుల తలభాగాలు అడ్డుపడి ఎడమవైపు వరుసలోని భక్తులు భగవంతుని సరిగా చూడలేని పరిస్థితి ఏర్పడుతుంది.

ఈ పద్ధతిలో రామర్‌మేడై దగ్గర భగవంతుని దాటడానికి ప్రతి భక్తునికి ఒక్క సెకండు పడుతుంది. అయితే, రెండు వరుసల్లో భక్తులకు దర్శనం కల్పిస్తున్నందున ఒక్క సెకండుకు ఇద్దరు భక్తులు దర్శనం చేసుకోవడం జరుగుతుంది. అంటే నిలబడి ఉన్న ఒక మనిషిని ప్రక్క ప్రక్కగా నిలబడి ఉన్న ఇద్దరు వ్యక్తులు దాటడానికి ఒక్క సెకండు పట్టినట్లు అవుతుంది. దీని ప్రకారం:

| | |
|---|---|
| 1 గంట సమయంలో | 3,600 + 3,600 = 7,200 మందికి |
| 10 గంట సమయంలో | 36,000 + 36,000 = 72,000 మందికి |
| 15 గంట సమయంలో | 54,000 + 54,000 = 1,08,000 మందికి |
| 19 గంటల సమయంలో | 68,400 + 68,400 = 1,36,000 మందికి |

దర్శనం కల్పించవచ్చు. మిగిలిన సమయాన్ని భగవంతుని సేవలు, విశ్రాంతులకు, వి.ఐ.పీ.లకు కేటాయించవచ్చు.

ఇప్పటి విధానంలోనే ఒకరి వెనుక ఒకరు ఒకే వరుసలో నడిచేట్లు చేసి రామర్‌మేడై గడప దగ్గరకు వెళ్ళి - ఒక్క సెకండు భగవంతుని దగ్గరగా చూస్తూ ఆయనను దాటి వెనుదిరిగి ఇప్పటివలె ఆలయం బయటకు వచ్చేవిధానంలో కూడా ఒక గంటకు 3,600 మందికి, 15 గంటలకు 54,000 మందికి, 19 గంటలకు 68,400 మందికి దర్శనం కల్పించవచ్చు.

మొదటి విధానంతో బాటు క్యూ కాంప్లెక్స్ నుండి రామర్‌మేడై గడప వరకు ఒకే వరుసలో భక్తుడు వెళ్లడానికి పట్టే సమయాన్ని లెక్కించి, దానికి ఒక గంట సమయం కలిపి భక్తుడు 'క్యూ'లో ప్రవేశించేట్లు, బయోమెట్రిక్ విధానాన్ని లేదా కంకణ విధానాన్ని తిరుమలపై మాత్రమే అనుసరించేట్లు చేసి క్యూలో ఎక్కువ సమయం ఉండాల్సిన అవసరం లేకుండా చేయవచ్చు. ఆటోమేటిక్ బయోమెట్రిక్ కంకణ మెషీన్లు తిరుమలలో పలు ప్రాంతాల్లో ఏర్పరచవచ్చు. క్యూలో ప్రవేశించే వారిని కూడా ఆటోమేటిక్ చెకింగ్ ద్వారా క్యూలోకి అనుమతించవచ్చు.

అంతేగాక, నవాబుల కాలంనుండి అమలులో ఉన్న అన్ని ఆర్జిత సేవా టికెట్లు రద్దుచేసి, ఆయా సేవలు జరిగే సమయంలో గుడిలో ప్రవేశించిన భక్తులు చూస్తూ వెళ్ళేట్లు చేయవచ్చు. దీనివలన సేవా టికెట్ల అమ్మకాలలో జరుగుతోన్న అవినీతి, అక్రమాలు లేకుండా చేసి, ఆలయ ప్రతిష్ఠను కాపాడవచ్చు. శాస్త్ర ఆమోదంలేని ఆర్జిత సేవా టికెట్లు ఆపుదల చేసినట్లూ అవుతుంది.

# తెలుగు ముక్కల్లో కలుపు మొక్కలు

*- అవసరాల రామకృష్ణా రావు*

ఆమధ్య మన అసెంబ్లీలో ఓ సభ్యుడి అభిప్రాయ ప్రకటనలోని అసభ్యతకు అక్కడున్న మహిళలందరూ అభ్యంతరం చెప్పడం, అందరూ ఎరిగిందే. ఏదో సందర్భంలో ఆయన 'వృద్ధనారీ పతివ్రతా' అని ఉదహరించబోతే మహిళలందరూ ఎగిరి కంట్లోపడి ఆయన నోరు మూయించారు. శీలం అనేది స్త్రీలకే పరిమితం చేసి ప్రభవించిన పక్షపాతపు మాట అది. ఆ పదానికి పురుషలింగమనేది అవసరం పడలేదు గనక 'పతివ్రత' అనేది ఏకంగా భాషలోంచే ఎత్తి పారెయ్యాలనే స్త్రీ వాదం సబబే. భర్త ఆయుర్దాయంతో భార్య వ్యక్తిత్వాన్ని జమకట్టి ఏర్పడిన 'పునిస్త్రీ' లాంటి పదాల చుట్టూ ఉన్న సంప్రదాయాన్ని పాటించి, ఈ రోజుల్లో కూడా తరుణీమణులు తరించడం సహృదయులైన పురుషులు కూడా భరించలేని విషయం. భర్త చనిపోతే భార్యకి గుండు చేయించే సిగ్గుమాలిన ఆచారం ఇంకా గనక ఎక్కడైనా బతికుంటే ఆ కుటుంబ సభ్యులందర్నీ ఉరి తియ్యాలి.

మన తెలుగు భాషలో ఉన్న ఎన్నో సామెతలు ఆయా సందర్భాలకు నిలువుటద్దాల్లా పనిచేస్తూ హాస్య వ్యంగ్యాలతో పరిమళిస్తూ సంభాషణని సుసంపన్నం చేసేవి. జీవన విధానంలోని వివిధ రంగాలకి సరిపడే ఎన్నెన్నో సామెతలు ఆయా వ్యవహార శైలికి అందాలు అద్దుతున్నాయి. కాని తాగే నీటిలో, పీల్చే గాలిలో మనకి తెలీకుండానే కాలుష్యం కలసిపోయినట్టు మనం వాడే సామెతల్లో కూడా ఆడవారిని అవమానించే అనారోగ్య ధోరణి కనపడుతోంది. ఈ కలుపు మొక్కల్ని ఏరెయ్యడం మన తక్షణ కర్తవ్యం.

నాటినుంచీ నేటి వరకూ మగాడిదే పైచేయి గనక, పురుషాధిక్య ప్రపంచానికి పుట్టిన బుద్ధే ఇది. 'వృద్ధ నారీ పతివ్రతా'తో పాటు మరి రెండు సామెతలు చూద్దాం. 'ఆయనుంటే మంగలెందుకు?', 'వెధవముండకైనా వేవిళ్లు తప్పవు' అనే సామెతల్లోని క్రూర హాస్యం గమనించారా! దైన్య స్థితిలో ఉన్న సాటి స్త్రీని మరింత హైన్యానికి గురిచేసి, గేలిచేసే యిలాంటి పలుకుబళ్లని నిలువు గొయ్యి తీసి కప్పెట్టొద్దా?

ఏ టీవీ ఎపిసోడో చూడండి, ఏ సినిమాసీనో గుర్తు తెచ్చుకోండి. స్త్రీ, పురుషుల దుస్తుల విషయంలో స్పష్టమైన వివక్ష కనపడడం లేదా! పురుష పాత్రకి ఒంటి నిండా బట్టలుంటే, స్త్రీ పాత్ర నామమాత్రపు దుస్తులతోనే దర్శనమిస్తుంది. మీ కిష్టంలేకపోతే అటు వెళ్లొద్దు. కళ్లు మూసుకోండి. కాని నిత్యం ఇంట్లో వినపడే అన్యాయపు సామెతలు వినపడకుండా మూసుకోడానికి చెవులకి మూతలు లేవే! స్త్రీ పురుష వివక్షను ధ్వనిస్తూ స్త్రీ జాతిని కించపరచే సామెతలు చెవిన పడితే వినీ విన్నట్టు ఊరుకోవలసిందేనా?

సామాజిక దౌష్ట్యానికి బలై ఒళ్లమ్ముకు బతకవలసి వచ్చిన సాటి ఆడపడుచులమీద సానుభూతి లేదు సరికదా! 'రంకు నేర్చింది బొంకు నేర్వదా', 'సానీ సానీ నీ మొగుడు పోయాడంటే, ఏ వీధి వాడందిట' లాంటి సూటీ పోటీ సామెతలు నాగరకుల నోట రావలసిందేనా! 'వెర్రోడి పెళ్ళాం వాడంతటికీ వదిన', 'వండి పెట్టేందుకు వదినగారూ, వద్ద పరుండడానికి మరదలూ ఉండగా పెళ్ళెందుకురా పెదబాబూ!' లాంటి క్రూర పరిహాసాలు మనం రూపుమాపుకోలేమా!

అంతవరకూ ఎందుకూ, మన నిత్యవాడుకలోనే స్త్రీని నీచపరచి నేరారోపణ చేసే సామెతలు ఎన్నెన్నో కనిపిస్తాయి. 'చద్దెన్నం తిన్నమ్మ మొగుడాకలి ఎరగదు' అనే సామెత జస్టిఫికేషన్ ఏమిటో ఒక్కసారి ఆలోచించండి. మొగాడనేవాడు ఏ పనిలోకో పోతాడు. ఎప్పుడొస్తాడో తెలీదు.

*(మిగతాది 52వ పుటలో)*

అవసరాల రామకృష్ణా రావు, ఫోన్ : 9866221575




'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డి చిత్రించిన

# గ్రామీణ జీవితం

*- మండి అన్వర్ హుస్సేన్*

కృషీవలుల శ్రమను, శ్రమలో ఉండే అందాన్ని, ప్రకృతిలో అణువణువునా దాగి ఉన్న సౌందర్యాన్ని దర్శించి, వాటిని ఆర్ద్రతతో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించి తన అనుభూతిని కవితారూపంలో వ్యక్తపరిచినవారు, తేనె లూరెడి తియ్యదనంతో కూడిన శబ్దాలను సమకూర్చుకొని వివిధ రాగాలలో ఆలపించి, తన రాగామృతాన్ని ఆంధ్రదేశమంతటా వెదజల్లి 'కవికోకిల'గా ప్రసిద్ధిపొందినవారు దువ్వూరి రామిరెడ్డి.

వృత్తిరీత్యా వ్యవసాయదారుడైన రామిరెడ్డి గారి పాఠశాల చదువు చాలా తక్కువ. వీరు 1895 సంవత్సరం జనవరి 9వ తేది నెల్లూరు జిల్లా, గూడూరులో జన్మించారు. బాల్యంనుండి విజ్ఞాన శాస్త్రంలో జిజ్ఞాస కలిగిన రెడ్డిగారు రేడియో భాగాలను సమీకరించుకొని రేడియో తయారు చేయగలిగారు. దీనితో పాటు చిత్ర లేఖనం, శిల్పంలో కూడా ప్రతిభను సాధించారు. తన 19వ యేట కవిత్వాన్ని వ్రాయడం ప్రారంభించిన దువ్వూరి బహుభాషా కోవిదుడు.

స్వయం కృషితో సంస్కృతం, తమిళం, బెంగాలి, ఉర్దూ మొదలైన భారతీయ భాషలతో పాటు ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మన్ భాషలలో పాండిత్యం గడించారు. ఉమర్ ఖయ్యామ్ రుబాయిలను అనువదించడానికి పర్షియన్ భాషను కూడా నేర్చుకున్నారు. అందుకే కట్టమంచి రామలింగారెడ్డి గారు దువ్వూరి వారిని "ఏ ప్రోడక్ట్ ఆఫ్ హోమ్ యూనివర్శిటి" అని పేర్కొన్నారు. దువ్వూరి రామిరెడ్డి గారి రచనలలో ***కృషీవలుడు, నలజారమ్మ, యువక స్వప్నం, జలదాంగన, కడపటి వీడ్కోలు*** మొదలైన కావ్యాలతో పాటు ***నక్షత్రమాల నైవేద్యము, భగ్న హృదయము, పరిశిష్టము, ప్రథమ కవిత్వము*** వంటి ఖండకావ్యాలను ముఖ్యమైనవిగా పేర్కొనవచ్చు.

కాల్పనిక కవిత్వం వ్యవసాయక కవిత్వ (Pastoral Poetry) శాఖకు దువ్వూరి వారిని ఏకైక ప్రతినిధిగా పేర్కొనవచ్చు. వీరి ***వనకుమారి*** కావ్యంలో గోపాలుర జీవితం రసవత్తరంగా చిత్రించబడినది. తెలుగులో కృషీవలుల జీవితాన్ని ప్రధానాంశంగా గ్రహించిన మొట్టమొదటి కవిగా దువ్వూరి రామిరెడ్డి గారిని పేర్కొనవచ్చు.

***కృషీవలుడు*** కావ్యాన్ని రెడ్డిగారు 1919 సం..లో రచించారు. కవి ఒక కాపువాడు; కావ్యమందలి వస్తువు కృషీవలుల ముఖ్యంగా కాపుల, కాపు వారి స్త్రీ జీవనం. సూర్యోదయంనుండి సూర్యాస్తమయం వరకూ కృషీవలుల పనులు వారితో సమ్మేళవించబడిన ప్రకృతి వర్ణన ప్రధానమైన అంశాలు.

రెడ్డిగారి భావనాశక్తికి, సూక్ష్మ పరిశీలనకు ***కృషీవలుడు*** కావ్యం ఒక మంచి ఉదాహరణ. ఉదయాన్నే ఇంటి కప్పు పైన కోడి కూతలో సమయం అమూల్యమైనదనీ, నిమిషం వృధా చేయకుండా సోమరి తనాన్ని వదిలి నిద్రలేవమనే సందేశాన్ని గ్రహించాడు కవి. అందుకే ***ఓయి హాలికా యెంత ప్రొద్దాయె చూడు వింత నిదురేల*** అని మేలుకొలుపు పాడతాడు. ఉదయాన్నే ఇంటి కోడళ్ళు ఏ విధంగా ఇంటి పనులకు సిద్ధమౌతారో ఈ పద్యంలో వర్ణిస్తాడు.

**"అత్తల ఆడబిడ్డల భయం బొకవంకయు**
**గోర్కెవేరెడం జిత్తములాగ**
**గ్రొవ్వెదయు జీరయు వేసవరించి**
**తూగు మై మత్తున నున్న వల్లభుని**
**మంచము మెల్లన వీడి**
**దీనయై బిత్తరి కోడ లిల్వెడలె**
**వేకువ బ్రాచి పను ల్వొనర్పగన్" ...** అంటూ

డా. మండి అన్వర్ హుస్సేన్, ఫోన్ : 9440655230

కోడళ్ళ ఆత్రాన్ని భయాన్ని వర్ణించిన కవి వెంటనే ఆడ కూతుళ్ళు ఎంత గారాబంగా పెరుగుతారో వర్ణిస్తాడు. ***తెల్లవారింది లేవమ్మా*** అని తల్లి బుజ్జగించగా వేడి నీళ్ళు లేకుండా ఏవిధంగా పళ్లు తోముకోమంటావు అని జెబుతూ మంచం కూడా దిగదనీ గారాబ తీవ్రతను తెలియపరుస్తాడు. పెరుగు చిలుకుతున్న స్త్రీవర్ణన సహజత్వానికి అద్దం పడుతుంది.

**చెమరు ముత్యాలు చెక్కిళ్ళ జెదరి జార**
**పైట తెరవెన్క జమరి పోరాట మెసగ**
**గాజు నీలాలు మధుర నిక్వణము లొలయ**
**దధి మథించెడు కాంత గీతములు వినవొ.**

పాటలు పాడుకోవటం పల్లెప్రజల జీవనంలో ఒక భాగం పొలం పనుల్లో మునిగిపోయిన ఒక స్త్రీని, కొప్పులోని పూలరేకులు ఒక్కొక్కటి రాలిపడుచుండగా యవ్వనపు రొమ్ముపైని పైట గాలికి అటు నిటు కదలాడుచుండగా ఆమె పాడే జానపదగేయాలను విని బాటసారులు ఎగతాళి చేస్తున్నట్టు వర్ణిస్తాడు కవి. పల్లెప్రజలకు తెలిసింది శ్రమపడటమే. కష్టానికి తగిన ఫలితం తప్పకుండా దొరుకుతుంది. అలాగే కష్టపడకపోతే ఫలము దక్కదని స్పష్టంగా చెబుతాడు దువ్వూరి.



**శ్రమలు లేకయే ఫలములు దుముక బోవు**
**పిండి కొలదియె రొట్టె యొపిన విధాన**
**కష్టపడుము కృషీవలా, కలుగు సుఖము**
**ఉత్త యాసలకన్న మేలుద్యమంబు.**

ఊరకనే తిరగడంవల్ల ఫలితంలేదని పొలందగ్గర పనిచేసే తండ్రులకు సహాయం చేయమని రెడ్డి యువతకు సందేశం ఇస్తాడు. కాపువారు ఎల్లప్పుడూ పనిపాటలలో ఉంటారని ఊరకనే ఉండటం వారికి తెలియదని చెబుతాడు దువ్వూరి. ఇంటివద్ద స్త్రీ ఒక్కతే పనులు చేసుకుంటూ చంటి బిడ్డను సముదాయిస్తూ సంసార భారాన్ని మోస్తుంటుంది. ఆమెకు సాయంగా పని వారెవ్వరూ ఉండరు. కష్టపడే స్త్రీలను సంతోషపెట్టే బాధ్యత మగవారిదే.

**"మనపని చేసుకొన్న నవమానమే? ప్రాచిపనుల్వొనర్చుచున్**
**వనిత యతి ప్రయాసమున బర్వులిడం గనుగోవే? కావడిం**
**గొని సరసీ జలంబులను గోపముసేయక తెచ్చి ఇచ్చి కాం**
**తను బరితోష పెట్టుము వృథాచన వెప్పుదు నట్టి సాయముల్"**
అంటాడు.

కుటుంబం సవ్యంగా నడవాలంటే భార్య భర్తలు ఒకరికొకరు సహకరించుకోవాలని, ఇద్దరూ కలిస్తే బండి సరిగా నడుస్తుదని భార్యా భర్తలను రథ గుర్రాలతో పోలుస్తాడు, అవి వేరు వేరు దారులలో వెళ్ళాలని ప్రయత్నిస్తే బండి నడక ఆగిపోతుందని భార్యా భర్తల బాంధవ్యాన్ని తెలుపుతూ వెంటనే సంసారం సముద్రమని కష్ట, సుఖాలనే అలలనుండి మగవాన్ని గట్టు చేర్చే పడవ స్త్రీ అంటూ స్త్రీ ఔన్నత్యాన్ని కొనియాడుతాడు.

***కృషీవలుడు*** కావ్యంలో దువ్వూరి స్త్రీ శ్రమను వర్ణించే ప్రతిసారి ఎంతో సానుభూతితో ప్రవర్తిస్తాడు. త్యాగానికి కూడా ఒక హద్దుంటుంది స్త్రీలకు అందం, పాతివ్రత్యం కోరుకోదగిన వరాలు మరి ఎల్లప్పుడూ పనిలో మునిగి తేలుతూ మంచి చీర, రవిక ధరించాలని కూడా కోరుకోవు, కనీసం తలైనా సరిగా దువ్వుకో పని అంతంటూ ఉంటుందా అంటూ 360 రోజులు ఎప్పుడూ పనే నీకు విశ్రాంతి ఎప్పుడూ లేదా ఆ పనిలో ఒక్క నిమిషమైనా అలంకారానికి కేటాయించాలని ఆశ కలుగదా నీకు

**స్వాంతమున నీకు రామణీక పిపాస**
**యంతరించె నటంచు నేనను కాంతా**
**కాని, యెడలేని సంసార కష్టములకు**
**స్త్రీ ప్రకృతి బలి పెట్టుట చెల్లదమ్మా**

అని సంసారపు పనులలో పడి స్త్రీ తన సహజత్వాన్ని కోల్పోకూడదని బాధపడతాడు దువ్వూరి. అలాగని అనవసరపు కోరికలు పెంచుకోవడం వల్ల ప్రయోజనం ఉండదని, ధనికులు ధరించే ఆభరణాల కోసం ఆశపడవద్దు. ఆశకు అంతమనేది ఉండదు. భర్త అనురాగానికి భార్య నవ్వు చాలని ఆభరణాలు, అలంకరణలతో ప్రేమ పెరగదని బోధిస్తాడు.

సోమరి తనం నష్టదాయకం, కష్టపడితే బీడుభూములైన పంటలు పండుతాయని చెప్పే పెద్దల మాటలను అలక్ష్యం చేయవద్దని చెబుతాడు కవి. కృషీవలుల శ్రమలో జంతువులు కూడా సరిగా పాలుపంచుకుంటాయి. బాగా శ్రమించిన ఎద్దుల గురించి వర్ణిస్తూ మధ్యాహ్నం వరకూ శ్రమించి నోరెండి పోవడంతో నురుగు గక్కుతూ ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యడం లేదు. అదే విధంగా అలసిన రైతు పరిస్థితి ఎండ తీవ్రతను శరీరం చెమటలు కక్కి నీరసం ఆవహించి, చూపులు దీనంగా మారాయి, దప్పికతో నోరెండిపోయింది. అలాంటి

రైతు చెట్టు నీడలో విశ్రమించాడు. మరి ఈ విధంగా అలసిన రైతుకు ఇంటినుండి సద్దిమూట నెత్తిన పెట్టుకుని ఎండలో అలసి, సొలసిన పడతి తెచ్చిన మజ్జిగ అన్నం సరైన ఆహారమని దానినీ రుచిగా ఆరగించమని చెబుతాడు. ఆ వెంటనే ఇంటి దగ్గర పాలకోసం ఏడ్చే పిల్లవాడిని గుర్తుకు చేస్తాడు. పసివాడు నిద్రలేవగానే తల్లి కనిపించకపోవడంతో ఏడవటం ప్రారంభిస్తాడు. వెంటనే తల్లి చేయవలసిన కర్తవ్యాన్ని బోధిస్తాడు. ఇంటికి పోతూ మార్గంలో చెరువులోని పద్మాలను ఇంటికికొనిపోయి, పిల్లవానికి ఆడుకోవడానికి ఇచ్చి భర్త వచ్చేలోపు వంట చేయమంటాడు. పచ్చి తంగెడు కట్టెలు, తంగెడు గుత్తులు, తాటి ఆకులు పొయ్యిలో పెట్టి పొగలు రాగా ఊదితే కాని అన్నం ఉడకదు, ఆ పొగ, వేడికి కంట్లో నీళ్ళు రావడం ఖాయం. అంటూ ఇంటి పనిలో స్త్రీ పడే కష్టాలను, వంటచేసిన తర్వాత ముందు భర్త, పిల్లలకు పెట్టిన తర్వాతే తను తింటుంది అంటూ ఆమె ఔదార్యాన్ని గుర్తిస్తాడు. శ్రమ జీవిపై ప్రకృతి కూడా చిన్నచూపు చూస్తున్నట్టుగా గొడుగు లాగా వచ్చిన మేఘాల సమూహం గాలి తాకిడికి అవి కూడా చెదరిపోయాయని చెబుతూ ప్రకృతి కరుణించాలే కాని రైతుకష్టాలు తొలగడానికి ఎంతో సమయం పట్టదంటాడు. వ్యవసాయానికి ముఖ్యమైనది నీరు, అటువంటిది –

**త్రావ నీరైన దొరకని తరుణమందు**
**నిమిషమాత్రాన దొరువులు నిండిపోయె**
**నఖిల లోకాశ్రయుండు కృపామృతుండు**
**కన్ను తెఱచిన జరుగని కార్యమున్నె ?**

పల్లె ప్రజలు ముఖ్యంగా కాపువారు తమకెన్ని కష్టాలున్నా అతిథులకు ఎలాంటి లోటురానివ్వరు.

**ఉండి తిన్నను లేక పస్తున్న గాని/యాస చేయవు పరుల కష్టార్జితంబు**
**ఆకలెత్తగ నీపంచ కరుగు నతిథి/తినక, త్రావక పోయిన దినము లేదు.**

కృషీవలుడు కావ్యంలో ప్రతిచోట ప్రకృతి వర్ణన కనిపిస్తుంది. అనేకరంగులలో విరిసిన పుష్పాల వల్ల భూమి రత్నకంబలి లాగానూ, ఉదయపు సూర్య కిరణాలు సోకి తెల్లని పొగ మంచు మేఘాలు బంగారు వస్త్రంలాగానూ ఉండి చేత గీచిన చిత్రపటంవలే ఉందని,

అలాగే పొలం గట్టుపై ఉన్న గడ్డి కాడలపైన సాలె గూళ్ళపై పడిన తెల్లని మంచు, ముత్యాల వలే మైమరిపిస్తున్నాయి వాటిని అనవసరంగా తొక్కవద్దంటూ ప్రకృతిపై తనకున్న ప్రేమను వ్యక్తపరుస్తాడు దువ్వూరి.

నీ కష్టానికి ఈ సస్యమే ప్రతిఫలం కాబట్టి ఈ ప్రకృతిని నీవే రక్షించమంటూ రైతుకు బోధ చేస్తాడు. పొలం గట్టులు, కప్పల బెకబెకలు, ఆవుదూడ అరుపు, కోడికూత, బాలుర ఆటపాటలు, ఒక్కటేమిటి గ్రామీన జీవితంలో కనిపించే ప్రతి విషయాన్ని సహజంగా వర్ణించి కృషీవలుడు కావ్యానికి వన్నె తెచ్చారు దువ్వూరి రామిరెడ్డి. వీరి కవిత్వం పాత కొత్తలకు, ప్రాక్పశ్చిమాలకు మేలికలయికగా అందాలను అలవరచు కున్నది. శ్రమజీవియైన కర్షక జీవితం కవితావస్తువేనని నిరూపించారు దువ్వూరి రామిరెడ్డిగారు. మి

---

*49వ పుట నుంచి...*

## తెలుగు ముక్కల్లో కలుపు మొక్కలు

ఇంటెడు చాకిరీ చేసి అలసిపోయిన ఆడది, మొగుడికోసం కనిపెట్టుకు కూచోవాలా, చద్దెన్నమేనా తినకూడదా, ఆకలికి ఆడా మగా అంటూ ఉంటాయా!

ప్రత్యేక సందర్భాల్లో పుట్టిన ఇలాంటి సామెతల్ని జనరలైజ్ చేయడమేమిటని మీరడగొచ్చు. కాని లింగ వివక్ష స్పష్టంగా కనపడుతూంటే ఎలా ఊరుకోడం? 'మొగుణ్ణి కొట్టి మొగసాల కెక్కిందట' అనేది కేవలం ఆడదాన్ని గయ్యాళి తనం ధ్వనించడానికేనా! అటూ ఇటూ ఇద్దరూ భార్యలున్న దేవుళ్లని ఎంతో భక్తితో మనం పూజిస్తున్నాం. ఆడాళ్ళకి మాత్రం అందులో సమానత్వం మాత్రం పొరపాటున కూడా ఇవ్వం. 'పండుగనాడూ పాత మొగుడేనా!' అనే చురక వెయ్యడం మాత్రమే మనకి ఎరుక. ఆడాళ్లీనాడు ఉద్యోగాలూ చేస్తున్నారు, ఊళ్లూ ఏలుతున్నారు. యువతుల బాధలూ, బాధ్యతలూ మరింత పెరగడం చూస్తే ఇది ప్రగతిగతేనా అనిపిస్తోంది. సానుభూతితో సహకరించేలా మగసాయం అందకపోడమే దానికి కారణమేమో. మగువ మనసుని నొప్పెంటించే వందేళ్ల నాటి నీచర్థాల సామెతలకి ఇప్పటికైనా నిప్పటించలేమా!

ఓ వ్యక్తి శ్వాసకి ఇన్‌ఫెక్షన్ వస్తే అతనితోనే అంతం. భాషకి అలాంటిది సోకితే రాబోయే తరాలకి కూడా నష్టం. దేవీస్తోత్రాలూ, శక్తి పీఠ దర్శనాలతో భాషామతల్లిని నెత్తిమీద పెట్టుకుంటున్నామని ఎలుగెత్తి చాటీ మనం, మాతృభాషలోని అభ్యంతరకర పలుకుబళ్లని అవతలకి నెట్టి గౌరవ ప్రదమైన భాషను అలవరచుకోలేమా! మి

భావచిత్ర చయనిక

# ఏకాంతసేవ

*- వోలేటి పార్వతీశం*

**"... గీతాంజలి లాంటి ఒక మధుర భక్తి కావ్యం తెలుగులో లేకపోయిందే నన్న వెలితిని నివారించటం కోసం ప్రభవించిన భక్తి, భావోద్వేగాల మధుర కవితా వాహిని ఏకాంతసేవ. తెల్లార గట్ట పెళ్ళి వారిని లేపే మనోహరమైన సన్నాయి పాటతో పోలుస్తారు దీన్ని దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు ..."**
**- మధురాంతకం రాజారాం**

'మాట' మనసులోని భావాన్ని ఆవిష్కరించడానికి ఒక గొప్ప సాధనం. ఇంత గొప్ప సాధనాన్ని పదునెరిగి ప్రయోగించడం మన సామర్థ్యాన్ని తెలియజేస్తుంది. మాటకు చాలా ముఖాలుంటాయి. అందుకే ఒక్కొక్క మాట, ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క అర్థాన్ని ఆవిష్కరిస్తుంది. సరైన అర్థాన్ని మనకి స్ఫురింపచేయలేక పోయినప్పుడు ఆ మాట రసాభాసను కలిగిస్తుంది.

'ఏకాంత సేవ' అన్నమాట వినగానే చాలా మందికి ఆలయాలలో స్వామివారికి జరిపే అర్చనాదిక సేవలలో కట్ట కడపటన జరిపే పవళింపు సేవ జ్ఞప్తికి వస్తుంది. కానీ సాహిత్యంలోని ఏకాంత సేవ వేరు.

సాహితీ ప్రపంచంలో 'ఏకాంతసేవ' పేరును ఉటంకించ గానే మనకి ఒక కవిద్వయం స్ఫురణకు వస్తుంది. ఆ కవిద్వయమే, కవికులాలంకారులు, కవిరాజ హంసలు, శ్రీ వేంకటపార్వతీశ్వర కవులు, బాలాంత్రపు వెంకటరావు, వోలేటి పార్వతీశం అనే ఇరువురు కవులు జంటగా కలసి యుగళంగా ఆలపించిన మధురభక్తి ప్రధానమైన కావ్యం 'ఏకాంతసేవ.'

భావ కవితా ప్రతిష్ఠాపకులై వెలిగిన కవి చక్రవర్తి దేవులపల్లి ఈ కావ్యపరిచయంలో "ఆంధ్ర సారస్వత చరిత్రలో ఒక నూతన శకము ప్రారంభమైంది. క్రొత్త కవులు బయలు దేరినారు. వీరు ప్రాతకవుల వంటి వారు గారు. గాన మొనర్చుచున్నారు. విషయములో మార్పు, రీతిలో మార్పు, స్వరములో మార్పు. ఔను కాలము మారినప్పుడు కాలముతో పరిస్థితులన్నియు మారినప్పుడు, కవిత్వము మారకుండునా?" అంటూ ఈ నవ్యమార్గానికి ప్రస్తావన చేస్తారు. అంతేకాదు నవ్యకవులకు స్వేచ్ఛ ప్రాణమని, సంకెలలో సంగీతం, కట్టుబాటులో కవిత్వం వీరికి బొత్తిగా గిట్టని విషయాలని స్పష్టం చేస్తారు. యశము కోసమో ధన ధాన్యాదులపైన ఆశచేతనో ఈకవులు రచన చేయరు. ఇతరులు ఆనందిస్తారా? లేదా? అన్న మీమాంస వీరికి లేదు. కవనం వీరికి ఊపిరి కనుక పీల్చుట, విడుచుట సాగిస్తారు. అంతకుమించి, వీరికి ఏ ఆత్రుతా వుండదు. వీరు ప్రకృతికి బిడ్డలని తీర్మానిస్తారు.

సరళమైన భావాన్ని, సరళమైన భావాల్లో పలికించడం, తెలుగు నుడికారపు సోయగాలను కవనానికి తీర్చటం, ఛందస్సును భావానికి అనుగుణంగా కూర్చడం, ఇవన్నీ వేంకట పార్వతీశ్వర కవుల ప్రత్యేకతలు. 'నక్కదోస' 'సూర్యకాంతం,' ఇటువంటి శీర్షికలతో, ఆత్మాశ్రయ ధోరణిలో కవితాఖండికలను అందించిన జంటకవులు వీరు. ఒక రకంగా చూస్తే ఇటువంటి కొన్ని కవితారీతులకు, ప్రక్రియలకు ఈ కవుల జంట ద్వారాలను తెరిచింది. బహుశా ఈ కారణంగానే అనుకుంటాను టేకుమళ్ళ రాజగోపాలరావుగారు, కావ్య కుసుమావళి పీఠికలో నాటి ఆధునిక యుగాన్ని 'వేంకట

డా. వోలేటి పార్వతీశం, ఫోన్ : 9440031213

పార్వతీశ్వర కవుల యుగం'గా అభివర్ణించారు. ఇలా అసమాన ప్రతిభా సంపన్నులుగా వన్నెకెక్కిన జంటకవుల ఖండ కావ్యం 'ఏకాంతసేవ'ను మరింత చేరువగా పరికిద్దాం. దీని రచనా కాలం 1922 ప్రాంతం. కాకినాడలో "ఆంధ్ర ప్రచారిణీ లిమిటెడ్" అనే ప్రచురణ సంస్థ వుండేది. ఆనాటి ఆధునిక సాహిత్యాన్ని 'నవ్యసాహిత్యమాల' పేరుతో పరంపరగా ప్రచురించేది. ఆ ధారావాహిక ప్రచురణల్లోని తొలి పుష్పం 'ఏకాంతసేవ' అనే ఈ పుస్తకం.

మనకి అనేక రకాలు భక్తి మార్గాలున్నాయి. జ్ఞానభక్తి , మధురభక్తి, వైరభక్తి ఇత్యాదులన్నీ ఈ భక్తిమార్గాలలోని భాగాలే. సాక్షాత్తూ ఆ భగవంతుడినే తన ప్రాణనాథుడిగా లేదా ప్రియునిగా భావించుకుని, తనను తాను ప్రేయసిగా ఊహించుకోవడం, ఈ మధురభక్తిలోని భాగమే. ఈ నేపథ్యాన్ని గమనించి మనం, ఏకాంతసేవ ఖండకావ్యాన్ని మధుర భక్తి మార్గానికి చెందిన కావ్యంగా పరిగణింపవచ్చు. నిజానికి ఈ మధుర భక్తి మార్గాన్ని జంటకవులు ఎంచుకోవడం వల్లనే, ఏకాంతసేవకు అఖండమైన జనామోదం సమకూరింది. అంతేకాదు, అద్యతనాంధ్ర సాహిత్యంలో ఈ ఏకాంత సేవ కావ్యం మధుర భక్తి కవిత్వానికి ఒక చక్కని ఉదాహరణంగా ఈ నాటికీ నిలచి వుంది.

వేంకట పార్వతీశ్వర కవుల కవిత్వంలో మనకి ప్రధానంగా కనపడే కవిత్వ లక్షణం భావనాశక్తి (ఇమాజినేషన్) అంటే సూక్ష్మీకరణం చెందిన బుద్ధికుశలతకాదు. ఈ భావనాశక్తి అంతకంటే గొప్పది. ఎంత గొప్పది అంటే, కనపడని వస్తువులను చూడగలదు, వినిపించని ధ్వనులను వినగలదు ఈ విశాల విశ్వంలో మనం ప్రయాణించలేని ప్రాంతాలకు కూడా ప్రయాణించగలదు ఈ భావనా శక్తి.

పరమాత్మలో సంలీనం కావడానికి జీవాత్మ పడే సంవేదన నేపథ్యంగా రూపుదిద్దుకున్న 'ఏకాంతసేవ' కావ్యాన్ని పరిచయం చేస్తూ శ్రీ పెద్దాడ రామస్వామి గారు– "Instances where the human soul in its Godless march has been unsuspectingly arrested by the aggressive grace of God which, dancing in the beauty of a flower or darting through the flash of lightening smilling on the cheeks of a baby or beaming through the tears of a mother…" అంటారు.

ఈ భావ సౌందర్యానికి అద్దం పడుతుంది ఏకాంతసేవ.

"ఈ జంటకవుల భక్తిని తాత్త్విక ప్రణయావేశంగా చెప్పుకోవచ్చు. దాస సంప్రదాయం, ప్రపత్తి, సేవ్య సేవక భావం, ఈ ఏకాంత సేవలో మనకు ప్రచలితంగా కనిపిస్తాయి" అంటారు డా. అక్కిరాజు సుందర రామకృష్ణ.

**"దివ్యమంగళ మూర్తివి నీవు, దీప్తిని నేను**
**సర్వమంగళ నేను, శంభుడవీవు**
**నీకు దక్కితి, నాకు నీవు దక్కితివి**
**ఎందాగెదవింక హృదయాధినాథ!"**

ఈ జంట కవులు ప్రణయ సౌందర్య లీలామయియైన ప్రకృతి కాంతని ప్రేమిస్తారు, ధ్యానిస్తారు, ఆరాధిస్తారు.





అందుకనే, వేంకట పార్వతీశ్వర కవులు ప్రకృతిని వదలి పెట్టలేక పోయారు. ప్రకృతిలో లీనమై పోయారు. ప్రకృతిలో తాదాత్మ్యం చెందారు.

**"తూరుపుఁగోనలో దుందుభి స్వరము**
**వీణాస్వనంబులో వినరాకయుండె**
**నందనవనములో నాగస్వరంబు**
**నూదకే కోకిలా యెుక్కింత సేపు"**

ప్రియురాలగు భక్తుడు, ప్రభాత సమయాన హృదయేశ్వరుని గూర్చి కోయిలయై గొంతెత్తిపాడటం, కలకంఠి అవశయై ఉన్నపుడు, కనుమరుగైన కల్యాణమూర్తిని పట్టి తేవడానికి ప్రణయ వనంలో, పుష్ప రథంలో భ్రమరం తోడుగా బయలుదేరటం, చెక్కుచెదరని చిత్తంతో, స్వామిని అర్చించడానికి పూజాద్రవ్యాలతో సంసిద్ధురాలై ఉండటం, యుగయుగాలనుండీ సాగే అనంత విశ్వగానాన్ని ఆమె పాడిందేపాటగా పాడటం, ఇదీ ఏకాంతసేవలోని కావ్యవస్తువు.

**"ఆకసంబుననైన, నవనిపై నైన**
**జలద పంక్తులనైన, జలరాశినైన**
**ఘోరాటవులనైన, గొండలనైన**
**నెదురుగాడ్పులనైన, నెండలనైన**
**ద్రోవదప్పకయుండఁ, దూలిపోకుండ**
**నరదంబు ద్రిప్పునీ, యలవాటుమెఱయ**
**బ్రణయవనంబులోపలి పుష్పరథము**
**తుమ్మెదా! వేవేగ తోలి తేవమ్మ!"**

నిరుపమానమైన భక్తి ప్రపత్తుల చేత, భగవంతుణ్ణి ప్రసన్నం చేసుకుని, ప్రత్యక్షం చేసుకున్న భక్తుల కథలు మనకు తెలుసు. ఆయా సందర్భాలలో భక్తుడు, భగవంతుణ్ణి సంస్తుతి చేస్తూ దండకాలు చదివిన సన్నివేశాలు మనకి తెలుసు. అలాగే భగవంతుడు ప్రత్యక్షమైన మరికొన్ని సన్నివేశాలలో ఆయనను ప్రసన్నం చేసుకోవడానికి దేవతలూ, భక్తులు వంటి వారంతా, స్తోత్ర పాఠాలు చేసిన సన్నివేశాలు మనకి తెలుసు. నిజానికి భాగవతంలో ప్రహ్లాదచరితంలో నారసింహుడు ప్రత్యక్షమైనపుడు బ్రహ్మదేవుడంతటి వాడే –

**మ. "ఘనలీలా గుణ చాతురిన్ భువనముల్ గల్పించి, రక్షించి, భే**
**దనముంజేయు దురంత శక్తికి ననంత జ్యోతికిం జిత్ర వీ**
**ర్యునికిన్ నిత్య పవిత్ర కర్మునికి నేనుత్కంఠతో నవ్యయా**
**త్మునికిన్ వందన మాచరించెదఁ గృపాముఖ్య ప్రసాదార్థినై"**

అని సన్నుతి చేశాడు. కానీ ఆధునిక కాలం వచ్చే నాటికి, భగవత్సందర్శన కాలంలోని అనుభూతులు అనేక నూతన కోణాలను ఆవిష్కరించాయి. ఉదాహరణకి, కృష్ణశాస్త్రి శబరిని మనం పరిశీలిస్తే రాముడు వస్తున్నాడన్న వార్త విని ఆమె ఎంతో ఆత్రుత పడుతుంది. శబరిలోని ఒక గొప్ప ఆరాటం మనకు ద్యోతకమౌతుంది.

**"అసలే ఆనదుచూపు**
**ఆపై ఈ కన్నీరు**
**తీరా దయచేసిన**
**నీ రూపు తోచదయ్యయ్యో!"**

అక్కడ భక్తురాలి ఆరాటం అలా వుంది. ఇక ఏకాంతసేవలో ఈ కోణం మరింత వినూత్నంగా వుంటుంది. పరమాత్ముడు వచ్చాడు. కానీ, ప్రణయినిగా వున్న జీవాత్మ అది గమనించనే లేదట. ఆ పారవశ్యం చెదరిన తర్వాత ఆ భక్తురాలి పరితాపం గమనించండి.

**"విరిదండ మెడలోన, వేయుటే గాని**
**కన్నార నీ మూర్తిఁ! గాంచనే లేదు**
**ప్రణమిల్లి యడుగుల! బడుటయే కానీ**
**చేతులారఁగ సేవ, చేయనే లేదు**
**నిను గాంచి ముగ్ధనై, నిల్చుటే గాని**
**ప్రేమ దీరఁగ బల్క, రింపనేలేదు**
**ఏమేమొ మనసులో, నెంచుటే గాని**
**తిన్నగా నా కోర్కె, తెలుపనేలేదు**
**..... ..... ..... ..... .....**
**ఆనంద మందుటే, యపచారమనుచు**
**నవశనై యుండుటే, యపరాధమనుచు**
**మదినెంచి యీ రీతి, మాయలు సేయ**
**భావ్యమై తోఁచెనె, ప్రాణేశనీకో"**

ఇలా ఆ భక్తురాలు పరితాపం చెందుతోంది. నిజంగా స్వామి ప్రత్యక్షమైనపుడు, కంటికి తోచని, తనస్థితి నుండి తేరుకొని తర్వాత అవలోకనం చేసుకుంటే, ఏవో కొన్ని సంకేతాలు –

**"అలరు నెమ్మేన జందనఁ, మలదినట్లు**
**కనుల గపురంపుఁ గాటుక, నునిచినట్లు**
**చెవుల నమృత రసంబును, జేర్చినట్లు**
**జిహ్వపైఁ దేనె సోనలఁ, జిలికినట్లు**

ఘ్రాణములఁ గమ్మతావులు, గ్రమ్మినట్లు
ఆత్మకేమేమొ యుద్బోధ, మగుచునుండె
..... ..... ..... ..... ....."

ఏది ఏమైనా, తన వద్దకు కదలి వచ్చిన పరమాత్మను కనులారా చూచుకోలేని జీవాత్మకు పరితాపం పెరిగిపోయింది. ఎలాగైనా సరే, స్వామిని మళ్ళీ కనులారా చూచుకోవాలనే కాంక్ష పెరిగిపోయింది. భక్తురాలైన ఈ ప్రియురాలికి కలిగిన స్వామి సందర్శన కాంక్ష, మంచి చెడులను ఎంచి చూడనీయలేదు. అందుకే దూతికను ప్రలోభ పెట్టింది. ఆ ప్రలోభ పెట్టిన వైనం ఎలా వున్నదో గమనించండి.

"శోభనాంగుని నాకుఁ, జూపెదవేని
విరిదమ్మిమేడ నీ, విడిదిగావింతు
గుణ నిధానుని నన్నుఁ, గూర్చెదవేని
పొగడపూదోట నీ, పొలముగావింతుఁ
జెలువు సంధ్రుల నన్నుఁ, జేర్చెద వేని
సురపొన్న వనమునీ, సొమ్ము గావింతు
నిఖిలేశ్వరుని చెంత, నిలిపెద వేని
కల్పవల్లిక నీకుఁ, గాన్కగావింతుఁ"

*"కనరాని దేవుడే కనిపించినాడే"* అని పాడుకోవడ మంటే, సులభ సాధ్యమైన విషయమేమీ కాదు. ప్రలోభాలకు లొంగిపోయిన దూతిక తిరిగి స్వామి సమక్షాన్ని ఏర్పాటు చేయగలిగితే, ఒకవేళ ఆమె మళ్లీ ఆ పరమాత్మను తీసుకుని వస్తే 'అమ్మో' ముందు కలిగిన పరితాపం గుర్తుకొచ్చింది.

"కల్యాణ విభుసేవఁ, గావించువేళ
నేమి చేయఁగబోయి, యేమి చేసితినో
ప్రాణనాయకునితో, భాషించువేళ
నేమి చెప్పఁగబోయి, యేమి చెప్పితినో?
విశ్వమోహన మూరితిని, వినుతించు వేళ
నేమి పాడగబోయి, యేమి పాడితినో?
ప్రణయస్వరూపిని, ప్రార్థించువేళ
నేమి వేడగబోయి, యేమి వేడితినో?"

అటువంటి పారవశ్యమేదో మళ్లీ వచ్చే అవకాశం వుంది కదా! కనుక ఆ ప్రణయిని

"ఆవశనై చేసిన, యపచారమునకు
గుణ నిధానుండిట్లు, కోపింపనగునె?
నాయవస్థలనెల్ల, నామీరుగాగ
జీవితేశ్వరునితోఁ, జెప్పుదుగాని
ప్రణయవనంబులో, పలి పుష్పరథము
తుమ్మెదా! వేవేగ, తోలి తేవమ్మ!"

అంటూ ఆ భ్రమరాన్ని బతిమలాడుతోంది. ఇలా భక్తి పారవశ్యంలోని వినూత్నమైన భావవీచికలు ఈ ఏకాంతసేవ నిండా వీస్తున్నాయి.

జంటకవుల హృదయ సీమల్లో ఊపిరి పోసుకున్న ఈ మధుర భక్తి కావ్యం, అక్షరాల వలువలు తొడుక్కుని, దాదాపు తొమ్మిది పదుల వసంతాలకు చేరువ కావొస్తోంది. అష్టపదుల వయస్సు దాటి, ఈ ఏకాంతసేవ తొమ్మిదవపడిలో అడుగుపెట్టినా, నిత్యనూతనమైన భక్తిభావాల నవ్యవీచికల కారణంగా, ఇప్పటికీ యవ్వనారంభదశలోనే వుంది. ఈ కావ్యమంతా పరుచుకొని వున్న భావచిత్రచయనికలు, మధుర భక్తి వర్ణాలను వర్షిస్తూ రసప్లావితం చేస్తుంటాయి.

ఈ కావ్యానికి వ్రాసిన పీఠికలో దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు అన్నట్లు – *"వంగభాషకు రవీంద్రుని గీతాంజలి యెట్టిదో మన యాంధ్రమున కీ మహాకవుల, భక్తుల 'ఏకాంతసేవ' అట్టిది."* మి

---

"పిచ్చివాడా! తెలియనివాళ్ళు పిచ్చి ప్రశ్నలు వేస్తే, నావంటి తెలిసినవాళ్ళకు కోపం వస్తుందనుకున్నావా యేమిటి? అడిగినావు గనుక మాకూ, మీకూ వుండే భేదం చెబుతాను విను. మీరు పుణ్యం వస్తుందని నదులలోనూ, చెరువులలోనూ, బురదనీళ్ళ లోనూ మునుగుతారు. మేము శుభ్రమైన నీళ్ళలో కాని స్నానము చెయ్యము. మీరు దేవుళ్ళని రాళ్ళకూ, కర్రలకూ మ్రొక్కుతారు. మేము ఒక్కదేవుణ్ని ధ్యానము చేస్తాము. మీరు శూద్రులు మొదలైన వాళ్ళు ముట్టుకుంటే మయిలపడతామని దూరంగా తొలగుతారు. మేము శుచిగా వుంటే యెవరినైనా ముట్టుకుంటాము. మీరు చేదస్తం చేత ఇవి తినకూడదూ, అవి తినకూడదని మానుతారు. మేము దేహారోగ్యానికి అనుకూలమైనవన్నీ పుచ్చుకుంటాము. మీరు నోములు, వ్రతాలూ, ఉపవాసాలు చేస్తారు. మేము అవన్నీ పిచ్చి అని మానివేస్తాము. మీరు చెప్పులు తొడుక్కుని, బిల్లగోచీలు పెడతారు. మేము బ్యాట్సు, కోట్లూ మొదలయినవి వేసుకుని దొర్లవలె వుంటాము. ఇలాంటి వ్యత్యాసాలు మీకూ, మాకూ లక్ష వున్నవి."

**– కందుకూరి వీరేశలింగం**

# జీవితతత్త్వం

31.10.86

ప్రియవసు,

నీవు హిమాలయాలనుండి తిరిగి
వచ్చి మానసిక ప్రకంపనలతో
వ్రాసిన 28వ తేదీ ఉత్తరం నిన్న
అందినది. చదివి అందులోని వెలు
గు నీడలను అవగాహన చేసు
కొన్నాను.

ప్రధాన విషయం, నీవు అక్కడ
ఏమి విన్నావో, ఏమి అర్థం చే
సుకొన్నావో కంటే ఏమి
చూచావో అదేది ముఖ్యం.
ఆ ప్రాంతం అంతా నేను చూ
చినదే. ధౌలధార పర్వతమా
ల నీడలోనే నేను కొన్ని
దినాలు సంచరించాను.

ఆ హిమాచలప్రదేశం నేలలో
భావతన్మయం కలిగించునం
దుకు అభినందనలు. అక్కడ
నీకు నీ తావి కంటే నీకన్న
ఎక్కువ మేలు కలిగించింది.

ఒక విషయంలో నేను సమన్వ
యం కలిగించుకోలేక
పోతున్నాను. ఆంజనేయ
విగ్రహం, శివలింగాలు మొద
లైన వాటికి గీతాతత్వా
నికి సంబంధం ఎట్లా కుది
రిందా అని!

చిన్మయానందను గురించి
వినటమే కాని ఆయన్ను నేను
చూడలేదు. చూడని వ్య
క్తిని గురించి మంచిగా కాని
చెడ్డగా కాని నిర్ణయించటం
మూర్ఖుని లక్షణం. అట్టి

మూర్ఖుణ్ణి కాదలచలేదు. ఆయన
గొప్ప పండితుడని తెలుసు. పాం
డిత్యం మాత్రమే ఆధ్యా
త్మిక జ్ఞానానికి కొలబ
ద్ద కాదు.

నిజం చెప్పాలంటే నాకు నేటి
స్వామీజీల పైనా, వారి బోధల
పైనా అంతగా ఇష్టం ఉండదు.
వారిలో ఎక్కువ భాగం కాం
తదాసులు, కనకం దాసులు
కాకపోయినా గొప్పగా
కీర్తిదాసులు, ప్రశంసాదాసులు.
ఎంత గొప్ప స్వామీజీ అయి
నా, ప్రసంగం బాగా
లేదు అంటే ఎంతో కోపం
లో తాపతప్తులవుతారు.
ఏవైతే పనికిరావని ఇతరులకు
బోధిస్తారో వాటినుండి
స్వయంగా వారే నివృత్తులు
కాలేకపోతున్నారు.

ఇక గీత విషయం. గీతాతత్వం
మీద నాకు వెర్రి మమకారం
లేదు, నిందాభావం లేదు.
అన్ని హిందూ ధార్మిక
గ్రంథాలలో అది ఒకటి. అందు
లో ఉన్నది మనకు తెలియంది
కాదు, అందులో లేనిది మన
కు తెలిసింది కాదు.

ఇవన్నీ నా స్వంత అభిప్రా
యాలు మాత్రమే, నా
స్వతంత్ర అభిప్రాయాలు
మాత్రమే. ఇవి మాత్రమే
చెల్లవలసినవనీ, ఉత్తమ
మైనవనీ నేను అనను.

*అముద్రిత లేఖ, సేకరణ :* జె.ఎస్.ఆర్. చంద్రమౌళి, ఫోన్ : 9848043334

ఎవరి స్వీయ దృక్పథం వారిది, ఎవరికి ఇష్టమైన మార్గం వారిది. దార్శనిక విషయాలలో నా బాట ఒక పాటలాంటిది, ఆటలాంటిది, సార్వజనిక మార్గం కంటే ఇష్టమే మార్గం. అందులో కొంత జ్ఞాన విజ్ఞానం ఇమిడి ఉంటుంది.

కాని మామూలు ఆటలా కాక అలవాట్ల మాదిరిగా ఉంటుంది.

ఉదాహరణకు, నీవు నీ ఉత్తరం పైన 'శ్రీ' అని పెడతావు. నేను పెట్టను. అది పెట్టకపోతే నీకు ఏదో లోపంగా తడుతుంది. పెట్టకపోతే నాకు లోపంగా తట్టదు. అదిగాక పెట్టేవాళ్ళని తప్పు అని నేను నిందించను. నేను పెట్టను. అంతే. నిన్ను పెట్టవద్దని చెప్పను.

నా తత్వం ఇదివరలో చాలా వరకు నీకు తెలుసు. అదే జీవన తత్వం; Philosophy of Life. ఇటువంటిదే నాకు మాత్రమే మార్గం అనను, నాలాంటి ఇంకెందరికో కూడా అది మార్గం. ధార్మిక గ్రంథాలను, గురువుల ఉపదేశాలను, తార్కికవాదాలను వదలిన మార్గం. అదే స్వేచ్ఛా మార్గం, రసమయ మార్గం, తన్మయతా మార్గం; బాధ నుండి బోధను గ్రహించే మార్గం; భయం నుండి అభయం వైపు పయనించే మార్గం.

ఇవన్నీ కొంత అహంకారపు మాటలుగా వినిపిస్తున్నాయి కదూ! వినిపించటమే కాదు యథార్థానికి అవి అహంకారాన్నుండి బయటపడే మాటలు!

నీ పామూరుల ప్రదేశ నివాసంలో గీతా మహోపన్యాసాన్ని విని ఏదో కొంత మానసికమైన ఆనందం పొందినట్లు వ్రాశావు. సమాజంలోని స్థిత తత్వానికి అటువంటి వ్యక్తిమైన, ఆడంబరమైన శబ్దజాలాత్మకమైన, పునరుక్తి ప్రధానమైన, Professional Preachers నుండి ధ్వనించే ఉపన్యాసాలు కొంతవరకు వింతగా తడతాయి.

అయితే నీ సుకుమారమైన హృదయం ధ్యానం ద్వారా, ప్రకృతి లావణ్యం ద్వారా, కరుణ ద్వారా, ప్రేమ ద్వారా, సానుభూతి ద్వారా, కవితానుభూతి ద్వారా, ఇంద్రధనుస్సులోకంలో మానసికంగా సంచరించటం ద్వారా, నిరాతీతమైన ఆత్మను పరమ ప్రియతమంగా తన్మయభావంలో ప్రేమించటం ద్వారా, శరీరాన్ని యంత్రమని భావించని జాగృతి ద్వారా అభయాన్ని, స్వేచ్ఛను, ఆనందాన్ని అందుకో ప్రయత్నించు.

సులోచన తన జ్ఞాపకాలు అందిస్తోంది.

మిత్రులూ, ఇష్టులూ.

ప్రేమ,
సంజీవదేవ్

# తెలుగు రుబాయీలు



జీవితం పంచుకోవడం తేలిక కాదు
పువ్వులు అల్లగానే మాలిక కాదు
తరతరాల వేదన తప్పుతుందా తపస్వీ!
ఈకలు రాలకపోతే హంస తూలిక కాదు.

పులి లేకపోతే అడవికి హద్దు లేదు
చలి రాకపోతే వెచ్చని ముద్దు లేదు
చీకటి మంచుముద్దలా కరగకపోతే
ఉదయానికి అందమైన పొద్దులేదు.

అప్పుడప్పుడు కోతినై పుట్టాలనిపిస్తుంది
చప్పుడు చేయకుండా చీమనై కుట్టాలనిపిస్తుంది
నిజం చెబితే నమ్మరుగాని పట్టాభిరామ్!
బట్టతలకు గట్టి పోనీటెయిల్ కట్టాలనిపిస్తుంది

పాడె మోయడానికి నలుగురు కావాలి
పంట కోయడానికి నలుగురు కావాలి
ఒక్కడివే ఎంతకాలం పోరాడతావ్ అక్కిరాజూ!
పోరు చేయడానికి తోడు నలుగురు కావాలి.

ఎంత బయట తిరిగినా గృహమే కదా స్వర్గసీమ
సొంతయింటిలోనే సుఖిస్తుంది చీమ
ఇల్లువిడిచి పిట్టలాగ తిరగవద్దు ఇక్బాల్!
ఉన్నంతలో హాయిగా జీవితాన్ని గడపలేమ?

ఆవు కళ్ళముందే దూడపోయింది
రేవు విడిచిపెట్టి ఓడపోయింది
విడమర్చి చెప్పాలంటే కష్టమే విన్నకోటా!
మట్టి విడిచిపెట్టి మనిషి జాడ పోయింది.

సంపద లేనప్పుడే సంతోషంగా ఉన్నాను
ఉన్నదాంతోనే ఎంతో ఉల్లాసంగా ఉన్నాను
కళ్ళునెత్తికెక్కి చూస్తే ఏముంది కనకయ్యా!
డబ్బు గడ్డి తింటూ ఉబ్బసంగా ఉన్నాను.

వయసులో ఉన్నప్పుడే వృద్ధుడిలా ఉండు
ఇంద్రియ నిగ్రహంలో నిబద్ధుడిలా ఉండు
చెప్పడమే గానీ ఆచరణ సాధ్యమేనా అన్నపురెడ్డీ!
కోరికలు జయించి అచ్చం బుద్ధుడిలా ఉండు.

**- ఎండ్లూరి సుధాకర్**
ఫోన్ : 9246650771






# చదవండి...







**భట్టిప్రోలు కథలు - రచయిత డా. నక్కా విజయకుమార్:** మొన్న అమరావతి కథలు, నిన్న పసలపూడి కథలు. ఆ మధ్య పెన్నేటి కథలు, నేడు భట్టిప్రోలు కథలు. ఒక ప్రాంతపు జనజీవన స్రవంతిని కన్నులముందు నిజాయితీతో సాక్షాత్కరింపజేసిన సామాన్య మానవుల జీవన అంతరంగ స్మరణ ఇది. ప్రతికథలోనూ జీవం ఉంది, జీవితం ఉంది, విశ్లేషణ ఉంది, వ్యాఖ్యానం ఉంది. పినిశెట్టి, మోహన్‌లు వేసిన అందమైన బొమ్మలున్నాయి. 'యానాదుల దిబ్బ' కథ అద్భుతం. కొన్ని కథలు కథాసాహిత్యంలో కలకాలం నిలబడే విలువ గలవి. కథాసాహిత్యంపై మక్కువ వున్నవారు తప్పక చదవ వలసిన పుస్తకం.

**తెలంగాణాలో ఉక్కు పరిశ్రమ-రచయిత డా.ఎస్. జైకిషన్ :** యుద్ధంలో వాడబడే కత్తులు, కటారులకు ప్రపంచంలోనే పేరెన్నికగన్న దేశం షెఫీల్డ్ డెమాస్కస్. ఆ దేశానికి ఇనుము, ఉక్కు ముడి సరుకుగా, భారతదేశం నుండే ఎగుమతయింది. భారతీయులు సగర్వంగా తలెత్తుకుని నిలబడి చాటిచెప్పే ఈ ఉక్కుపరిశ్రమ చారిత్రక ఆనవాళ్ళను దాదాపు 1800 తెలంగాణా గ్రామాలలో సుదీర్ఘ క్షేత్ర పర్యటన చేసి, చారిత్రకంగా పరిశోధించి వ్రాసిన శాస్త్ర విజ్ఞాన రచన యిది. అనేక రాతియుగ సమాధుల్లో నిక్షిప్తమైన రాగి, ఇనుము పనిముట్ల శ్రేష్ఠత, నాణ్యత, అబ్బురపరచే నైపుణ్యం, వెనుకనున్న లోహశాస్త్ర వారసత్వాన్ని వెలికితీసిన రచయిత అభినంద నీయుడు.

**సిద్ధనాగార్జునిని రసేంద్ర మంగళం - రచయిత కుర్రా జితేంద్రబాబు :** 'అన్ని వేదాల్లో ఉన్నాయిష' అన్న ఒక స్వీపింగ్ స్టేట్‌మెంట్‌ను పచ్చి స్వోత్కర్షగా, జోక్‌గా తీసుకుంటున్న ఈ రోజుల్లో, ఎప్పుడో వ్రాయబడి కాలగతిలో జీర్ణమవుతున్న ప్రామాణిక గ్రంథాలను సేకరించి, పరిశోధన చేసి, అందులో వున్న విషయాలు ఇవి అని స్పష్టంగా, సరళంగా తెనుగు చేసి మన ముందుంచారు చరిత్ర పరిశోధకులు, రచయిత అయిన జితేంద్రబాబు. ప్రపంచంలో అత్యంత ప్రాచీన వైద్య విధానంలో ఆయుర్వేదం ముఖ్యమయినది. ఈనాటికి వాసి చెడనిది. మొదట్లో ఆరోగ్యానికి, స్వస్థతకు అవసరమైన మొక్కలను గుర్తించిన ఆయుర్వేదం, ఆ తరువాత కాలంలో పాదరసం లాంటి లోహ రసాయనాలను వైద్యపరిధిలోనికి తీసుకువచ్చింది. ఇందులోనున్న విషయ సామగ్రినిబట్టి పరిశోధనలు సల్పి రుజువు చేయగలిగితే భారతీయ ప్రాచీన శాస్త్ర విషయాలు తిరుగు లేనివని మనం ప్రపంచానికి చాటి చెప్పగలుగుతాం. శుభస్యశీఘ్రం.

**వనమాలి :** స్వధర్మ సేవాసంస్థ, గుంటూరు వారు శ్రీకృష్ణ దేవరాయల పట్టాభిషేక పంచ శతాబ్ది ఉత్సవ సంచికగా దీనిని ప్రచురించారు. కృష్ణదేవరాయుల కాలం నాటి, రాజకీయ, ఆర్థిక, సామాజిక, శిల్ప, వాస్తు కళలపై లబ్ధప్రతిష్ఠులైన చరిత్రకారులు, సాహిత్యకారులు వ్రాసిన వ్యాసాల సంపుటిది. ఇందులో ఎన్నో చారిత్రక విశేషాలను పొందుపరిచారు. విజయనగర ఆయుర్వేద కళాశాలలో కొందరు అరబ్బు విద్యార్థులు చదువుకునేవారు. రాయలకు చైనా దేశంలో రాయబారాలుండేవి. న్యూనిజ్ బయటకు తీసిన తిమ్మరుసు కళ్ళను రాయలు పెరికించటం లాంటి విషయాలు సోదాహరణంగా చర్చించబడ్డాయి. కృష్ణదేవరాయల తత్వాన్ని సమగ్రంగా ఆవిష్కరించింది. రసజ్ఞలోకానికి సంపాదకుడు రవికృష్ణ యిచ్చిన కానుక యిది.

**ఆకుపచ్చని సజీవ సముద్రం నా నేల :** ఇవి ప్రకృతిపైనా, వర్తమాన జీవితంపైన వ్రాసిన కవితలు. రచయిత అద్దేపల్లి రామమోహనరావు 'చెట్లను నరికేవాడు కోయిలకూతల నెలా వింటాడు?' అంటూ ప్రశ్నిస్తాడు. ఏ.సి. గదుల్లో నివసిస్తూ,

ఏ.సి. కార్లలో ప్రయాణం జేస్తూ డబ్బుతో వేడెక్కిన బుఱ్ఱతో అంటూ మరో చమత్కారం విసిరారు. "వెలుగులోనుంచి, చీకటిలోకి నడిచాను. నీడను జయిస్తున్నానని గర్విస్తున్నాను" అన్న మాటలు మనల్ని ఆలోచింప జేస్తాయి. కోల్పోతున్న ఆధునిక మానవుని అస్తిత్వాన్ని ప్రశ్నిస్తాయి.

**నాలో నేను :** ఈ స్వీయ జీవన చిత్రణ రచయిత పాటిబండ్ల వెంకటపతిరాయలు. 95 సంవత్సరాల వయస్సులో ఆయన వ్రాసిన జీవన స్మృతులు ఇవి. నిరక్షరాస్య కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన పాటిబండ్ల వారు తమ ఊరు వీధి బడిలో ఉపాధ్యాయునిగా జీవితం ప్రారంభించి, అదే ఊరులో జాతీయ పాఠశాల (హైస్కూల్) ఏర్పాటుకు చేసిన ప్రయత్నం ఆయన చిత్తశుద్ధికి, సత్యనిరతికి, మానవతావాదానికి నిదర్శనాలు. 40 సం॥లు అధ్యాపకునిగా పనిచేసి అవి తన జీవితంలో అమూల్యమైనవిగా ఆయన చెప్పుకొచ్చారు. ఏ వ్యక్తి అయినా తన ఆలోచనలను, భావాలను సక్రమరీతిలో మళ్ళిస్తే సమాజానికి ఎంతో ఉపయోగపడతారనే దానికి ఆయన జీవిత మొక నిదర్శనంగా నిలుస్తుంది.

**బాల నిఘంటువు :** సాకం ప్రభాకరరావు సమర్పణలో వచ్చిన ఈ పుస్తకం పిల్లలకే కాదు, పెద్దలకూ ఉపయోగపడేలా ఉంది. వ్యాకరణము, నిఘంటువులు విద్యార్థులను అంతగా ఆకర్షించవు. వాటిని పిల్లలు ఇష్టపడేలా చెప్పటంలో రచయిత ప్రతిభ ద్యోతకమవుతుంది. అర్థభేదంతో కూడిన సామ్యపదాలు (ఉదా. అనలము = అగ్ని, అనిలము = వాయువు లాంటివి) పర్యాయపదాలు, వ్యతిరేకపదాలు లాంటి వాటిని చక్కగా వివరించారు. మొత్తం విషయాలను 90 పేజీలలో ముగించారు. ఇది మరింత విస్తృతంగా ఉంటే, పుస్తకము మరింత ప్రయోజకంగా వుంటుంది. తమ ద్వితీయ ముద్రణలో దీనిని మరింత పెంచి వ్రాస్తారని ఆశిద్దాము.

**పోలీసు సాక్షిగా :** సంఘశ్రేయస్సుకు శాంతి భద్రతలు అత్యంత కీలకమైనవి. వాటిని కాపాడవలసిన బాధ్యత పోలీసు శాఖది. కత్తిమీద సాములాంటి ఉద్యోగ నిర్వహణలో ఏ చర్య అయినా తక్కువైతే ముప్పు, ఎక్కువైతే తప్పు అన్నట్లుగా సాగుతుంది. ప్రజాభిప్రాయము పోలీసులపై ఎప్పుడూ సానుకూలంగా స్పందించదు. అన్ని ప్రభుత్వ రంగాల్లానే ఇక్కడ కూడ వ్యవస్థీకృతమైన లోపాలు ఉండవచ్చును. ఏ కొందరో వాటిని తమ స్వార్థానికి ఉపయోగించుకుంటూ ఉండవచ్చు. అంతమాత్రంచేత వ్యవస్థ అంతా అలానే ఉంటుందనే అపోహలోనికి ప్రజలు నెట్టివేయబడుతున్నారు. కొన్ని రచనలు కేవలం నెగెటివ్ సైడ్‌ను (అవి అక్షర నిజాలు కావచ్చును) మాత్రమే చూపిస్తే, మరి కొన్ని రచనలు స్వోత్కర్షతో నిండి వుంటాయి. ఈ రెండు దృక్పథాలకు దూరంగా తేలికగా చెప్పబడ్డ ఒక పోలీసు ఆఫీసరు జీవితంలోని కొన్ని సంఘటనల కూర్పు ఈ పుస్తకం.

పోలీసుశాఖలో పేరొందిన రచయిత లెందరో ఉన్నారు. నాలుగు దశాబ్దాలు పైగా విద్యార్థి దశనుంచీ రచయితగా పేరు గాంచిన సీతారామయ్య ఐ.పి.ఎస్. శంఖంలాంటి కలం నుంచి జాలువారిన ఈ రచన తీర్థం కాకుండా పోతుందా?

**అలంపూర్ :** ఇది గుడిపేరుతో ప్రసిద్ధి చెందిన ఊరు. ఆరో శతాబ్దానికిచెందిన ఈ క్షేత్రాన్ని శైవులు, శాక్తేయులు దర్శించేవారు. ఇక్కడ తొమ్మిది ముఖ్య దేవాలయాలున్నాయి. అన్నీ బదామి చాళుక్యులు నిర్మించినవే. ఇవి అద్భుతమైన శిఖరాలతో అలరారుతుంటాయి. వీటిని నవబ్రహ్మ దేవాలయాలంటారు. శివుడు–బాలబ్రహ్మేశ్వరునిగా, పార్వతి–జోగులాంబగా దర్శనమిస్తారు. అష్టాదశపీఠాలలో ఇది కూడా ముఖ్యమైనది. ఇక్కడ ఎల్లమ్మ, రేణుక అనే గ్రామదేవతలుకూడా ప్రసిద్ధి చెందారు. తుంగభద్ర ఎడమగట్టున, కృష్ణా, తుంగభద్ర సంగమం దగ్గరల్లో ఉన్న అలంపూర్ క్షేత్రాన్ని 'దక్షిణకాశి' అంటారు. ఇక్కడ చాళుక్యుల, రాష్ట్రకూటరాజులకి చెందిన మ్యూజియం ఉన్నది. మరిన్ని వివరాలు ఏ.పి. టూరిజంవారు వెలువరించిన 'అలంపూర్' పుస్తకంలో చూడవచ్చు.

**మనిషికోసం:** శీలా వీర్రాజు ముఖచిత్ర కల్పన చేసిన ఈ పుస్తకం గుత్తికొండ సుబ్బారావు మొదటి కవితాసంపుటి. 'ఆధునిక కవి ఆశాజీవి' అని, 'నేటి కవిత అక్షరాల మనిషికోసమే' అని, ముందుగానే సినారె హెచ్చరించినా, 'ఎడారి పుష్పిస్తుందని' 'అత్యాశ జాతి కవులకే అలవాట'ని కుందుర్తి అన్నా, ఇదంతా సుబ్బారావు కవిత్వంలోగల ఆశావాదాన్ని ముందుకు తెచ్చే ప్రయత్నమే. 'నీతివాక్యాల గుడ్లు పెడుతూ / ప్రబోధాల పొదుగు పొదగొద్దు' అని; 'నట్లు సరిచేసి పట్టుబిగించి' అని లయబద్ధంగా మేలుకొల్పాలనే ప్రయత్నం అత్యాశ కాదేమో. 'తాగుబోతు నడకలా/జీవితం గాడి తప్పుతోంది' అంటూ నిర్లిప్తంగా; 'జీవితపు ఎడారిలో పూలు పూచే సమయం' ఇది అశావాదమే, అయినా 'పదచిత్రా'లేమీ కనపడవు. ⓜ

# నవ్వులు

"జగత్ప్రఖ్యాతి వడసిన - షేక్స్పియర్ త్రాగుబోతు, షెరిడెన్ త్రాగుబోతు, విల్సన్ త్రాగుబోతు, నెల్సన్ త్రాగుబోతు. మనలో వ్యాసుడు త్రాగుబోతు, వాల్మీకి త్రాగుబోతు, కాళిదాసు త్రాగుబోతు, కబీరుదాసు త్రాగుబోతు. ముప్పది మూడు కోట్ల దేవతలు త్రాగుబోతులు. మునులందఱు త్రాగుబోతులు. ఇప్పటి నాగరిక ప్రపంచంలో త్రాగనివానికి తావే లేదు. త్రాగినవాడే యూరికి తలమానికము-త్రాగినవాడే నలుగురిలో తగపరి! త్రాగిన వానికే యూరిలో దాక్షిణ్యము - త్రాగినవానికే యింటిలో ధర్మపిండము! త్రాగిన వానికే సభలో తాంబూలము-త్రాగిన వానికే మేజువాణిలో దండము! ప్రభువు త్రాగక పాలింపలేడు. సేవకుడు త్రాగక సేవింపలేడు. వకీలు త్రాగక వాక్కు మెదపలేడు. వైద్యుడు త్రాగక వ్యాధిని గనిపెట్టలేడు. కవి త్రాగక కలం పట్టలేడు. గాయకుడు త్రాగక కంఠమెత్తలేడు. పూజారి త్రాగక పులకాపు పెట్టలేడు. అర్చకుడు త్రాగక హారతి పట్టలేడు. వంటవాడు త్రాగక వండలేడు. వడ్డనవాడు త్రాగక వడ్డింపలేడు. పెండ్లిలో త్రాగుడు, పేరంటములో త్రాగుడు, విందులో త్రాగుడు, వీడుకొలుపులో త్రాగుడు, క్లబ్‌లో త్రాగుడు, గ్రంథకంటిలో త్రాగుడు, రచ్చలో త్రాగుడు, రైలులో త్రాగుడు, భోగములో త్రాగుడు, రోగములో త్రాగుడు, చావులో త్రాగుడు, శ్రాద్ధములో త్రాగుడు. ఈ విధముగా త్రాగుడు ఇష్టదైవము వలె నిహపరసాధనమై - పడుగుపేకల వలె ప్రపంచమంతయు నిండి - గాలి, వెలుగులవలె గౌరవాదరములను బడసినది, వడయుచున్నది, వడయ నున్నది."

**- కాళ్ళకూరి నారాయణరావు**

"తురకలు ధ్యానకాలమున జెవులు మూసికొందురు. మనవారు ముక్కు మూసికొందురు. బ్రహ్మసామాజికులు కన్నులు మూసికొందురు. మరికొందరు నోరు మూసికొందురు. ప్రార్థన కాలమందలి దేహావస్థలు పలువిధములయి యున్నవి. ప్రధానమగు భక్తియున్న యెడలనివి యెన్ని భేదములుగనున్నను బ్రమాదము లేదు. దౌడలు గొట్టుకొనవచ్చును గాని, మనసులోని యూపులాట లాపవచ్చునా? కణతలు బొడుచుకొనవచ్చును గాని దుష్టచింతల బొడవ వచ్చునా? మోకాళ్ళపై వంగగలరు గాని మనోనైచ్యమున వంగవచ్చునా? బింకముగ బద్మాసనమున గూర్చుండవచ్చును గాని, గట్టిగ మనస్సున గట్టదగునా? దైహికావస్థలు మనోనిశ్చలత్వమునకు - నందు మూలమున భక్తిజ్ఞానములకు సదుపాయములై యుండి బ్రదానములగునట్టి మనస్థితుల గూర్చి మనవారికి జింతయేలేదు. పైగతులే భక్తియనుకొనుచున్నారు. మత సంబంధమగు ప్రాశస్త్యముకాని, మనస్సంబంధమగు నిశ్చలత్వముగాని మనకెక్కడ గనుపట్టుచున్నదనగా - నుదుట ముక్కు చివర - వృష్ఠదేశమున."

**-పానుగంటి లక్ష్మీనరసింహారావు**

"మా ఇంటిది ఋతుస్నాతయై మడిబట్ట గట్టుకొని మంచి ముహూర్తమున రాత్రివేళ విభూతిపండ్లు దూర్వాలు గోమయము పళ్లెరములో నుంచుకొని సంతానాపేక్ష మునిముని నవ్వులు నవ్వుకొనుచు నా యెదురు నిలువబడును. ఓహో! అభిప్రాయ మిదిగదాయని దివ్యదృష్టిచే గ్రహించి, యామెకు బ్రసన్నుడనై యిట్టె యాదరించి, యట్టె యాశీర్వదించి పంపివేయుదును. చటుక్కున సద్యోగర్భము. ఇంతే యిందులోనున్న కర్మ రహస్యము! ఇంతే మా సంతానపు గిటుకు. ఇట్లు పూర్వయుగములలో జరిగినది. ఆ యనూచానమునే యిప్పటివరకు లాగుకొని వచ్చుచున్నాను. ఇన్ని మాటలేల? వాల్మీకి మహర్షి యొద్దకు ఋతుస్నాతలై యంబికాంబాలికలు పోయినప్పుడు, వాలి సుగ్రీవులు బ్రసాదించి యా మహర్షి యాదవకులము నుద్ధరించినట్లు, నేను మా వంశము నీ తీరుగ నిలువబెట్టినాను."

**- పానుగంటి లక్ష్మీనరసింహారావు**

ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి.
వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.

**I. మిసిమి ప్రచురణలు** ₹

| | | | |
|---|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | (హార్డ్ బౌండ్) | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | *అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి* | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు | " " | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు | " " | 200.00 |
| 5 | ఆచార్య నాగార్జునుడు | " " | 150.00 |
| 6. | దూర తీరాలలో... | *వల్లభనేని అశ్వినీకుమార్* | 99.00 |
| 7. | అమాహ | " " | 60.00 |
| 8. | అంతర్వీక్షణం | " " | 60.00 |
| 9. | సిద్ధార్థ | " " | 100.00 |
| 10 | నాలో నేను | " " | 60.00 |
| 11. | కథాంజలి-1 | *ఎస్సారె* | 80.00 |
| 12. | కథాంజలి-2 | " " | 110.00 |
| 13. | THE THUNDERCLOUD | S.R.A. | 120.00 |
| 14. | భట్టిప్రోలు కథలు | డా. నక్కా విజయరామరాజు | 150.00 |
| 15. | రెండు దశాబ్దాలు - కథ 1990-2009 | కథా సాహితి | 150.00 |

**II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన - *మరుపూరు కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన - *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన - *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం : జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన - *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం - *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |

**III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | బౌద్ధ ధర్మ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 2. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 3. | మిళింద పన్హ : ఉపమలు - *బోధ చైతన్య* | 75.00 |
| 4. | మహా పరిత్తం - *బోధ చైతన్య* | 100.00 |
| 5. | జాతక కథలు - *శివశంకర స్వామి* | 60.00 |

**IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? | 40.00 |

***మిసిమి పూర్వ సంచికలు కావాలంటే సం॥, నెల తెలుపుతూ ఒక కార్డు రాయండి***

**మిసిమి**
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in ; Visit us at : www.misimi-monthly.com

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹200/- తో పాటు పంపండి. బయటి చెక్కులకు అదనంగా ₹30/- కలపండి.

**1. పేరు :** ........................................................................................................

**2. చిరునామా :**

ఇం.నెం. ........................................................................................

వీథి ........................................................................................

పేట ........................................................................................

ఊరు ........................................................................................

పిన్ ........................................................................................

సెల్ ........................................................................................

**3. సంతకం :** ........................................................................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

మిసిమి
మాసపత్రిక


**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com



కలయిక (రాజన్‌బాబు)

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2009-11



దేవదూత (జాన్ విలియమ్ వాటర్‌హౌస్)